www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



లొంగిపోయిన మావోయిస్టు నేతలు పుల్లూరి ప్రసాదరావు, బండి ప్రకాశ్‌లతో తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఎస్ఐబీ చీఫ్ సుమతి

మావోయిస్టు అగ్రనేతల
లొంగుబాటు
జనజీవన స్రవంతిలోకి పుల్లూరి ప్రసాదరావు, బండి ప్రకాశ్
మా సిద్ధాంతం ఓడిపోలేదు: పుల్లూరి

2

బుధవారం | 29-10-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 193 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి ఉ.9.23 తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తరాషాఢ సా.5.30 తదుపరి శ్రవణం, వర్జ్యం: రా.9:40-11:20, దుర్ముహూర్తం: ఉ.11:35-12:21, అమృతఘడియలు: ఉ.10:38-12:21, రాహుకాలం: ఉ.12:00-1:30, సూర్యోదయం: 6:16, సూర్యాస్తమయం: 5:41 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



భారీ వాహనాలు ఎక్కడివక్కడే

అనకాపల్లి జిల్లా నూతనగుంటపాలెం వద్ద జాతీయ రహదారిపై ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంగళవారం రాత్రి భారీ వాహనాలను నిలిపివేసిన పోలీసులు

సమగ్ర కథనాలు 11, 12లో



పెను గాలుల హోరు

కృష్ణా జిల్లా మంగినపూడి బీచ్ వద్ద పెనుగాలుల కల్లోలం

మొంథా బీభత్సం

గాలులు, వర్షాలతో కుదిపేసిన తుఫాన్



కోనసీమ జిల్లా బోడసకుర్రులో గాలులకు నేలకూలిన భారీ మామిడి వృక్షం



పశ్చిమ గోదావరి జిల్లా గుమ్మలూరులో రోడ్డుపై పడ్డ విద్యుత్ స్తంభం

భారీ వృక్షాలు, స్తంభాలు నేలమట్టం

- అర్ధరాత్రి సమయానికి తీరం దాటిన 'ముప్పు'
- బందరు వద్ద 100 కిలోమీటర్ల వేగంతో గాలులు
- పలు తీర గ్రామాల్లో అలుముకున్న చీకట్లు
- ప్రభావిత ప్రాంతాల్లో కుప్పకూలిన వృక్షాలు
- గోదావరి జిల్లాల్లో చెట్లు కూలి ఇద్దరు మృతి.. నెల్లూరు జిల్లాలో వాగులో ఒకరి గల్లంతు
- పలు జిల్లాల్లో పంటలను ముంచిన తుఫాను
- కావలిలో 22, ఉలవపాడులో 17 సెం.మీ. వర్షం
- రాష్ట్రంలో నేడూ కొనసాగనున్న భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఆకస్మిక వరదల హెచ్చరిక
- పునరావాస కేంద్రాలకు 75 వేల మంది
- వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

7 జిల్లాల్లో కల్లోలం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తీవ్ర తుఫాన్ మొంథా బీభత్సం సృష్టించింది! హోరుగాలులు, జోరు వానలతో వణికించింది! మంగళవారం అర్ధరాత్రి తర్వాత తీరం దాటింది. ఈ సమయంలో 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచాయి. అప్పుడప్పుడు వాయువేగం 110 కిలోమీటర్లకూ చేరింది. తీవ్ర తుఫాన్ కారణంగా మంగళవారం తీర ప్రాంతమంతా రాకాసి అలలు

మిగతా 11వ పేజీలో...

తీరం దాటినా అప్రమత్తంగానే ఉండాలి: సీఎం

రామాయపట్నం రిఫైనరీపై మరో

ముందడుగు



మంగళవారం హైదరాబాద్‌లో ఎంవోయూ పత్రాలతో బీపీసీఎల్ ఇన్‌చార్జి సీఎండీ సంజయ్ ఖన్నా, ఓఐఎల్ చైర్మన్ రంజిత్ రథ్. చిత్రంలో కేంద్ర పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ తదితరులు

- ఆయిల్ ఇండియాతో బీపీసీఎల్ అవగాహనా ఒప్పందం
- ప్రాజెక్టు ఏర్పాటుకు పరస్పర సహకారం.. ఓఐఎల్‌కు ఈక్విటీ
- ఇప్పటికే రిఫైనరీకి కీలక అనుమతులు, 6 వేల ఎకరాలు
- ఈ ప్రాజెక్టుతో ఇంధన, పెట్రో కెమికల్స్‌లో స్వావలంబన: బీపీసీఎల్

అమరావతి/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం సమీపాన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ/పెట్రోకెమికల్ కాంప్లెక్స్ నిర్మాణం దిశగా మరో ముందడుగు పడింది. దీని స్థాపనలో పరస్పర సహకార అవకాశాలను అన్వేషించేందుకు బీపీసీఎల్ ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్)తో

మిగతా 10వ పేజీలో...

ప్రజాభీష్టం.. పాలనా సౌలభ్యం!

- జిల్లాల పునర్వ్యవస్థీకరణలో ఇవే ముఖ్యం: సీఎం.. పవన్‌తో కలిసి సమీక్ష
- కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలపై ఇప్పటివరకు 12 వేల వినతులు
- గత తప్పులన్నీ సరిచేయాలి.. కొత్త ఇబ్బందులు రాకుండా చూడాలి
- భవిష్యత్‌లో జరిగే నియోజకవర్గాల పునర్విభజననూ దృష్టిలో పెట్టుకోవాలి
- సీఎం దిశా నిర్దేశం.. కొత్త జిల్లాలుగా మార్కాపురం, మదనపల్లె!

3

8వ వేతన సంఘం విధివిధానాలకు ఓకే

- జనవరి 1 నుంచి సిఫారసులు అమలయ్యే అవకాశం
- కమిషన్‌కు జస్టిస్ రంజనా దేశాయ్ సారథ్యం
- యూరియాయేతర ఎరువులపై సబ్సిడీ పెంపు
- బిహార్ ఎన్నికల వేళ ఎన్డీఏ సర్కారు కీలక నిర్ణయాలు

2

అర్హత ఉంటేనే సోషల్ మీడియా కామెంట్!

» ఇన్‌ఫ్లుయెన్సర్ల విషయంలో చైనా కొత్త రూల్స్

న్యూఢిల్లీ, అక్టోబరు 28: నేటి టెక్ యుగంలో సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్లు చేసే పోస్టులు, వారు చెప్పే అంశాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. ఎక్కువ మంది ఫాలోవర్లను సంపాదించుకొనేందుకు తగిన అర్హతలు లేకుండానే క్రియేటర్లు ఆరోగ్య సూచనల నుంచి ఆర్థిక పరమైన అంశాలపై వరకు సూచనలు చేస్తుంటారు. వారు చెప్పేవన్నీ నిజమని కొంత మంది భావిస్తుంటారు. ఈ విధంగా తప్పుడు సమాచారం వ్యాప్తి అవుతున్న నేపథ్యంలో చైనా పలు కీలక నియంత్రణలు తీసుకొచ్చింది. ఆరోగ్యం, చట్టాలు, విద్య, ఆర్థికం వంటి కీలక అంశాలపై ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో చర్చించాలంటే తగిన అధికారిక అర్హత ఉండాలని పేర్కొంది. ఈ మేరకు ఈనెల 25 నుంచి 'కొత్త ఇన్‌ఫ్లుయెన్సర్ చట్టం' ఆ దేశంలో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ఇన్‌ఫ్లుయెన్సర్లు పైన పేర్కొన్న అంశాలపై పోస్టులు చేయాలంటే తమ నైపుణ్యానికి సంబంధించిన డిగ్రీ పట్టా, ప్రొఫెషనల్ లైసెన్స్ లేదా సర్టిఫికేషన్ వంటి ఆధారాలు చూపాల్సి ఉంటుందని మొరాకో న్యూస్ నివేదించింది. నకిలీ సమాచారాన్ని కట్టడి చేసేందుకు, తప్పుదారి పట్టించే సలహాల నుంచి ప్రజలను కాపాడే లక్ష్యంతో ఈ నిబంధనలు తీసుకొచ్చినట్లు సైబర్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ చైనా (సీఏసీ) పేర్కొంది. ఆన్‌లైన్ కంటెంట్‌పై విశ్వాసాన్ని పెంపొందించడం, కచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు కొత్త నిబంధనలు తీసుకొచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే ఇవి డిజిటల్ సెన్సార్‌షిప్‌కు కొత్త రూపమని విమర్శకులు చెబుతున్నారు.

యూఏఈలో తెలుగోడికి 240 కోట్ల లాటరీ



అబుదాబి, అక్టోబరు 28: అదృష్టం ఎప్పుడు, ఎవరిని వరిస్తుందో చెప్పలేం! అబుదాబిలో నివసిస్తున్న ఓ తెలుగు యువకుడికి అమ్మ సెంటిమెంట్ అనుకోని అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఏకంగా రూ. 240 కోట్ల జాక్‌పాట్ వరించేలా చేసింది. యూఏఈ లాటరీ చరిత్రలోనే అతిపెద్ద మొత్తాన్ని గెలుచుకున్న ఈ అదృష్టవంతుడి పేరు అనిల్‌కుమార్ బోళ్ల. 29 ఏళ్ల ఈ యువకుడి జీవితం ఒక్క రాత్రిలో పూర్తిగా మారిపోయింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనిల్‌కుమార్ చాలా కాలంగా అబుదాబిలో ఉంటున్నారు. అనిల్‌కు లాటరీ టికెట్‌లు కొనే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే ఈనెల 18న జరిగిన లక్కీ డే డ్రాలో విజేతగా నిలిచారు. అందులో యూఏఈలోనే రికార్డు స్థాయిలో 100 మిలియన్ దిర్హామ్స్ గెలుచుకున్నారు. "ఇందులో నా ప్రత్యేకత ఏమీ లేదు. అందరిలానే టికెట్ కొన్నాను. కానీ, అందులో ఆఖరి నంబరు చాలా ప్రత్యేకం. మా అమ్మ పుట్టినరోజునే ఆ నంబరుగా ఎంచుకున్నాను" అంటూ లాటరీ సంస్థ తనకు చెక్కు అందజేసిన సందర్భంగా అనిల్ తన విజయం వెనుక ఉన్న రహస్యాన్ని చెప్పారు. ఈ బహుమతి మొత్తాన్ని ఎలా ఖర్చు చేయబోతున్నారని అడగ్గా, 'ఈ డబ్బును సరైన పద్ధతిలో పెట్టుబడిగా పెట్టాలనుకుంటున్నా. ఒక సూపర్ కారు కొని అందులో జాలీగా తిరగాలనే కోరిక ఉంది. నా కుటుంబాన్ని యూఏఈకి తీసుకువచ్చి, వారితో కలిసి జీవితాంతం ఇక్కడే ఆనందంగా గడపాలనుకుంటున్నా. అమ్మానాన్నలకు ఏవైనా కోరికలుంటే వాటిని నెరవేరుస్తా. కొంత భాగాన్ని చారిటీలకు విరాళమిస్తా" అని అనిల్ చెప్పారు.

లోకం తీరు



8వ వేతనసంఘం విధివిధానాలకు

కేంద్రం ఆమోదం

» వచ్చే జనవరి 1 నుంచి సిఫారసులు అమలయ్యే చాన్స్
» కమిషన్‌కు జస్టిస్ రంజనా దేశాయ్ సారథ్యం
» యూరియాయేతర ఎరువులపై సబ్సిడీ పెంపు
» బిహార్ ఎన్నికల వేళ మోదీ సర్కారు కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 28: లక్షలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదార్లకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 8వ వేతన కమిషన్ విధివిధానాలకు ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాశ్ దేశాయ్ కమిషన్‌కు సారథ్యం వహించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి కమిషన్ సిఫారసులు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఫలితంగా 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనుదార్లకు ప్రయోజనం చేకూరనుంది. మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 8వ వేతన సంఘం విధివిధానాలకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం.. 8వ వేతన సంఘం ఏర్పాటైనప్పటి నుంచి 18 నెలల్లోపు తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఈ మధ్య కాలంలో పూర్తయిన తాత్కాలిక నివేదికలను ఎప్పటికప్పుడు అందజేస్తుంది. ఈ ఏడాది జనవరిలోనే వేతన సంఘం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. 8వ వేతనసంఘంలో ఐఐఎం బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ పులక్ ఘోష్ తాత్కాలిక సభ్యులుగా, కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్‌జైన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం అమలులో ఉన్న జీతభత్యాలు, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు రంగంలోని ఉద్యోగులకు అందుతున్న ప్రయోజనాలు, వేతనాలు, దేశంలోని ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు అందుబాటులో ఉన్న నిధులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని వేతన సంఘం సిఫారసులు చేయనుంది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ క్యాబినెట్ నిర్ణయం తాలూకు వివరాలు వెల్లడిస్తూ.. వేతనసంఘం తాత్కాలిక నివేదికలు వచ్చిన తర్వాత సిఫారసుల అమలు తేదీని నిర్ణయిస్తామని.. అయితే, 2026 జనవరి 1వ తేదీ నుంచే అమలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను, పింఛనుదార్ల పింఛన్లను సవరించటానికి ప్రతీ పదేళ్లకోమారు కేంద్రం వేతనసంఘాన్ని నియమిస్తుంది.

ఎరువులకు సబ్సిడీ పెంపు

2025-26 రబీ సీజన్‌కు సంబంధించి ఫాస్ఫరస్, సల్ఫర్ వంటి యూరియా యేతర ఎరువులపై సబ్సిడీని పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఫాస్ఫేట్‌పై ప్రస్తుతం కిలోకు ఇస్తున్న సబ్సిడీ రూ.43.60 కాగా.. దీనిని రూ.47.96కు పెంచారు. సల్ఫర్ ఎరువులపై ప్రస్తుత సబ్సిడీ కిలోకు రూ.1.77 కాగా.. రూ.2.87కు పెంచారు. మొత్తంగా ఈ రెండు రకాల ఎరువులకు ఇస్తున్న సబ్సిడీ కోసం రూ.37,952 కోట్లను కేటాయించారు. కాగా, నైట్రోజన్ (కిలోకు రూ.43.02), పొటాష్ (కిలోకు రూ.2.38)ల మీద ఉన్న సబ్సిడీలో ఎటువంటి మార్పుల్లేవు.

ఈపీఎఫ్‌వో వేతన పరిమితి 25 వేలకు పెంపు?

న్యూఢిల్లీ, అక్టోబరు 28: ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చే ప్రైవేటు ఉద్యోగులు, కార్మికుల గరిష్ఠ మూల వేతనాన్ని (బేసిక్ పే) రూ.25 వేలకు పెంచేందుకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం గరిష్ఠంగా రూ.15 వేల వరకు మూల వేతనమున్న ఉద్యోగులంతా తప్పనిసరిగా ఈపీఎఫ్‌వో పరిధిలోకి వస్తున్నారు. ఆపై వేతనమున్న ఉద్యోగులు, కార్మికులు ఈపీఎఫ్‌లో చేరడం తప్పనిసరికాదు. ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చిన ఉద్యోగులకు వారి పదవీ విరమణ తర్వాత ఈపీఎఫ్ కింద ఏకమొత్తంలో సొమ్ము చేతికి అందుతుంది. దానికితోడు ఎంప్లాయీస్ పెన్షన్ పథకం (ఈపీఎస్) కింద జీవితాంతం నిర్ణీత మొత్తంలో పెన్షన్ కూడా వస్తుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కనీస వేతనాలు పెరిగిన నేపథ్యంలో.. చాలా మంది ఈపీఎఫ్‌వోలో పరిధిలోకి రాకుండా పోతున్నారని, దీనితో జీవిత చరమాంకంలో వారికి ఆదాయం, స్థిరమైన పెన్షన్ అందకుండా పోతున్నాయనే భావన ఉంది. ఈ క్రమంలోనే ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చే మూల వేతన పరిమితిని రూ.25 వేలకు పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు ఈపీఎఫ్‌వో వర్గాల సమాచారం. మరో రెండు నెలల్లో జరిగే ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డు సమావేశంలో దీనిపై నిర్ణయం వెలువడనున్నట్లు తెలిసింది. ఈ పెంపు వల్ల 10 లక్షల మంది అదనంగా ఈపీఎఫ్‌వో పరిధిలోకి వస్తారని అంచనా.

భారత్‌లో 200 పౌర విమానాల తయారీ

» రష్యా సంస్థ యూఏసీతో హాల్ కీలక ఒప్పందం

న్యూఢిల్లీ, అక్టోబరు 28: భారత్‌లోనే తొలిసారిగా పూర్తిస్థాయి ప్రయాణికుల విమానాలు తయారు కాబోతున్నాయి. రష్యాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ) సహకారంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్).. భారత్‌లోనే ఎస్‌జే-100 విమానాలను తయారు చేయనుంది. ఈ మేరకు ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ట్విన్ ఇంజన్, న్యారో బాడీతో నిర్మించనున్న ఈ విమానాలు ఉడాన్ పథకం కింద స్వల్ప దూర ప్రయాణాలకు మరింత ఊతమివ్వనున్నాయని హాల్ మంగళవారం తెలిపింది. టైర్-2, టైర్-3 నగరాల మధ్య ప్రాంతీయ అనుసంధానం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో ఉడాన్ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 200కిపైగా ఎస్‌జే-100 విమానాలను 16 విమానయాన సంస్థలు నడుపుతున్నాయి. రష్యాకు చెందిన యూఏసీ వెబ్‌సైట్‌లో పొందుపరచిన వివరాల ప్రకారం ఎస్‌జే-100 చిన్న పరిణామం కలిగిన విమానం. దీనిలో 103 మంది ప్రయాణించవచ్చు.

లుఫ్తాన్సా విమానంలో ఘర్షణ

» ఇద్దరు టీనేజర్లను ఫోర్క్‌తో పొడిచి, మహిళను కొట్టిన తెలుగు యువకుడు



న్యూఢిల్లీ, అక్టోబరు 28: షికాగో నుంచి ఫ్రాంక్‌ఫర్ట్ వెళుతోన్న లుఫ్తాన్సా విమానంలో ప్రణీత్ కుమార్ ఉసిరిపల్లి(28) అనే తెలుగు యువకుడు శనివారం ఇద్దరు టీనేజర్లను ఫోర్క్‌తో పొడిచి గాయపరిచాడు. అంతేగాక విమానం సిబ్బందిపైనా దాడికి ప్రయత్నించాడు. దీంతో ఆ విమానాన్ని అత్యవసరంగా బోస్టన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. మారణాయుధంతో ఇతరులకు హాని చేసేందుకు ప్రయత్నించినట్లు అతడిపై మసాచుసెట్స్ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం అభియోగాలు మోపింది. విమానంలో ఇద్దరు 17 ఏళ్ల బాలురపై మెటల్ ఫోర్క్‌తో దాడి చేసిన ప్రణీత్ కుమార్ వారిలో ఒకరి భుజంపై, మరొకరి తల వెనుక పొడిచాడు. పరిస్థితిని అదుపు చేసేందుకు వచ్చిన విమానం సిబ్బందికి తన చేతివేళ్లను తుపాకీలా చూపుతూ ట్రిగ్గర్ నొక్కినట్లు చేసి బెదిరించాడని అధికారులు చెప్పారు. అంతేగాక మరో మహిళా ప్రయాణికురాలిని కూడా చెంపపై కొట్టి విమానం సిబ్బంది ఒకరిని కూడా కొట్టేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. ప్రణీత్ గతంలో విద్యార్థి వీసాపై అమెరికాలో మాస్టర్స్ చదివాడని, ప్రస్తుతం ఎటువంటి వీసా లేకుండానే ఉంటున్నాడని తెలిపారు. అతడి నేరాలు నిర్ధారణ అయితే 10 ఏళ్ల జైలుశిక్ష, 2,50,000 డాలర్ల జరిమానా విధించే అవకాశం ఉంది.

మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

ఇద్దరు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగుబాటు.. జనజీవన స్రవంతిలోకి పుల్లూరి ప్రసాదరావు, బండి ప్రకాష్



బండిప్రకాశ్, పుల్లూరి ప్రసాదరావు

హైదరాబాద్/పెద్దపల్లి/మంచిర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీలో లొంగుబాట్ల పరంపర కొనసాగుతోంది. మంగళవారం మరో ఇద్దరు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ శంకరన్న అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ అలియాస్ బండి దాదా తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వీరిద్దరు లొంగిపోయారని డీజీపీ తెలిపారు. పుల్లూరి ప్రసాదరావు పేరిట రూ.25 లక్షల రివార్డు, బండి ప్రకాష్ పేరిట రూ.20 లక్షల రివార్డు ఉండగా.. ఆ మొత్తానికి సంబంధించిన డీడీలను వారికి డీజీపీ అందజేశారు. తెలంగాణలో ఈ ఏడాది ఇప్పటివరకు 427 మంది మావోయిస్టులు లొంగిపోయారని శివధర్‌రెడ్డి వెల్లడించారు.

ఆర్‌ఎస్‌యూ నుంచి ..

45ఏళ్లపాటు మావోయిస్టు పార్టీలో కొనసాగిన పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న స్వస్థలం పెద్దపల్లి జిల్లా వడ్కాపూర్ గ్రామం. 1979లో పెద్దపల్లి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో ప్రసాదరావుకు రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్‌ఎస్‌యూ)తో పరిచయాలు ఏర్పడ్డాయని, అప్పటి ఆర్‌ఎస్‌యూ ఆర్గనైజర్ దగ్గు రాజలింగుతో కలిసి అందులో చేరి పనిచేయడం ప్రారంభించారని డీజీపీ తెలిపారు. అదే క్రమంలో నాటి పీపుల్స్‌వార్ సీనియర్ నేత కిషన్‌జీకి కొరియర్‌గా పనిచేశారని వెల్లడించారు. 1981లో పీపుల్స్‌వార్ కేఎస్ గ్రూపు ఇతర రాష్ట్రాల్లోని మార్క్సిస్టు, లెనినిస్టు వర్గాలతో విలీనమై.. సీపీఐ(ఎంఎల్-పీపుల్స్‌వార్)గా ఏర్పడిందని, అప్పటినుంచి సిర్పూర్, చెన్నూరు దళాల్లో పని చేసిన చంద్రన్న 1995లో రాష్ట్ర కమిటీ సభ్యుడయ్యారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీగా మారిన పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుడిగా కార్యకలాపాలు నిర్వహించారని వివరించారు. అనారోగ్యం, సిద్ధాంత పరమైన విభేదాలు ఆయన జనజీవన స్రవంతిలోకి రావడానికి కారణమయ్యాయని తెలిపారు.

సికాస ద్వారా బండి ప్రకాష్..

లొంగిపోయిన మావోయిస్టు నేత బండి ప్రకాశ్ స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రి. 1982-84 మధ్య ఆర్‌ఎస్‌యూలో పనిచేస్తూ సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) ఆవిర్భావం తరువాత మావోయిస్టు పార్టీలో చేరారు. 1984లో సిర్పూర్ సాయుధ దళంలో చేరారని డీజీపీ తెలిపారు. ఏఐటీయూసీ నాయకుడు వీటీ అబ్రహంను హత్యచేసిన ముఠాలో ఉన్నారని, అప్పటినుంచి పార్టీలో దీర్ఘకాలం పనిచేశారని వెల్లడించారు. పార్టీలోని అంతర్గత విభేదాలు, అనారోగ్యం ఆయన లొంగుబాటుకు కారణమని తెలిపారు. కాగా, లొంగిపోయే మావోయిస్టులకు పూర్తి భద్రత కల్పిస్తామని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని డీజీపీ స్పష్టం చేశారు. లొంగిపోయిన వారిని ఏ విధంగా కాపాడుకోవాలో తమకు తెలుసునన్నారు. శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీ మహేష్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి పాల్గొన్నారు.

లొంగుబాటు తప్పంటూనే..!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ లొంగుబాటును తీవ్రంగా తప్పుబట్టి, ఆయుధం వదిలేదే లేదంటూ ప్రకటనలు చేసిన మావోయిస్టుల్లో పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న కూడా ఒకరు. లొంగుబాటు సమయంలో పార్టీ క్యాడర్‌కు మల్లోజుల 23 పేజీల లేఖ రాశారు. సాయుధ పోరాట విరమణపై అందరి అభిప్రాయాలు కోరారు. దానికి స్పందనగా తెలంగాణ పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరిట పుల్లూరి ప్రసాదరావు ఓ ప్రకటన విడుదల చేశారు. సోనూ ఉద్యమ ద్రోహి అంటూ మండిపడ్డారు. లొంగిపోవాలనుకునేవారు పార్టీకి ఆయుధాలు అప్పగించాలని ఆదేశించారు. కానీ ఇప్పుడు పుల్లూరి ప్రసాదరావుతోపాటు బండిప్రకాశ్ కూడా లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే తమకన్నా ముందే వీరిద్దరూ తెలంగాణ ప్రభుత్వ పెద్దలతో టచ్‌లో ఉన్నారని మల్లోజుల వర్గానికి చెందినవారు పేర్కొంటుండటం గమనార్హం.

ప్రజాక్షేత్రంలో పనిచేయడానికే వచ్చాం

తమది లొంగుబాటు కాదని పుల్లూరి ప్రసాదరావు అన్నారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రజాక్షేత్రంలో ప్రజల పక్షాన పోరాటం చేయడానికి వచ్చామని తెలిపారు. ఆయన 'లాల్ సలామ్' అంటూ నినదించి మీడియాతో మాట్లాడారు. 45 ఏళ్లు జనం కోసం పనిచేసిన తాము ఇకపై జనంలోనే ఉండి పోరాటం చేస్తామన్నారు. అనారోగ్య సమస్యలతో తాము బయటకు వచ్చామని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ భావజాలాన్ని ఓడించడం ఎవరి తరమూ కాదని, ప్రస్తుత పరిస్థితుల్లో నష్టాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. తమ సిద్ధాంతం ఓడిపోలేదని, మళ్లీ జనంలో పుట్టుకొస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీలో అంతర్గత చీలిక వచ్చిందని, ఆయుధాలతో లొంగిపోవాలని కొందరు, ఆయుధాలు వదిలి బయటకు వెళదామని మరికొందరు అనుకున్నారని చెప్పారు. ఇందులో తమ పార్టీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పక్షానే తాము ఉంటామని, ఆయనకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఇటీవల ఆయుధాలతో లొంగిపోయిన మల్లోజుల వేణుగోపాల్ విధానాలకు తాము వ్యతిరేకమన్నారు. మరికొన్ని రోజుల్లో తాము మీడియా సమావేశం ఏర్పాటు చేసి మావోయిస్టు పార్టీలో జరిగిన అంతర్మథనాన్ని ప్రజలకు వివరిస్తామని అన్నారు.

ట్రంప్ చెప్పినట్లే..?

» రష్యా చమురు కొనుగోళ్లు బంద్!
» అమెరికా ఆంక్షలతో నిలిపేసిన భారత రిఫైనరీలు

న్యూఢిల్లీ, అక్టోబరు 28: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్టుగానే రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గించుకుంటోందా? భారత రిఫైనరీ, పెట్రోలియం సంస్థలు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేస్తామని ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ఇటీవల ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు రష్యాకు చెందిన భారీ చమురు సంస్థలు ల్యూకోయిల్, రాస్‌నెఫ్ట్‌లపైనా ఆర్థిక ఆంక్షలు విధించారు. అటు యూరోపియన్ యూనియన్ కూడా పలు ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేయక తప్పడం లేదని పెట్రోలియం మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వ రంగం సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఇప్పటికే బహిరంగ మార్కెట్ నుంచి చమురు కొనుగోలు కోసం టెండర్ నోటీసు జారీ చేసిందని గుర్తు చేశాయి. మూడేళ్లగా రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్న రిలయన్స్ కూడా.. స్పాట్ మార్కెట్లో చమురు కొనుగోళ్ల చేపట్టిందని వెల్లడించాయి. అయితే రష్యా చమురుపై టోకున ఆంక్షలు విధించలేదని, కేవలం రెండు పెద్ద కంపెనీలపైనే విధించిందని భారత రిఫైనరీ వర్గాలు అంటున్నాయి. అందువల్ల ఆంక్షలు వర్తించని ఇతర రష్యా కంపెనీల నుంచి చమురు కొనుగోళ్లకు ప్రయత్నిస్తామని పేర్కొంటున్నాయి. నిజానికి రష్యా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న చమురులో 70శాతం వరకు రాస్‌నెఫ్ట్, ల్యూకోయిల్ సంస్థల నుంచే వస్తుండటం గమనార్హం. కాగా, అమెరికా ఆంక్షల నేపథ్యంలో విదేశాల్లో ఉన్న తమ ఆస్తులను విక్రయించేస్తున్నట్టు ల్యూకోయిల్ సంస్థ ప్రకటించింది. మరోవైపు అమెరికా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు భారీగా పెరుగుతున్నాయి. గణాంకాల సంస్థ కెప్లర్ డేటా ప్రకారం.. సోమవారం నాటికి అమెరికా నుంచి భారత చమురు దిగుమతులు సగటున రోజుకు 5.4 లక్షల బ్యారెళ్లకు (బీపీడీ) చేరాయి. గత ఏడాది సగటు దిగుమతులు 3 లక్షల బీపీడీ మాత్రమే కావడం గమనార్హం.

అమెజాన్‌లో 30 వేల ఉద్యోగుల తొలగింపు?

» సంస్థ కార్పొరేట్ ఉద్యోగాల్లో 10 శాతం కోత
» కంపెనీ చరిత్రలో ఇదే అత్యధికం

న్యూఢిల్లీ, అక్టోబరు 28: అమెజాన్ కంపెనీ సుమారు 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించనుంది. కంపెనీ చరిత్రలో ఇంత ఎక్కువమందిని తొలగించనుండటం ఇదే ప్రథమం. వ్యయాలు తగ్గించుకోవడం, కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, యాంత్రీకరణను వేగవంతం చేయడం లక్ష్యంగా ఇంత భారీ స్థాయిలో ఉద్యోగాల్లో కోత విధించనుంది. ఈ వారమే ఈ-మెయిల్‌ల ద్వారా సంబంధిత ఉద్యోగులకు సమాచారాన్ని పంపించే ప్రక్రియను ప్రారంభించనున్నట్టు తెలిసింది. అమెజాన్‌లో మొత్తం 15.5 లక్షల మంది పనిచేస్తుండగా వారిలో కార్పొరేట్ ఉద్యోగులు 3.5 లక్షల మంది ఉన్నారు. కార్పొరేట్ ఉద్యోగుల్లోనే సుమారు 10 శాతం మందిని తొలగించనుండటం గమనార్హం. అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్), ఆపరేషన్స్ టు డివైజెస్, సర్వీసెస్, మానవ వనరులు(పీఎక్స్‌టీ-పీపుల్ ఎక్స్‌పీరియెన్స్ అండ్ టెక్నాలజీ) తదితర బిజినెస్ యూనిట్లన్నింటిలోనూ ఉద్యోగాల్లో కోత విధించనుంది. ఒక్క పీఎక్స్‌టీ విభాగంలోనే 15 శాతం ఉద్యోగులను తొలగించనుంది. ఉద్యోగుల హోదాల మధ్య అంతరాన్ని తగ్గించడం, జవాబుదారీతనాన్ని పెంచడం, కృత్రిమమేధ ఆధారిత సమర్థతను పెంపొందించడం కోసం అమెజాన్ సీఈవో ఆండీ జెస్సీ ఉద్యోగాల కోతకు శ్రీకారం చుట్టారు. తొలుత అమెజాన్ కూడా కఠినమైన ఐదు రోజుల ఆఫీసు నియమాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే, అది కంపెనీ ఊహించినంత ఎక్కువ మంది స్వచ్ఛందంగా ఉద్యోగాలు వీడేలా చేయలేకపోయింది. దీంతో కంపెనీయే బలవంతంగా ఉద్యోగుల తొలగింపునకు శ్రీకారం చుట్టింది. కృత్రిమ మేధతో అమెజాన్ కార్పొరేట్ రూపురేఖలు మారిపోతున్నాయనేందుకు ఇదే సంకేతమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మైక్రోసాఫ్ట్, మెటా, గూగుల్ తదితర సంస్థలు కూడా ఈ ఏడాది ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకొంటున్నాయి.

ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం

» అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే
» పాత పింఛను విధానం కూడా అమలు
» బిహార్‌లో మహాకూటమి మేనిఫెస్టో
» 'తేజస్వీ ప్రాణ్ పత్ర్'గా అభివర్ణన



బిహార్‌లో మహా కూటమి మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న తేజస్వీయాదవ్, కూటమి పార్టీల నాయకులు

పట్నా, అక్టోబరు 28: యువతకు, మైనార్టీలకు ప్రాధాన్యం, భరోసా ఇస్తూ మహా కూటమి మంగళవారం ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. అధికారంలోకి వచ్చిన మొదటి 20 రోజుల్లోనే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ఘనంగా ప్రకటించింది. 25 అంశాలతో కూడిన ఈ మేనిఫెస్టోలో ఇదే అగ్రస్థానంలో ఉండడం గమనార్హం. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న జీవిక దీదీలను పర్మినెంట్ చేస్తామని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కూడా హామీల్లో ఒకటి. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టాన్ని బిహార్‌లో అమలు చేయబోమని స్పష్టం చేసింది. మరింత పారదర్శకంగా వక్ఫ్ ఆస్తులను నిర్వహించేలా విధానాలు రూపొందిస్తామని తెలిపింది. బోధ్ గయలోని బుద్ధ ఆలయాలు బౌద్ధులకే అప్పగిస్తామని ప్రకటించింది. మైనార్టీల రాజ్యాంగపర హక్కులను కాపాడుతామని తెలిపింది.

హాజరుకాని రాహుల్ గాంధీ

పట్నాలో జరిగిన ఎన్నికల మేనిఫెస్టో ఆవిష్కరణ కార్యక్రమంలో తేజస్వీ యాదవ్, దీపాంకర్ భట్టాచార్యతో పాటు కాంగ్రెస్ నాయకుడు పవన్‌ఖేరా, ఉపముఖ్యమంత్రి అభ్యర్థి, వికాస్‌శీల్ ఇన్సాఫ్ పార్టీ నాయకుడు ముకేశ్ సాహ్నీ పాల్గొన్నారు. మేనిఫెస్టోను 'తేజస్వీ ప్రాణ్ పత్ర్'గా అభివర్ణిస్తున్నారు. సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు ఉండేలా దీన్ని రూపొందించినట్లు తేజస్వీ చెప్పారు. అయితే కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు జరుగుతున్నా రాహుల్ గత రెండు నెలలుగా బిహార్‌లో అడుగు పెట్టలేదేమని ఇప్పటికే చర్చలు నడున్నాయి. మేనిఫెస్టో మొదటి పేజీపై తేజస్వీ ఫొటోను పెద్దదిగా ప్రచురించి, రాహుల్ ఫొటోను పేజీ పైభాగాన ఓ మూల చిన్నదిగా ముద్రించడాన్ని కూడా పలువురు ఎత్తిచూపుతున్నారు. మారిన రాజకీయ ప్రాధాన్యతలకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానిస్తున్నారు. రాహుల్ ఆగస్టులో ఓటర్ అధికార్ యాత్ర నిర్వహించిన తరువాత మళ్లీ రాలేదు. కాగా, రాహుల్ మంగళవారం బిహార్ యువతను ఉద్దేశించి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. యువత ఆశలను మోదీ-నీతీశ్ సర్కారు గొంతు నులిమి చంపిందని విమర్శించారు. మరోవైపు, పార్టీ సిద్ధాంతాలను ధిక్కరించినందుకు ఆర్జేడీ నుంచి 17 మందిని సస్పెండ్ చేశారు. వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ, నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

ఓట్ల వివాదంలో ప్రశాంత్ కిశోర్!

బిహార్ ఎన్నికల వేళ జన్‌సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ చిక్కుల్లో పడ్డారు. ఆయనకు రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉన్న విషయం మంగళవారం వెలుగు చూసింది. స్వరాష్ట్రం బిహార్‌తోపాటు పశ్చిమ బెంగాల్‌లోనూ ఆయనకు ఓటు హక్కు ఉందని తెలియడం వివాదంగా మారింది. బెంగాల్‌లోని భవానిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పీకేకు ఓటు ఉంది. ఇది బెంగాల్ సీఎం మమత నియోజకవర్గం కావడం గమనార్హం. 2021, బెంగాల్ ఎన్నికల సమయంలో టీఎంసీ పార్టీకి పీకే రాజకీయ వ్యూహకర్తగా పనిచేశారు. ఈక్రమంలో ఆయన భవానీపూర్‌లో ఓటరుగా పేరు నమోదు చేసుకున్నారు.

చేయని నేరానికి శిక్షకు గురైతే

నష్ట పరిహారం



» యోచిస్తున్న సుప్రీం.. సహకరించాలని ఏజీకి సూచన

న్యూఢిల్లీ, అక్టోబరు 28: తప్పుడు అభియోగాల కారణంగా శిక్షపడి జైలుపాలైన వ్యక్తికి నష్టపరిహారం చెల్లించే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తోంది. వ్యవస్థ ఆ వ్యక్తిని బలపశువును చేసినట్టుగానీ, తప్పుడు సాక్ష్యాలను కావాలని సృష్టించినట్టుగానీ తేలిన కేసుల్లో నష్ట పరిహార అంశాన్ని పరిగణించాలని యోచిస్తోంది. ఒకవేళ ఆ బాధితుడు నిర్దోషిగా అనంతరకాలంలో బయటకు వచ్చినప్పటికీ జైలులో అతడు కోల్పోయిన విలువైన జీవితాన్ని పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తోంది. ఇందులోని సంక్లిష్ట అంశాలను, ప్రక్రియలోని చిక్కులను దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడంలో తమకు సహకరించాల్సిందిగా అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌లను న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ కోరింది. దేశంలో శిక్షలు పడుతున్న కేసులు కేవలం 54 శాతమే ఉంటున్న విషయాన్ని ఈ సందర్భంగా బెంచ్ గుర్తుచేసింది. పోలీసులు పెట్టిన తప్పుడు కేసులో 12 ఏళ్ల జైలులో గడిపిన వ్యక్తి వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారించే సందర్భంలో నష్టపరిహారం అంశం చర్చకు వచ్చింది. ఆ వ్యక్తి పేదవాడు. మైనర్ బాలికపై అత్యాచారం జరిపి హత్య చేసిన కేసులో విచారణను ఎదుర్కొంటూ ఆయన ఇటీవల వరకు జైలులో ఉన్నారు. థానే కోర్టు 2019లో మరణశిక్ష విధించడంతో కారాగారవాసం చేస్తూ సుప్రీంకోర్టులో ఆ తీర్పును ఆయన సవాల్ చేశారు. చివరకు ఆయనపై పోలీసులు నమోదు చేసినవి తప్పుడు అభియోగాలు అని తేలడంతో సుప్రీంకోర్టు తాజాగా విడుదల చేసింది. అయితే, తాను జైలులో ఇన్నాళ్లు కోల్పోయిన జీవితాన్ని పరిగణనలోకి తీసుకుని నష్టపరిహారం ఇప్పించాల్సిందిగా సుప్రీంకోర్టులో ఆయన పిటిషన్ దాఖలుచేశారు. ఆయన తరఫున సీనియర్ అడ్వకేట్ గోపాల్ సుబ్రహ్మణియం వాదనలు వినిపిస్తూ.. ఇలాంటి వ్యక్తులకు తప్పక నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంటుందని సూచించారు. జైలు జీవితం ఆయన ప్రాథమిక హక్కులను కాలరాయడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, దీనిపై మార్గదర్శకాలను రూపొందించాలని బెంచ్‌ను కోరారు. ఈ అంశంలో ఒక స్థాయి అమరిక అవసరమని న్యాయ కమిషన్ కూడా గతంలో సిఫారసు చేసిన అంశాన్ని ఆయన బెంచ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా, "మానసిక వైద్య చట్టం-2017ను అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఇదే ధర్మాసనం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి బదిలీ చేసింది.

వైద్యులను కాపాడకుంటే

సమాజం క్షమించదు

వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి అండగా నిలిచి, వారిని రక్షించుకోకపోతే సమాజం న్యాయవ్యవస్థను క్షమించదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కరోనా సమయంలో సేవలు అందించి మరణించిన ప్రయివేటు వైద్య సిబ్బందికి బీమా పరిహారం చెల్లించకపోవడాన్ని తప్పుపట్టింది. వారికి బీమా పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంగళవారం మౌఖికంగా ఆదేశించింది. వారు ప్రభుత్వ విధుల్లో లేరని, లాభాపేక్ష ఉన్న ఆస్పత్రుల్లో పనిచేస్తున్నందున బీమా పరిహారానికి అర్హులు కారంటూ చెప్పడం తగదని పేర్కొంది. పరిహారం చెల్లించడానికి ప్రధానమంత్రి బీమా పథకం కాకుండా ఇతర పథకాలు ఉంటే వారి వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. కరోనాతో మరణించిన వైద్య సిబ్బందికి పరిహారం చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ ప్యాకేజీని ప్రకటించింది. దీని కింద ప్రభుత్వం రూ.50 లక్షలు చెల్లిస్తుంది.

రికార్డు స్థాయిలో పొగాకు ధర

» కిలో రూ.453కు కొనుగోలు చేసిన కంపెనీలు

దేవరపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో రికార్డు స్థాయి ధర పలికింది. మంగళవారం కిలో పొగాకు రూ.453కు కొనుగోలు చేశారు. సీజన్ ప్రారంభంలో కిలో రూ.290 పలకగా, క్రమేపీ పెరుగుతూ రూ.429 వద్ద స్థిరంగా కొనసాగుతూ వచ్చింది. కాగా, అంతర్జాతీయంగా ఎన్ఎల్ఎస్ పొగాకుకు డిమాండ్ ఉండటంతో కొనుగోలు కంపెనీలు పోటీ పడటం వల్ల కిలో రూ.453కు చేరుకుంది. ప్రస్తుతం అమ్మకాలు 85 శాతం పూర్తయ్యాయి. 15 శాతం మాత్రమే గ్రేడ్ 1 పొగాకు ఉండడంతో కంపెనీలు అధిక ధరకు కొనుగోలు చేస్తున్నాయి.

పెట్టుబడుల సదస్సు నిర్వహణకు రూ.10 కోట్లు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులను ఆకర్షించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించనుంది. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ సదస్సు నిర్వహణ ఖర్చుల కోసం రూ.10 కోట్ల బడ్జెట్ విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సదస్సును సజావుగా నిర్వహించడానికి ప్రభుత్వం ఇప్పటికే వివిధ కమిటీలను ఏర్పాటు చేసింది.

ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

» ఏపీ శాసనసభ కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజా

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎస్సీ సంక్షేమ శాసనసభ కమిటీ అధ్యక్షుడు కుమార్ రాజా వర్ల స్పష్టం చేశారు. మంగళవారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆ సామాజికవర్గ ప్రజలు, నేతల నుంచి అర్జీలను స్వీకరించింది. అనంతరం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్‌తో కలిసి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కుమార్‌రాజా మాట్లాడుతూ... షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు ఇచ్చిన వినతిపత్రాలను మినిట్స్ రూపంలో శాసనసభకు అందజేస్తామన్నారు. సంక్షేమ పథకాల అమలు, పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల స్థితి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ తీరు తదితర అంశాలపైనా నివేదికలు అందజేస్తామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల రక్షణ కోసం ఏర్పాటు చేసిన అట్రాసిటీ చట్టం లక్ష్యం నెరవేరేలా పోలీసులు పనిచేయాలని, ఒత్తిళ్లకు తలొగ్గరాదని కమిటీ సభ్యుడు ఎంఎస్ రాజు సూచించారు.



ప్రజాభీష్టం.. పాలనా సౌలభ్యం!

జిల్లాల పునర్వ్యవస్థీకరణలో ఇవే ముఖ్యం: సీఎం



జిల్లాల పునర్విభజన అంశంపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు మనోహర్, నారాయణ తదితరులు

» పవన్‌తో కలిసి క్యాబినెట్ సబ్ కమిటీతో సమీక్ష
» కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటుపై ఇప్పటివరకు 12 వేల వినతులు
» వీటిపై రెవెన్యూ ప్రత్యేక సీఎస్ ప్రజెంటేషన్
» మార్కాపురం జిల్లాపై ఎన్నికల్లో హామీ ఇచ్చాం
» ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం
» నేడు మంత్రివర్గ ఉపసంఘం భేటీ
» కొత్త జిల్లాలుగా మార్కాపురం, మదనపల్లె!

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): ప్రజాభీష్టం, పరిపాలనా సౌలభ్యం లక్ష్యంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ దిశగానే మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో ఉపసంఘం బుధవారం సచివాలయంలో సమావేశం కానుంది. రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై అధ్యయనం చేసి సిఫారసులు అందించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది జూలైలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటు వంటి అంశాలపై రెవెన్యూ శాఖకు ఇప్పటి వరకు 12 వేల వినతులు వచ్చాయి. జిల్లాల నుంచి వచ్చిన కొన్ని ప్రతిపాదనలతో ఆ శాఖ నివేదిక రూపొందించింది. దానిపై ఉపసంఘం చర్చించింది. జిల్లాల్లో పర్యటించి ప్రజాప్రతినిధులు, పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని ఉపసంఘం భావించినా అది జరగలేదు. దీంతో ఈ విషయంలో అనుకున్నంత వేగంగా చర్చ జరగలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం సదరు ఉపసంఘంతో సమీక్ష నిర్వహించారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, నారాయణ, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ జూమ్ మీటింగ్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ఓ నివేదిక సమర్పించింది. కొత్త జిల్లాల ఏర్పాటుపై ఇప్పటి దాకా వచ్చిన ప్రతిపాదనలు, పరిశీలనలో ఉన్న అంశాలపై ఆ శాఖ ఇన్‌చార్జి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సాయిప్రసాద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జగన్ హయాంలో లోక్‌సభ నియోజకవర్గం కేంద్రంగా జిల్లాల విభజన చేయడాన్ని ముఖ్యమంత్రి తప్పుపట్టినట్లు తెలిసింది. నాడు ప్రజాభీష్టం, పరిపాలనా సౌలభ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పార్లమెంటు స్థానం ప్రాతిపదికగా విభజించారని, దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నట్లు సమాచారం. 'లోక్‌సభ సీటు ఆధారంగా జిల్లాల ఏర్పాటుతో జిల్లా కేంద్రానికి అందులోని ఇతర ప్రాంతాలు చాలా దూరంలో ఉన్నాయి. అవి మరో జిల్లాకు దగ్గరలో, సొంత జిల్లాకు సుదూరంగా ఉన్నాయి. దీనిపై అభ్యంతరాలు వచ్చినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీని ఫలితం ఇప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చాం. కాబట్టి ఇప్పుడు పార్లమెంటు స్థానం ప్రాతిపదికగా కాకుండా అన్ని ప్రాంతాలకు దగ్గరగా జిల్లా కేంద్రం, ప్రజాభీష్టం, పరిపాలనా సౌలభ్యం వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని అధ్యయనం చేయాలి' అని చంద్రబాబు ఉపసంఘానికి తేల్చిచెప్పారు. ఈసారి జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగితే.. గత ప్రభుత్వం చేసిన తప్పులు, వాటివల్ల తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వల్ల కొత్త ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

కొత్తగా 2 జిల్లాలు..!

ప్రస్తుతం రాష్ట్రంలో 26 జిల్లాలు, 77 రెవెన్యూ డివిజన్లు, 679 మండలాలున్నాయి. జగన్ ప్రభుత్వం శాస్త్రీయ విధానాలు, నిపుణుల సూచనలను కాదని..రాజకీయ ప్రయోజనాలు ఆశించి లోక్‌సభ నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని జిల్లాల విభజన చేసింది. 13 జిల్లాలను 26గా చేసింది. అయితే అనేక జిల్లాల్లో సమస్యలున్నాయి. జిల్లా కేంద్రానికి వందల కిలోమీటర్ల దూరంలో మండలాలు, డివిజన్లు ఉన్నాయి. అవి మరో జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్నాయి. ఇలాంటి సమస్యలకు ఇప్పుడు శాస్త్రీయ పరిష్కారం చూపాలని సీఎం ఆదేశించారు. ఎన్నికల సమయంలో మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి రెవెన్యూ శాఖ కూడా ప్రతిపాదించింది. అలాగే రాష్ట్రంలో అతి పెద్ద రెవెన్యూ డివిజన్ గా ఉన్న మదనపల్లెను కూడా కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన పరిశీలనకు వచ్చింది. దీనిపై చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నేతలతో సంప్రదించాలని ఉపసంఘం భావిస్తున్నట్లు తెలిసింది. పోలవరం నిర్మాణం తర్వాత ముంపు మండలాలను ఏం చేయాలన్నది పెద్ద సమస్య. వాటిని ప్రధాన కేంద్రం దగ్గరగా ఉండే జిల్లాలో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. కాగా.. 28 నియోజకవర్గాల్లోని 86 మండలాలను డివిజన్లు, జిల్లాలవారీగా మళ్లీ పునర్వ్యవస్థీకరించాలని ప్రతిపాదనలు వచ్చాయి. అన్నమయ్య జిల్లా ప్రధాన కేంద్రాన్ని రాయచోటి నుంచి రాజంపేటకు మార్చాలన్న ప్రతిపాదన పరిశీలనలో ఉంది. బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గం మొత్తాన్నీ ప్రకాశం జిల్లాలో కలపాలన్న ప్రతిపాదనలు టీడీపీ నేతల నుంచే వచ్చాయి. వీటన్నిటిపై ఉపసంఘం బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో చర్చించనుంది. ముఖ్యమంత్రి సూచన మేరకు ఈ భేటీని ఖరారుచేసినట్లు తెలిసింది.

ముంపు మండలాలపైనా స్పష్టత

భవిష్యత్‌లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని కొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరగాలని సీఎం అన్నారు. జనాభా, ఇతర సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని.. ప్రజా ప్రతినిధులను సంప్రదించి వారి సలహాలు తీసుకోవాలని మంత్రులకు సూచించారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలన్నది ఆ ప్రాంత ప్రజల చిరకాల కోరికని గుర్తుచేశారు. పోలవరం ముంపు మండలాలపై కూడా స్పష్టత తీసుకురావాలని ఆదేశించారు.

టీటీడీ కొనుగోళ్లలో అవకతవకలపై

ఏసీబీ విచారణ

» రూ.400 విలువైన శాలువా రూ.1,334కి కొనుగోలు
» వైకుంఠ ద్వార దర్శనాలు 10 రోజులు కొనసాగిస్తాం
» విధి విధానాల రూపకల్పనకు కమిటీ ఏర్పాటు
» బోర్డు నిర్ణయాలను వెల్లడించిన చైర్మన్ బీఆర్ నాయుడు



వివరాలు వెల్లడిస్తున్న బీఆర్‌నాయుడు, చిత్రంలో ఈవో సింఘాల్

తిరుమల, అక్టోబరు 28(ఆంధ్ర జ్యోతి): 'టీటీడీ కొనుగోళ్లలో కొన్ని అవకతవకలు జరిగినట్టు మా దృష్టికి వచ్చింది. దీనిపై ఏసీబీతో సమగ్ర విచారణ చేపట్టాలని బోర్డు నిర్ణయం తీసుకుంది' అని చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం దాదాపు ఏడు గంటల పాటు ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులతో కలిసి బీఆర్ నాయుడు మీడియాకు బోర్డు నిర్ణయాలు వెల్లడించారు. 'కొనుగోళ్ల విషయంలో సిబ్బందిపై ఆరోపణలు వచ్చాయి. మార్కెట్‌లో రూ.350 నుంచి రూ.400 ధర ఉండే శాలువాను రూ.1,334కి కొంటున్నారు. నాకు తెలిసి నాలుగైదేళ్లలో రూ.50 కోట్ల విలువైన మెటీరియల్ కొన్నారు. అక్కడే సందేహం వచ్చి విచారిస్తే కొనుగోళ్లలో చాలా అవినీతి జరిగినట్టు గుర్తించాం. ఇక ఈ విషయాన్ని ఏసీబీ చూసుకుంటుంది' అని అన్నారు. వైకుంఠ ద్వార దర్శనాలను యథావిధిగా పదిరోజులు కొనసాగిస్తామని, దీనిపై ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేశామన్నారు. గతంలో జరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో పెట్టుకుని అటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని చెప్పారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకుని ఎన్ని టికెట్లు, ఎక్కడ ఇవ్వాలి, పారదర్శక కేటాయింపు, భక్తులకు ఇబ్బంది లేకుండా ఎలా జారీ చేయాలనే అంశాలపై కమిటీ అధ్యయనం చేసి వారం పదిరోజుల్లో విధివిధానాలను రూపొందిస్తుందన్నారు. టీటీడీ గోశాల నిర్వహణ సరిగా లేదని బోర్డు దృష్టికి వచ్చిందని.. గోశాలను టీటీడీనే నిర్వహించాలా లేదా ఇతర వలంటరీ ఆర్గనైజేషన్లకు కేటాయించాలా అనేది పరిశీలించేందుకు నిపుణుల కమిటీ నియమించామన్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

బోర్డు సమావేశంలో తీసుకున్న మరికొన్ని నిర్ణయాలు

» సీఎం ఆదేశాలతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 5 వేల ఆలయాలు, భజన మందిరాల నిర్మాణం
» దేశంలో టీటీడీ నిర్వహిస్తున్న ఆలయాల్లో నిరంతరాయంగా అన్నప్రసాదాల వితరణకు తీర్మానం
» కడపజిల్లా ఒంటిమిట్టలో వంద గదుల నిర్మాణం కోసం రూ.37 కోట్లు, 1.35 ఎకరాల్లో పవిత్ర వనం కోసం రూ.2.96 కోట్లు కేటాయింపు
» తిరుమలలోని గదుల అద్దెలో వ్యత్యాసాల పరిశీలనకు కమిటీ నియామకం. కమిటీ నివేదిక ఆధారంగా అద్దెల్లో మార్పులు
» కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం రూ.20 కోట్లు, ఇతర వసతుల కోసం రూ.10 కోట్లు. ఇందులో రూ.10 కోట్లు దాతల ద్వారా విరాళాలు సేకరణ
» వేద విశ్వవిద్యాలయం వీసీ సదాశివమూర్తి తొలగింపు
» భక్తులకు సౌకర్యాల కల్పన కోసం చెన్నై టీ నగర్‌లోని శ్రీవారి ఆలయ పరిధిలోని 6,227 చ.అ స్థలాన్ని దాతల సహకారంతో రూ.14 కోట్లతో కొనుగోలు

వీహెచ్‌ఏ పోస్టుల భర్తీపై

హైకోర్టు కీలక తీర్పు

» నియామక ప్రక్రియ మధ్యలో రూల్స్ మార్పు చట్టవిరుద్ధం
» మెరిట్ ఆధారంగా పిటిషనర్లకు సీనియారిటీ కల్పించాలి
» 3నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల పరిధిలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ల(వీహెచ్‌ఏ) నియామకాలపై హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. నియామక ప్రక్రియ ప్రారంభమైన తరువాత అర్హత ప్రమాణాలు మార్చడం చట్టవిరుద్ధమని ప్రకటించింది. కొత్త సర్వీస్ రూల్స్ అమల్లోకి రాకముందే వీహెచ్‌ఏ పోస్టుల భర్తీకోసం ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసిందని గుర్తు చేసింది. ఆట మొదలైన తరువాత రూల్స్ మార్చడానికి వీల్లేదని సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని, ఈ నేపథ్యంలో కొత్త సర్వీస్ రూల్స్‌ను పూర్వ తేదీ నుంచి(రెట్రోస్పెక్టివ్) అమలు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. రాత పరీక్షలో అర్హత సాధించిన పిటిషనర్లను పరిగణనలోకి తీసుకొని తాజాగా మెరిట్ జాబితాను ప్రచురించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎంపికైన అభ్యర్థుల కంటే పిటిషనర్లు మెరిట్ సాధించి ఉంటే భవిష్యత్తు పదోన్నతుల్లో వారికి నష్టం జరగకుండా నోషనల్ సీనియార్టీ కల్పించాలని సూచించింది. ఈ ప్రక్రియను 3 నెలల్లో పూర్తి చేయాలని న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ ఇటీవల తీర్పు ఇచ్చారు. 2019 జూలైలో మొత్తం 4వేల విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జరీ చేసింది. బీఎస్సీ(హార్టికల్చర్)/బీఎస్సీ(హానర్స్), బీటెక్(హార్టికల్చర్), హార్టికల్చర్ డిప్లొమా చేసిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొంది. అనంతరం ఎంపిక పరీక్షలో 2,217 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగిలిన 1,783 పోస్టుల భర్తీకి 2020లో మరో నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం హార్టికల్చర్ శాఖలో పనిచేస్తున్న మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు(ఎంపీఈవో), మైక్రో ఇరిగేషన్ అసిస్టెంట్ ఆఫీసర్స్(ఎంఐఏవో) అభ్యర్థన మేరకు అర్హత ప్రమాణాలను సడలిస్తూ సవరణ జారీ చేసింది. బీఎస్సీ(బీజడ్‌సీ)/బీఎస్సీ/ఎమ్మెస్సీ(హార్టికల్చర్ ఒక సబ్జెక్ట్‌గా ఉన్నవారు), అలాగే 10+2తో ఒక సంవత్సరం హార్టికల్చర్ డిప్లొమా, బీఎస్సీ(అగ్రికల్చర్) చేసినవారిని కూడా పరీక్ష రాసేందుకు అనుమతించింది. అయితే రాత పరీక్షకు 5 రోజుల ముందు 2020 జూన్‌లో కొత్త సర్వీస్ రూల్స్ తీసుకొస్తూ.. అర్హత ప్రమాణాల సడలింపును రద్దు చేసింది. కొత్త సర్వీస్ రూల్స్‌ను వెనుక తేదీ(రెట్రోస్పెక్టివ్) నుంచి అమలు చేసింది. దీంతో పరీక్ష రాసే అర్హత కోల్పోయిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు జీవీ శివాజీ, వైమల్లికార్జునరెడ్డి, హరీశ్‌కుమార్ రాశినేని వాదనలు వినిపించారు.

నేటి నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు

» రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలి: మంత్రి అచ్చెన్న

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లు బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. మొంథా తుఫాన్ తీవ్రత నేపథ్యంలో పత్తి రైతులు నష్టపోకుండా రాష్ట్రవ్యాప్తంగా 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్వింటాకు కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.8,110 చొప్పున సీసీఐ కొనుగోలు చేయనుంది. పత్తి రైతులు ముందుగా గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతుసేవా కేంద్రాల్లో సీఎం యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. తర్వాత కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని, సీసీఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో యాప్‌లో సూచించిన కొనుగోలు కేంద్రాల పరిధిలోని జిన్నింగ్ మిల్లులకు మాత్రమే తీసుకెళ్లి అమ్ముకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

పోష్ చట్టంపై త్వరలో అవగాహన సదస్సులు

» రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ వెల్లడి

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నివారించేందుకు రూపొందించిన పోష్ చట్టం అమలుపై త్వరలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. ఏపీ నాన్ గెజిటెడ్(ఎన్జీవో), గెజిటెడ్ మహిళా సంఘాల ప్రతినిధులు మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగినులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఉండాలని, పీహెచ్‌సీల్లో మహిళా నర్సుల డ్యూటీల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, నైట్‌వాచ్‌మెన్ల ఏర్పాటు, కార్యాలయాల సముదాయంలో బేబీ కేర్ సెంటర్లు ఉండాలని, పోష్ చట్టం అమల్లో భాగంగా ఇంటర్నల్ కమిటీల నియామకం, డిస్‌ప్లే బోర్డులు, ఉద్యోగినులకు సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన, ఈహెచ్‌ఎస్‌లో మాస్టర్ హెల్త్ చెకప్ తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మహిళా సాధికారతకు దోహదపడే కార్యక్రమాలపై కలిసి పని చేద్దామని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పేర్కొన్నారు. త్వరలోనే చట్టాలపై అవగాహన క్యాంపులు నిర్వహించి అన్ని విషయాలపై సమగ్ర నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి కూడా లేఖలు రాస్తామన్నారు.

సీఎంకు ధన్యవాదాలు

అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును శైలజ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా సాధికారత దిశగా కమిషన్ భవిష్యత్ ప్రణాళికను సీఎంకు వివరించినట్లు ఆమె ఓ ప్రకటనలో తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బిహార్ దాటిన 'సర్'

తాను కోరుకున్నట్టుగానే బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) పూర్తిచేయగలిగిన ఎన్నికల సంఘం ఇప్పుడు రెండో దశలో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో జాబితా ప్రక్షాళనకు నడుంబిగించింది. బిహార్‌లో ఏడున్నర కోట్ల ఓటర్ల సవరణే వివాదాస్పదమై, వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ పోయిన నేపథ్యంలో, ఇప్పుడు నాలుగు నెలల్లో ఏకంగా యాభైకోట్ల మంది ఓటర్ల పుట్టుపూర్వోత్తరాలను పరిశీలించి, ప్రక్షాళించాలని ఈసీ నిర్ణయించింది. నెలకోదశని పూర్తిచేసుకుంటూ ఫిబ్రవరిలోగా పని ముగించబోతోంది. వచ్చే ఏడాది ఎన్నికలకు పోబోతున్న విపక్ష పాలిత రాష్ట్రాలు కూడా ఈ సవరణలో ఉన్నందున దేశం ఇకపై తీవ్రవాగ్యుద్ధాలను చూడక తప్పదు.

'బిహార్ 'సర్' లేవనెత్తిన అనుమానాలూ ప్రశ్నలకూ ఇప్పటికీ జవాబులు లేవు, ఇప్పుడు దానిని మరింత విస్తరించడానికి ఈసీ సిద్ధపడింది, కొత్త ఓటర్లను చేర్చకుండా ఏకంగా అరవైఐదులక్షల మందిని అనర్హులుగా మార్చేసిన బిహార్ దారిలోనే మిగతా దేశాన్నీ ఈసీ నడిపించాలనుకుంటోంది' అని కాంగ్రెస్ విమర్శించింది. పశ్చిమ బెంగాల్‌తో ఈసీకి ఎలాంటి ఘర్షణాలేదని, రాజ్యాంగబద్ధ విధిని తాము నిర్వర్తిస్తున్నామని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ విలేఖరుల ముందు చేసిన వ్యాఖ్య జరగబోయే రచ్చని ముందే తెలియచెబుతోంది. బెంగాల్‌లో సమగ్ర సవరణకు ఉపక్రమిస్తే రక్తపాతాలైపోతాయన్న తరహాలో మమతాబెనర్జీ గతంలోనే కొన్ని హెచ్చరికలు చేశారు. ఏ మాత్రం లెక్క తేడావచ్చినా ఊరుకొనేది లేదని ఈసీ ప్రకటన తరువాత కూడా ఆమె పార్టీ ఘాటుగానే హెచ్చరించింది. బీజేపీ అసలు లక్ష్యం బెంగాల్ మాత్రమేనని, ముందుగా బిహార్‌లో రిహార్సల్స్ జరిగిందని తృణమూల్ విమర్శ. రాష్ట్రంలో బీజేపీ బలంగా, దూకుడుగా ఉన్న నేపథ్యంలో, ప్రతీ ఓటరు జోడింపు తొలగింపు తీవ్రవివాదం కావచ్చు. తమిళనాడు, కేరళ పాలక పక్షాలు కూడా ఎన్నికల సంఘం నిర్ణయాన్ని గట్టిగా ప్రశ్నించాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో ఎన్నికలు జరగబోతున్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో ఇంత హడావుడిగా జాబితాలను సవరించాల్సిన అవసరం ఏముందని ఆ పార్టీలు అడుగుతున్నాయి. యూపీలో సమాజ్‌వాదీ పార్టీ యావత్ ప్రక్రియమీదా కన్నేసి ఉంచేందుకు పీడీఏ (పిఛ్‌డే, దళిత్, అల్పసంఖ్యాక్) దళాలను రంగంలోకి దింపబోతున్నట్టు ప్రకటించింది. మోదీ ప్రభుత్వం పక్షాన, అది చెబుతున్న రీతిలో ఈ ప్రక్షాళన జరుగుతోందని ఆరోపిస్తున్న విపక్షపార్టీలు తమ వాదనను నిరూపించుకోవడానికి శతథాప్రయత్నిస్తాయి. ఒక రాజకీయ పార్టీగా బీజేపీ కూడా ఎన్నికల సంఘాన్ని ఏ మాత్రం ప్రశ్నించకుండా, దానిని ఏకపక్షంగా వెనకేసుకురావడం విపక్షాలకు ఆయుధంగా ఉపకరిస్తోంది. బీజేపీ, దాని మిత్రపక్షాలు ఈసీ చర్యలను సమర్థించడం, ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకించడంతో, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవలసిన ఇటువంటి కార్యక్రమాలు సైతం రాజకీయమయమైపోతున్నాయి.

చట్టవిరుద్ధమని తేలితే 'సర్'ను సమూలంగా రద్దుచేస్తానని ఆదిలో ఘాటైన హెచ్చరికలు చేసిన సర్వోన్నత న్యాయస్థానం ఆ తరువాత ఈసీ వాదనలకు లొంగిన కారణంగానే ఇప్పుడు సదరు ప్రక్రియ బిహార్ దాటి దేశమంతా విస్తరించగలుగుతోంది. తన స్వతంత్రతనూ, స్వేచ్ఛనూ అడ్డుకోవద్దన్న ఈసీ వాదనకు సుప్రీం సరేనంటూ, ఏవో చిన్న సవరణలతో పాటు, ఆధార్‌ను కేవలం ఒక గుర్తింపు పత్రంగా చేర్పించగలిగింది. ఓటరు సమర్పించాల్సిన యోగ్యతాపత్రాల జాబితాలో దానిని చిట్టచివరన ఉంచేందుకు ఈసీ అయిష్టంగానే ఒప్పుకుంది. దేశవ్యాప్త ఓటరు జాబితాల శుద్ధీకరణకు ఎన్నికల సంఘానికి బిహార్ ప్రయోగకేంద్రంగా ఉపకరించింది. ఒక పోలింగ్ బూత్‌ను 1200 మంది ఓటర్లకు పరిమితం చేయడం, ఈవీఎంల మీద అభ్యర్థుల కలర్ ఫోటోలు ఇత్యాది 17 కొత్త సంస్కరణలకు కూడా బిహార్ పునాదిగా పనిచేసింది. రాహుల్ చేసిన 'ఓట్ చోరీ' ఆరోపణలు, ఓట్ అధికార యాత్రలు ఎన్నికల సంఘాన్ని ఆత్మరక్షణలోకి నెట్టినమాట నిజం. నిరూపించు లేదా క్షమాపణలు చెప్పు అని రాహుల్ మీద విరుచుకుపడిన ఈసీ కూడా బిహార్ అనుభవాల నుంచి చాలా పాఠాలు నేర్చుకొని, అనేక విధానపరమైన మార్పు చేర్పులతో రెండోదశకు ఉపక్రమించిన నేపథ్యంలో, అన్ని పార్టీలూ సంఘానికి సహకరించాలి. ప్రక్రియ ఆరంభంలో ఆయా రాష్ట్రాల రాజకీయపక్షాలతో చర్చలు జరపడమే కాక, అది పూర్తిగా ముగిసేంత వరకూ వాటి సలహాలు, అభ్యంతరాలను స్వీకరించగలిగినప్పుడే ఈ భారీ కార్యక్రమాన్ని ఈసీ సవ్యంగా, సంతృప్తికరంగా పూర్తిచేయగలుగుతుంది.

ఐరోపా నుండి ఆసియాకు పయనించే జలాంతర ఇంటర్నెట్ కేబుళ్ళన్నీ గల్ఫ్ నుంచి భారత్ మీదుగానే సమస్త ఆసియా దేశాలకు వెళ్తాయి. గూగుల్ డేటా సెంటర్‌తో పాటు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ సైతం విశాఖపట్టణానికి వస్తున్నందున దుబాయి సభలో జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలను చంద్రబాబు వివరించిన విధానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నది.


చంద్రబాబు 'జ్ఞాన' పథం

సమాజాలు కాలానుగుణంగా ప్రగతి మార్గంలో పయనించేందుకు దార్శనిక పాలకులు అవసరం. దూరదృష్టి, ఆత్మవిశ్వాసం, నిబద్ధత ఉన్న పాలకులే తమ దేశాలకు శీఘ్ర పురోగతి సాధించగలుగుతారు. ఈ విషయంలో గల్ఫ్ దేశాలు ప్రపంచానికే ఆదర్శప్రాయం. ఎడారి దేశాలు సంపద్వంత సీమలుగా వర్ధిల్లుతోన్న తీరుతెన్నులను నిశితంగా గమనించే భారతీయ రాజకీయ నాయకులలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అగ్రగణ్యుడు.

దుబాయితో చంద్రబాబుకు మూడు దశాబ్దాల అనుబంధం ఉంది. పర్యాటక రంగమే జీవనాడిగా ఉన్న దుబాయి, చమురు ఎగుమతి కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఆబుధాబిల అభివృద్ధి నమూనాలను ఆయన నిశితంగా పరిశీలిస్తూ వస్తున్నారు. ఇటీవల దుబాయిని సందర్శించిన చంద్రబాబు, అక్కడ ప్రవాసులతో జరిగిన ఒక సభలో మాట్లాడుతూ

గల్ఫ్ లేఖ

అభివృద్ధి విధానం గురించి చేసిన ప్రసంగం సామాన్యులు, మేధావులు అందరినీ ఆలోచింపజేసింది. జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ విషయమై చంద్రబాబు దార్శనికత, విశాఖపట్టణంలో గూగుల్ డేటా సెంటర్ నేర్పాటు చేయనున్న నేపథ్యంలో మరింత ప్రాధాన్యం సంతరించుకున్నది. ఐరోపా నుండి ఆసియాకు పయనించే సముద్రాంతర ఇంటర్నెట్ కేబుళ్ళన్నీ గల్ఫ్ నుంచి భారత్ మీదుగానే సమస్త ఆసియా దేశాలకు వెళ్తాయి, ప్రతిపాదిత గూగుల్ డేటా సెంటర్‌తో పాటు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ సైతం విశాఖపట్టణానికి వస్తున్నందున దుబాయి సభలో జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలను చంద్రబాబు వివరించిన విధానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నది. వర్షాభావ దుబాయి సిరిసంపదల నెలవుగా పరిణమిస్తుందని ఒకప్పుడు ఎవరూ ఊహించలేదని, అదే విధంగా రైతు బిడ్డలు ఐటీ ఇంజినీర్లుగా ఎదుగుతారని ఒకప్పుడు ఎవరూ భావించలేదని చంద్రబాబు అన్నారు. దూరదృష్టి, వినూత్న ఆలోచనలు, భద్ర భవిష్యత్తు నిర్మాణ సంకల్పంతోనే ఆ మేలు మార్పులు సుసాధ్యమయ్యాయని చంద్రబాబు అన్నారు. కుటుంబానికి ఒక్కరు చొప్పున ఐటీ ఇంజినీర్‌ను చేస్తానని 1990లలో తాను ప్రకటిస్తే హేళన



చేశారని ఆయన గుర్తు చేశారు. భావితరాలకు అవసరమైన అధునాతన సాంకేతికత క్వాంటం కంప్యూటింగ్‌కు తాను నవ్యాంధ్రప్రదేశ్ నుండి శ్రీకారం చుట్టనున్నట్లుగా చంద్రబాబు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

చమురు ఆదాయం లేని దుబాయికి పర్యాటక రంగమే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నది. కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఆధారంగా దుబాయి ఏమిరేట్ ఏ విధంగా ప్రపంచ పర్యాటకుల గమ్యంగా ప్రభవించిందో చంద్రబాబు తన ప్రత్యక్ష అనుభవాలను ఉదహరిస్తూ వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా లేని రీతిలో 1,50,000 హోటల్ రూమ్‌లతో పర్యాటక రంగాన్ని ఈ ఎడారి నగరం అభివృద్ధి చేసిన తీరును వివరిస్తూ నీళ్ళు, వృక్షాలు లేని దుబాయి శరవేగంగా పురోగమిస్తుండగా అన్నీ ఉండీ మనమెందుకు వెనుకబడి ఉంటున్నామో ఆలోచించాలని చంద్రబాబు అన్నారు. ప్రపంచ చమురు విపణిని శాసించే సౌదీ అరేబియాతో పాటు దుబాయి పొరుగు ఏమిరేట్ ఆబుధాబి కూడా డేటా సెంటర్ల ఏర్పాటుకు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని గుర్తించిన చంద్రబాబు ఆబుధాబి చమురు కేంద్రీకృత విధానం నుంచి జ్ఞాన ఆధారిత ఆర్థిక విధానం వైపు పురోగమిస్తున్న వైనాన్ని చంద్రబాబు ప్రశంసాపూర్వకంగా విపులీకరించారు.

రాజకీయాలకు అతీతంగా ఆవిష్కృతమైన చంద్రబాబు మనోగతం సభికులను స్ఫూర్తిదాయకంగా ఆకట్టుకున్నది. భారతీయులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా అక్కడి సంప్రదాయాలు, చట్టాలను గౌరవిస్తూ మెలగాలని హితవు చెప్పుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన చంద్రబాబు దుబాయిలోని తెలుగు వారికి మాత్రమే కాకుండ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్త ప్రవాస భారతీయులకూ ఒక సందేశాన్ని పంపారు. అమెరికాతో సహా కొన్ని దేశాలలో దీపావళి మొదలైన పండుగల సందర్భంగా భారతీయులు కొందరు హద్దులు మీరి వ్యవహరించిన తీరుపై విపుల వార్తా కథనాలు వెలువడిన దృష్ట్యా చంద్రబాబు హితోపదేశం వివేకవంతమైనది. గత మూడు దశాబ్దాలుగా దుబాయికి రాకపోకలు సాగిస్తున్న చంద్రబాబు స్థానిక ప్రవాసులతో సమావేశమవ్వడం ఇదే మొదటిసారి. దుబాయిలో పుట్టిన తొమ్మిదేళ్ళ వేమూరి హంశ్ మొదలు కాకినాడలో పుట్టి పెరిగి దుబాయిలో స్థిరపడ్డ 92 ఏళ్ళ ఫాతిమా వరకు చాలామంది చంద్రబాబుతో భేటీ అయ్యారు. సమావేశ వేదికపై సుమారు ఐదు గంటల పాటు విసుగు, అలసట లేకుండా ఓపిగ్గా నిలబడిన చంద్రబాబు తనను పలకరించేందుకు వచ్చిన ప్రతి ఒక్కరితోనూ విడివిడిగా మాట్లాడి వారితో ఫోటోలు దిగారు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రజలు వస్తున్నారు జాగ్రత్త...!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

గత బుధవారం తెల్లవారు జామున ఢిల్లీలోని రోహిణీ ప్రాంతంలో ఢిల్లీ పోలీసులు జరిపిన ఒక ఎన్‌కౌంటర్‌లో బిహార్‌కు చెందిన నలుగురు కరడుగట్టిన క్రిమినల్స్ మరణించారని వార్తలు వచ్చాయి. సిగ్మా ముఠా పేరిట అనేక హత్యలు, దోపిడీకి పాల్పడిన ఈ నలుగురు బిహార్ ఎన్నికలకు ముందు బీభత్సం సృష్టించనున్నారన్న సమాచారం రావడంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమై ఈ ఎన్‌కౌంటర్‌ను నిర్వహించారు. ఈ నేరగాళ్లు ఎవరి తరఫున హింసాకాండకు పాల్పడాలని అనుకున్నారు.. ఎవరి సుపారీ తీసుకున్నారు అన్న వివరాలు మాత్రం లభ్యం లేదు. అయితే బిహార్‌లో నవంబర్ మొదటి వారంలో జరిగే ఎన్నికల్లో జరగబోయే హింసాకాండ గురించి ఆందోళనలు మాత్రం కొనసాగుతున్నాయి. నేపాల్‌లో సంభవించిన పరిణామాలు భారత్–నేపాల్ సరిహద్దు సమీప ఏడు బిహారీ జిల్లాల్లోని 21 సీట్లపై ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు. కేవలం రెండు దశల్లో జరగాల్సిన ఎన్నికలకు గాను ఇప్పటికే సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ తదితర బలగాలకు చెందిన లక్ష మందిని బిహార్‌లో మోహరించారు. దేశంలో ఇంకెక్కడైనా ఎన్నికలు జరగడం ఒక ఎత్తు, బిహార్‌లో ఎన్నికలు జరగడం ఒక ఎత్తు అని అభివర్ణించిన ఎన్నికల కమిషన్ 4.5 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 2.5 లక్షల మంది పోలీసు అధికారులతో పాటు 470 మంది కేంద్ర పరిశీలకులను నియమించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులను నియమించామని వారే తమ కళ్లు చెవులుగా వ్యవహరిస్తారని కమిషన్ ప్రకటించింది. ఈ పరిణామాలను బట్టి చూస్తే కేంద్రంలో అధికారం నెరపుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వం బిహార్ ఎన్నికలకు ఎంత ప్రాధాన్యమిస్తున్నదో విశదమవుతోంది.

రాష్ట్ర క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారమే ప్రతి నెలా సగటున 229 హత్యలు జరిగే బిహార్‌లో 20 సంవత్సరాలుగా నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్నా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు జరగని రోజు లేదు. బిహార్‌లో 60 శాతం జనాభా 30 ఏళ్ల వయసులో ఉన్నారని, వారికే ఉద్యోగమూ లేనప్పుడు శాంతిభద్రతల సమస్య రాకుండా ఎలా ఉంటుంది.. అని ఆ రాష్ట్ర అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ ఒకరు వ్యాఖ్యానించారు. బిహార్‌లో ప్రస్తుత నేర న్యాయ విచారణ వ్యవస్థ నేరాలను అరికట్టగల స్థితిలో లేదని పోలీసు ఉన్నతాధికారులే ఒప్పుకుంటున్నారు. బిహార్‌లో ఉపాధి దొరకని లక్షలాది యువజనులు ఇతర రాష్ట్రాలకు వలసవెళుతున్నారు. ఒక అంచనా ప్రకారం 74.5 లక్షలమంది బిహారీలు తమ రాష్ట్రానికి వెలుపల పనిచేస్తున్నారు.

బిహార్‌లో ఉపాధి కల్పన ఎంత ఘోరంగా ఉన్నదో అంచనా వేసేందుకు ఛట్ పూజకు హాజరయ్యేందుకు ఆ రాష్ట్రానికి లక్షల సంఖ్యలో ప్రజలు తిరిగి వచ్చిన తీరే నిదర్శనం. ప్రతి రాష్ట్రం నుంచీ బిహారీలు తిరిగి వచ్చేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ 12వేల ప్రత్యేక రైళ్ళు నడిపినా ప్రతి రైలూ కిక్కిరిసిపోయింది. నిలబడేందుకు కనీసం చోటు కూడా లేకపోవడంతో అశేష జనం ప్రాణాలకు తెగించి రైళ్లపై కూర్చుని ప్రయాణించారు. 'నేను గత నాలుగు రోజులుగా కేవలం రెండుసార్లే భోజనం చేశాను. సామాను పోతుందన్న భయంతో నిద్ర కూడా పోలేదు. టాయిలెట్‌లో కూడా జనం నిండిపోవడంతో 30 గంటల పాటు మూత్రం చేయలేకపోయాను.. ప్రతి ఏడాదీ ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాను' అని బిహారీ కార్మికుడు ఒకరు చెప్పారు.

ఇవన్నీ చూస్తుంటే బిహార్ అసలు ఈ దేశంలోనే ఉన్నదా.. అని సందేహం వస్తుంది. 4 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, జపాన్‌ను సైతం అధిగమించామని సంతోషిస్తున్నవారు బిహార్‌లో పరిస్థితి చూస్తే విషాదంలో కూరుకుపోకతప్పదు. దాదాపు 20 సంవత్సరాల క్రితం లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఆటవిక రాజ్యం ఉన్నదని బీజేపీ తీవ్ర ప్రచారం చేసింది. 2005 సంవత్సరం నుంచీ బిహార్‌లో జనతాదళ్ (యు) అధికారంలో ఉన్నది. అందులో 15 సంవత్సరాలు బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నది. ఇంత సుస్థిరత ఉన్న బిహార్ దేశంలో అత్యంత నిరుపేద రాష్ట్రంగా ఎందుకు మిగిలిపోయింది? ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక ప్రకారం సామాజిక అభివృద్ధి, ప్రజారోగ్య వ్యవస్థ పనితీరు, పాఠశాల విద్యానాణ్యత, సుపరిపాలనా సూచికల్లోను బిహార్ అధమ స్థానంలో ఉన్నది. మూడు సంవత్సరాల క్రితం రైల్వేలో 35వేల ఉద్యోగాల కోసం కోటిమందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదన్న ఆగ్రహంతో విద్యార్థులు బిహార్‌లో అనేక ప్రాంతాల్లో రైళ్లను ఆపి బోగీలకు నిప్పంటించారు. అనేక చోట్ల కాల్పులు జరపాల్సి వచ్చింది. ఎన్నికలకు ముందు ప్రతి పార్టీ పెద్ద ఎత్తున ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇస్తుంది. అయితే ఆ హామీలు రాజకీయ నినాదాలుగా మాత్రమే మిగిలిపోతాయి. బిహార్‌లోనే అత్యధిక శాతం మంది పేదరికం, నిరుద్యోగంలోనూ కునారిల్లుతున్నారని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది. బిహార్ స్థూల దేశీయోత్పత్తి, తలసరి

> **ఎన్డీఏకు మోదీయే రథసారథి. బిహార్‌లో బీజేపీ చొచ్చుకుపోయేలా ఆయన ఎందుకు చేయలేకపోయారు?**
> **కుల సమీకరణాలను బీజేపీ ఎందుకు అధిగమించలేకపోయింది?**
> **కాంగ్రెస్ పోటీ చేసే 61 సీట్లలో సగమైన గెలుచుకోకపోతే రాహుల్‌గాంధీని బిహార్ ప్రజలు తిరస్కరించారని, ఓట్ చోరీ విషయమై మోదీపై ఆయన చేసే ఆరోపణలు గాలికి కొట్టుకుపోయాయని భావించక తప్పదు.**



ఆదాయం దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే తక్కువ. నీతీ ఆయోగ్ నివేదిక ప్రకారమే దేశంలో అత్యంత ఘోరమైన ఆర్థిక పరిస్థితి ఉన్న రాష్ట్రం బిహార్. రెండేళ్ల క్రితం జరిగిన కుల సర్వే ప్రకారమే దాదాపు 94 లక్షలమంది రోజుకు రూ.200 కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. అక్కడ 12వ తరగతి పూర్తి చేసినవారు కేవలం 10 శాతం మంది మాత్రమే!

దారిద్ర్యం, వలసలు, పాలనా వైఫల్యాలు, హింసాకాండ, కులతత్వం, అవినీతి, ప్రజలను ఉచితాలతో మభ్యపెట్టడం, పేలవమైన విద్యావ్యవస్థ చుట్టూ తిరుగుతున్న బిహార్ రాజకీయాలే ఆ రాష్ట్రం ఆర్థికంగా పరివర్తనం చెందక పోవడానికి కారణం. కుల ఆధారిత, ప్రాంతీయ పార్టీలకు బిహార్‌ను వదిలేసి కాంగ్రెస్ చేతులెత్తేస్తే బీజేపీ ఆ రాష్ట్రంలో ఉనికిని నిరూపించుకోవడానికి నానా కష్టాలు పడుతూ సంకీర్ణ ప్రభుత్వాన్ని ప్రోత్సహించక తప్పని పరిస్థితిలో ఉన్నది. ప్రతి బడ్జెట్‌లోనూ, మోదీ ప్రతి పర్యటనలోనూ రూ.లక్షల కోట్లపైగా ప్రాజెక్టులకు సంబంధించి ప్రకటనలే కాని ఆ మొత్తం బిహార్ రూపురేఖల్ని మార్చేందుకు అక్కడి పరిశ్రమలకు ఉపాధి కల్పనకు దోహదం చేసేందుకు ఉపయోగపడిన దాఖలాలు లేవు. కొన్ని దశాబ్దాల రాజకీయ నిర్లక్ష్యానికి ప్రతీకగా నేటి బిహార్ నిలిచిపోయింది.

ఛట్ పూజ అనంతరం మంగళవారం నుంచి ముమ్మరమవుతున్న బిహార్ ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలకు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకోవడం, ప్రజలకు వాగ్దానాల వర్షం కురిపించడం తప్ప మరో మార్గం లేదు. యథా ప్రకారం ప్రధానమంత్రి బిహార్‌లో సుడిగాలిలా తిరుగుతూ గతంలో ఉన్న జంగిల్‌రాజ్ గురించి విమర్శలు గుప్పిస్తున్నారు. నిజానికి ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన వెంటనే మోదీ తొలుత బిహార్‌కు వెళ్లి అక్కడ పాక్‌కు మరచిపోలేని గుణపాఠం చెబుతామని గర్జించారు. అప్పటి నుంచీ ఇప్పటి వరకు పలుసార్లు బిహార్‌లో పర్యటించిన మోదీ దాదాపు రూ. లక్షా 26వేల కోట్ల మేరకు ప్రాజెక్టులను ప్రారంభించారు. డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే బిహార్ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఎన్డీఏకు సంబంధించి మోదీయే రథసారథి. మోదీకి సంబంధించి బిహార్ ఆయన రాజకీయ అధ్యాయంలో ఒక కీలకమైన ఘట్టం. ఇప్పటికే ఆయన పార్టీలోనూ, ప్రజలకూ ఎన్నో ప్రశ్నలకు జవాబులు చెప్పాల్సిన పరిస్థితుల్లో ఉన్నారు. అసలు గత పది సంవత్సరాల్లో బిహార్‌లో బీజేపీ చొచ్చుకుపోయేలా ఆయన ఎందుకు చేయలేకపోయారో, కుల సమీకరణాలను బీజేపీ ఎందుకు అధిగమించలేకపోయిందో అన్నది ఒక ప్రశ్న. బిహార్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించలేకపోతే, ఇతర శక్తులు బలం పుంజుకుంటాయి. బీజేపీ విజయం సాధిస్తే మోదీ తదుపరి రాజకీయ విజృంభణలకు అడ్డుకట్టవేసే వారుండరు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో సహా అనేక రాష్ట్రాలు ఆయన తదుపరి ఎత్తుగడలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండవల్సి వస్తుంది.

మహాఘట్ బంధన్ తీరేవేరు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 1 వరకు బిహార్‌లో 1300 కి.మీ ఉధృతంగా పర్యటించిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆ తర్వాత దాదాపు రెండు నెలల వరకు అక్కడ కనపడకుండా పోయారు. టిక్కెట్ల పంపిణీ విషయంలో తీవ్ర గందరగోళం జరుగుతున్నా, ఆయన పట్టించుకోలేదు. పొత్తు దాదాపు కూలిపోతుందన్న పరిస్థితుల్లో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. ఓటర్ అధికార్ యాత్ర జరిపిన తర్వాత ఆ ప్రభావాన్ని కొనసాగించేందుకు రాహుల్ బిహార్‌లోనే ఉండి పార్టీని క్రింది స్థాయి నుంచి సంఘటితంగా నిర్మించేందుకు ఎందుకు ప్రయత్నించలేదు? ఒక్కొక్క సీటూ ముఖ్యమైన పరిస్థితుల్లో 9 సీట్లలో స్నేహపూర్వక పోటీ చేస్తామనడంలో అర్థం ఉన్నదా? అసలు రాజకీయాల్లో స్నేహపూర్వక పోటీ అనేది ఉంటుందా? బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేసే 61 సీట్లలో సగమైన గెలుచుకోకపోతే రాహుల్‌గాంధీని బిహార్ ప్రజలు తిరస్కరించారని, ఓట్ చోరీ విషయమై మోదీపై ఆయన చేసే ఆరోపణలు గాలికి కొట్టుకుపోయాయని భావించవలిసి ఉంటుంది. ఆయన ప్రయోగిస్తానన్న హైడ్రోజన్ బాంబు ఏమైంది? అత్యంత వెనుకబడిన బిహార్‌లో రాజకీయాలు కులం చుట్టే తిరుగుతాయని వేరే చెప్పనక్కర్లేదు. కులాల లెక్కలు, మనుగడ కోసం వేసే ఎత్తుగడలు, మత విద్వేషాలు, తాయిలాల సమీకరణాలను అధిగమించి పార్టీలు వ్యవహరించినప్పుడే బిహార్‌కు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. లేకపోతే బిహార్ కవి దినకర్ ఒకప్పుడు ఎలుగెత్తిన 'సింహాసన్ ఖాళీకరో.. ప్రజలు వస్తున్నారు' అన్న నినాదం ఆ సేతుహిమాచలం మారుమ్రోగే పరిస్థితి ఏర్పడుతుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

న్యాయం, అన్యాయం చూడాలి!

ఆంధ్రజ్యోతి అక్టోబర్ 23 సంచికలో పి. విక్టర్ విజయ్‌కుమార్ 'హమాస్ దుర్మార్గం – ఇజ్రాయెల్ అమానుషం' పేరుతో వ్యాసం రాశారు. శీర్షిక ఆకర్షణీయంగా కనబడినా, అంతర్లీనంగా వ్యాసం పాశ్చాత్య మీడియా నెరేటివ్‌కు ప్రతిధ్వనిగా, వాస్తవాల వక్రీకరణతో, అర్ధసత్యాల మేళవింపుతో నిండిపోయింది. 'ఇజ్రాయెల్ – ఫలస్తీనా ఘర్షణ' లాంటి సంక్లిష్ట, చారిత్రక అంశంపై రాస్తున్నప్పుడు సమతుల్యత కోసం చూడకూడదు. న్యాయం, అన్యాయం చూడాలి. న్యాయం వైపు నిలబడాలి. కానీ ఈ వ్యాసం ఆ ప్రమాణాన్ని అందుకోలేకపోయింది.

హమాస్‌ను 'ఉగ్రవాద సంస్థ'గా, ఇజ్రాయెల్ చర్యలను 'స్వీయరక్షణ'గా చూడటం పాశ్చాత్య శక్తుల రాజకీయ నిర్వచనానికి అతికినట్లున్న అభిప్రాయం. 1949 జెనీవా ఒప్పందం, 1977 అదనపు ప్రోటోకాల్స్ ప్రకారం... ఆక్రమిత భూభాగంలోని ప్రజలు తమ ఆత్మరక్షణ కోసం సాయుధ ప్రతిఘటన చేయవచ్చు. ఇది అంతర్జాతీయ చట్టబద్ధ హక్కు. అలాంటి న్యాయ పోరాటాన్ని, అన్యాయాన్ని ప్రతిఘటించడాన్ని 'ఉగ్రవాదం'గా చూడటం చట్టానికీ, చరిత్రకూ అవమానం.

1948లో ఇజ్రాయెల్ ఏర్పడినప్పుడు దాదాపు 7.5 లక్షల మంది ఫలస్తీనీయులు తమ ఇళ్ల నుంచి బహిష్కృతులయ్యారు. నేటికీ యూఎన్‌ఓ రికార్డుల ప్రకారం 59 లక్షల మంది శరణార్థులుగా ఉన్నారు. ఇంతటి చారిత్రక పీడనను తట్టుకొని నిలబడిన జాతి ప్రతిఘటనపై 'ఉగ్రవాదం' అనే ముద్ర వేయడం చాలా అన్యాయం. గాజాపై ఇజ్రాయెల్ విధించిన ఆంక్షలను 'భద్రతాపరమైన చర్య'గా రచయిత పేర్కొన్నారు. కానీ వాస్తవం దీనికి విరుద్ధంగా ఉంది. నిజానికి అది భద్రత కాదు, సామూహిక శిక్ష. 2007లో హమాస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గాజా ప్రాంతం సంపూర్ణ నిర్బంధంలోకి నెట్టివేయబడింది. ఆహారం, ఇంధనం, నీరు, విద్యుత్తు, ఔషధాలు అన్నింటిపైనా ఆంక్షలు విధించి, లక్షలాదిమంది నిరపరాధులను అమానవీయంగా నిస్సహాయ పరిస్థితుల్లోకి నెట్టివేశారు. ఈ నిర్బంధం కేవలం ఆర్థికం కాదు, ఇది ఒక జాతిని భూమ్మీద నుంచి చెరిపేయాలనే పగతో నిండిన అమానవీయ, పైశాచిక యుద్ధోన్మాదం.



హమాస్ హింస ముమ్మాటికీ తప్పే. కానీ ఇజ్రాయెల్ దుర్మార్గాలు న్యాయ సమ్మతమనడం అత్యంత ఘోరమైన తప్పు. బాంబులు ఎవరి చేతుల్లో ఉన్నా పతనమే సృష్టిస్తాయి. అవి ఎవరినీ రక్షించవు. ప్రపంచం ఈ యుద్ధాన్ని భద్రతా సమస్యగా కాకుండా, మానవతా సంక్షోభంగా చూడాలి.

ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో నిరపరాధులైన పసి పిల్లలు, గర్భిణులు, వైద్యులు, జర్నలిస్టులు కూడా బలయ్యారు. ఆసుపత్రులు, పాఠశాలలు, మసీదులు, శరణాలయాలు, ఏవీ సురక్షితంగా లేవు. చిన్నపిల్లల శరీరాలు మాంసపు ముద్దల్లా చెల్లాచెదురై మట్టిలో కలిసిపోయాయి; తల్లుల కేకలు, ఆర్తనాదాలు మానవ చరిత్ర సిగ్గుతో తలదించుకునే స్థాయిలో ఉన్నాయి. ఇది యుద్ధం కాదు, నరమేధం. ఇలాంటి దారుణాలకు సమర్థనగా 'భద్రత' అనే పదం వాడటం మానవత్వానికే మాయని మచ్చ. 'పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2024 నాటికి గాజా నివాస యోగ్యంగా ఉండదు' అని యూఎన్‌ఓ 2012లోనే హెచ్చరించింది. దురదృష్టవశాత్తూ 2025 నాటికి ఇది నిజమై కనబడుతోంది. గాజాలోని 70 శాతం నీటి వనరులు కలుషితమయ్యాయి, 90 శాతం ప్రజలు ఆహారం కోసం ఇతరుల సహాయంపై ఆధారపడుతున్నారు. 65,000 మందికి పైగా మరణించారు. వారిలో సగానికి పైగా పిల్లలు, మహిళలు.

అలా అని హమాస్ హింసను అస్సలు సమర్థించడం లేదు. కానీ ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న అత్యంత క్రూరమైన, నిరంతర హింసను, చిన్న పిల్లల హత్యలను, ప్రజల సామూహిక వధను పెద్ద నేరంగా గుర్తించకపోవడం, అంతర్జాతీయ సమాజం అస్సలు పట్టించుకోకపోవడం అన్నిటికన్నా పెద్ద విషాదం. నిజానికి అదే మానవతకు జరుగుతున్న పెద్ద అవమానం.

హమాస్ దాడులే ఫలస్తీనా ప్రజల బాధలకు మూల కారణమని విజయ్‌కుమార్ సూత్రీకరిస్తున్నారు. అయితే ఫలస్తీనా ప్రజలు గత 75 సంవత్సరాలుగా ఆక్రమణ, పీడన, అవమానం, నిర్బంధంలో జీవిస్తున్నారు. నిజానికి హమాస్ పుట్టుకకు మూలకారణం ఈ అన్యాయం, ఆక్రమణ, అణచివేతలే తప్ప మరొకటి కాదు. హమాస్ లేకున్నా ఇజ్రాయెల్ దాడులు ఆగేవి కావు. నక్బా నుంచి నేటి వరకు, ఇదొక చరిత్రాత్మక సత్యం. 1948లో ప్రారంభమైన 'నక్బా' అంటే ఫలస్తీనా జాతి విపత్తు. తరతరాలుగా వారు తమ సొంత నేలపైనే బహిష్కృతులుగా, శరణార్థులుగా జీవిస్తూ వస్తున్నారు.

ఫలస్తీనీయుల భూములు ఆక్రమించుకుని ఇజ్రాయెల్ నిర్మించిన అక్రమ కాలనీలు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ, వారి జీవన హక్కును కాలరాస్తున్నాయి. యూఎన్‌ఓ తీర్మానాలు ఇజ్రాయెల్ వైఖరిని ఎంత తీవ్రంగా, ఎన్నిసార్లు ఖండించినప్పటికీ, ప్రపంచ సామ్రాజ్యవాద శక్తుల ద్వంద్వ ప్రమాణాలు ఇజ్రాయెల్ దౌర్జన్యాలకే వంత పాడి ప్రోత్సహించాయి. విజయ్‌కుమార్ వ్యాసం ఈ చారిత్రక నేపథ్యాన్ని పూర్తిగా పక్కనబెట్టి, ఒకే కోణం నుంచి తీర్పు చెప్పింది. అది పాఠకులను తప్పుదోవ పట్టించే బలమైన ఎత్తుగడ.

హమాస్ హింస ముమ్మాటికీ తప్పే. కానీ ఇజ్రాయెల్ దుర్మార్గాలు న్యాయ సమ్మతమనడం అత్యంత ఘోరమైన తప్పు. బాంబులు ఎవరి చేతుల్లో ఉన్నా పతనమే సృష్టిస్తాయి. అవి ఎవరినీ రక్షించవు. ప్రపంచం ఈ యుద్ధాన్ని భద్రతా సమస్యగా కాకుండా, మానవతా సంక్షోభంగా చూడాలి. ఇజ్రాయెల్–ఫలస్తీనా ఘర్షణను రాజకీయ కోణంలో కాకుండా, మానవ విలువల దృష్టిలో చూడడం అవసరం. లేకపోతే, చరిత్ర మనందరినీ నిశ్శబ్ద దోషులుగా గుర్తిస్తుంది.

● యండి. ఉస్మాన్‌ఖాన్

సాగు సమస్యల పరిష్కారంతోనే అధిక ఉత్పాదకత

దేశంలో వెనుకబడిన వంద జిల్లాల్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధే (పంటల ఉత్పత్తి పెంచడం, వాటిలో వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, సాగునీరు సదుపాయం, పంటల నిల్వ సామర్థ్యం మెరుగుపరచడం, రైతులకు రుణాలు... వంటివి) ప్రధాన లక్ష్యంగా 'ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన' (పీఎండీడీకేవై), తృణధాన్యాల మిషన్‌లకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీ ఈ పథకాలను ప్రారంభించారు. వీటిని రాబోయే రబీ సీజన్ నుంచి మరో ఆరేళ్ల వరకూ అమలు చేస్తారు. 'అన్నదాతలకు అభయం, దిగుమతులు తగ్గించుకోవాలి– ఎగుమతులు పెంచుకోవాలి, తృణ ధాన్యాల సాగు పెంచాలి...' అంటూ ప్రధాని పిలుపునిచ్చారు. ప్రతిపాదిత వంద జిల్లాల్లో ఈ పథకాల ద్వారా 35,440 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పారు. అయితే, గత పదేళ్లలో 'విత్తనం నుంచి మార్కెట్ వరకూ' దేశంలో అనేక సంస్కరణలు చేశామని మోదీ చెప్పారు. కానీ ఈ సంస్కరణలు రైతులకు ఏ మేరకు లబ్ధి చేకూర్చాయి అన్నదే ప్రశ్న.

దేశీయ అవసరాల కోసం 2024–25లో రూ.48 వేల కోట్ల విలువైన (73 లక్షల టన్నుల) పప్పు ధాన్యాలను భారత్ దిగుమతి చేసుకుంది! ఈ పరిస్థితి మారాలి. గతంలో కేంద్రం పలు పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నట్టు ప్రకటించింది. కానీ దేశంలోని ఎనభైశాతం మంది రైతులకు ఆ మద్దతు ధరలో సగం కూడా అందడం లేదు. 'తృణధాన్యాల మిషన్' సత్ఫలితాలు ఇవ్వాలంటే కేంద్రం చిత్తశుద్ధితో కృషి చేయాలి.

వ్యవసాయరంగంలో నిజమైన ఆత్మనిర్భరత సాధించాలంటే 'సాగులో– మౌలిక వసతులు, తక్కువ ఉత్పాదకత, సాగు నీరు, మార్కెట్ సమస్యలు, కౌలు రైతుల సమస్యలు' వంటి అనేక సవాళ్లను పరిష్కరించటంపై కేంద్రం దృష్టి సారించాలి. అధిక దిగుబడినిచ్చే వంగడాలు, ఆధునిక సేద్య పద్ధతులపై పరిశోధనలకు ప్రభుత్వాలు తగినంత ప్రోత్సాహం అందించాలి. చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ధరకు సాగు యంత్రాలు అందుబాటులో ఉంచాలి. వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించాలి. ప్రతిపాదిత వంద జిల్లాలకే పరిమితం కాకుండా దేశంలోని అన్ని జిల్లాల్లోనూ వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలకు ప్రణాళికలు అమలు చేయాలి. అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు కల్పించాలి. స్వామినాథన్ కమిషన్ నివేదిక ప్రకారం 'సమగ్ర ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి రైతులకు మద్దతు ధర ఇవ్వాలి. దానికి చట్టబద్ధత కల్పించాలి'. అప్పుడే సాగు రంగంలో వికసిత్ భారత్ సాధ్యం.

– బొంతు రాంబాబు

వణికించిన మొంథా

మంగినపూడి బీచ్‌లో ఉద్ధృతంగా వస్తున్న అలలు



పశ్చిమ ప్రాంతంలో భారీగా ఈదురు గాలులు

కూలిన విద్యుత్ స్తంభాలు.. విరిగిపడిన చెట్లు

మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించాయి. భారీగా వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ తీగలు తెగిపోయాయి. వేలాది ఎకరాల్లోని వరి చేలు నేలవాలాయి. ఆర్టీసీ బస్సులు, విమాన సర్వీసులను రద్దు చేయడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. రాత్రి వేళ నగరంలో నిర్మానుష్యం రాజ్యమేలింది.

- నేలకొరిగిన వరి పంట.. పత్తికి మొలకలు
- ఎన్టీఆర్‌లో మోస్తరు, కృష్ణాలో భారీగా పంట నష్టం
- ఆర్టీసీ బస్సుల రద్దుతో నిలిచిన రవాణా
- ఆగిన విమానాల రాకపోకలు

నిర్మానుష్యంగా రోడ్లు

నగరంలో చిత్రమైన పరిస్థితి కనిపించింది. తుఫాను మరో గంటలో తీరం దాటుతుందనగా నగర ప్రజలంతా కూడా ఇళ్లకు పరిమితమయ్యారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. తీరాన్ని తాకాక కూడా ఓ మోస్తరు గాలులు, చిరు జల్లులు మాత్రమే పడటంతో ఈ తర్వాత ప్రజలు రోడ్ల మీద రాకపోకలు సాగించటం ప్రారంభించారు. విజయవాడలో మధ్యాహ్నం 3 గంటల నుంచి మబ్బులు కమ్ముకోవటంతో సాయంత్రం వాతావరణం కనిపించింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/విజయవాడ సిటీ): మొంథా తుఫాను తీరాన్ని తాకడంతో ఎన్టీఆర్ జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా తేలికపాటి జల్లులు కురిసాయి. తుఫాను తీరం దాటే సమయం నుంచి అర్ధరాత్రి వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెడ్డిగూడం మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయింది. విస్సన్నపేట, ఇబ్రహీంపట్నంలో మోస్తారు వాన కురిసింది. విజయవాడ నగరంలోనూ భారీ వర్షం కురిసింది. రాత్రి పది గంటలకు అధికారులు విడుదల చేసిన నివేదిక ప్రకారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు జిల్లాలో 78 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా రెడ్డిగూడెంలో 10.4 వర్షపాతం నమోదయింది.



వెలవెల బోయిన విమానాశ్రయం

నిత్యం ప్రయాణికుల రాకపోకలతో కళకళలాడే గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం మొంథా తుఫాను కారణంగా వెలవెలబోతుంది. ప్రతిరోజు విమానాశ్రయం నుంచి 46 సర్వీసులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవి. వేల సంఖ్యలో ప్రయాణికులు విమానాల్లో వెళ్లి వచ్చేవారు. తుఫాను కారణంగా 36 సర్వీసులు నిలిపివేయగా, పది సర్వీసులు మాత్రమే నడుస్తున్నాయి. ఎప్పుడూ ప్రయాణికులతో రద్దీగా ఉండే విమానాశ్రయం కళ తప్పింది. విమానాశ్రయ ప్రాంగణం నిర్మానుష్యంగా మారింది. విమానాశ్రయం నుంచి ప్రతి రోజూ ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఇండియాకు చెందిన విమానాలు ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, వైజాగ్, తిరుపతి, చెన్నై, ముంబై, కడప, షార్జాలకు రాకపోకలు సాగిస్తుండేవి. తుఫాన్ దెబ్బతో విమానాలను రద్దు చేశారు. ప్రయాణికులు కూడా రాకపోవడంతో విమానాశ్రయం వెలవెలబోతోంది.



మద్దులపర్వ గ్రామంలో ఈదురు గాలులకు నేలవాలిన వరి

నేలవాలిన వరి

జిల్లా వ్యాప్తంగా వరిపైరుపై తుపాను తీవ్ర ప్రభావం చూపింది. రెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు నేలవాలాయి. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1,21,187.5 మిగతా 6లో..

చకచకా రేషన్

ఉమ్మడి జిల్లాలో డిపోలకు బియ్యం, పంచదార సరఫరా

- లబ్ధిదారులకు పంపిణీ ప్రారంభించిన డీలర్లు
- మధ్యాహ్నానికి 40 శాతం డోర్ డెలివరీ పూర్తి
- అదనంగా గ్యాస్ సిలిండర్లను సిద్ధం చేయాలని ఏజెన్సీలకు ఆదేశాలు
- డీజిల్, పెట్రోల్ నిల్వలు పెంచాలని బంకుల నిర్వాహకులకు సూచన



నిత్యావసరాలు డోర్ డెలివరీ చేస్తున్న డీలర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మొంథా తుఫాను నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ముందస్తుగా పౌరసరఫరాల శాఖ అధికారులు నిత్యావసరాల పంపిణీ చేపట్టారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో చౌక దుకాణాలకు బియ్యం, పంచదార సరఫరా చేశారు. ఎన్టీర్ జిల్లాలో 957 డిపోలకు మొత్తం 4,298 మెట్రిక్ టన్నుల బియ్యం, 134 మెట్రిక్ టన్నుల పంచదార తరలించారు. విజయవాడ నగరం, జిల్లా వ్యాప్తంగా నిత్యావసరాల పంపిణీ ప్రారంభించారు. 65 సంవత్సరాల పైబడిన వారికి ఇంటికే నిత్యావసరాలు డోర్ డెలివరీ చేస్తున్నారు. మధ్యాహ్నానికి 40 శాతం మేర డోర్ డెలివరీ పూర్తి చేశారు. కృష్ణా జిల్లాలో 1,059 రేషన్ డిపోలకు పూర్తిగా మిగతా 6లో..

పోలీస్ కమిషనరేట్ విడుదల చేసిన బుడమేరు వాగు డ్రోన్ చిత్రం



బుడమేరు వరద అపోహలు నమ్మొద్దు

పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కురిసే వర్షాలకు బుడమేరు పొంగుతుందని జరిగే అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని జిల్లా ప్రజలకు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు కొన్ని అసాంఘిక శక్తులు పనికట్టుకని దుష్ప్రచారాన్ని చేస్తున్నాయని తెలిపారు. బుడమేరు వాస్తవ ప్రత్యక్ష ప్రవాహ దృశ్యాన్ని డ్రోన్‌ల సాయంతో చిత్రీకరించి సదరు ఫొటోలను మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మున్నేరు, బుడమేరు, కట్టలేరు, వైరా తదితర వాగులను అన్నింటినీ నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్‌ల సాయంతో వాగులను పరిశీలిస్తున్నామని తెలిపారు. వాగుల పరిస్థితిని ఎప్పటికపుడు అంచనా వేస్తూ, సంబంధిత సమాచారాన్ని కంట్రోల్ రూంలకు చేరవేస్తున్నామన్నారు. వాగుల్లో నీటి ప్రవాహ స్థితిని నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతానికి వాగుల్లో ప్రమాదకర పరిస్థితులు ఏమీ లేవని స్పష్టం చేశారు. ఏదైనా ప్రమాదకర పరిస్థితులు తలెత్తితే ప్రజలకు వెంటనే తెలియజేస్తామన్నారు. బుడమేరుపై జరుగుతున్న ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దన్నారు.

అద్వైక ఆదిత్య అరెస్టు

పెట్టుబడులుగా రూ.413.03 కోట్లు వసూలు

- మొత్తం పెట్టుబడుదారులు 1,417
- రూ. 144 కోట్లకు టోకరా
- వివరాలు వెల్లడించిన సీపీ రాజశేఖరబాబు

పెట్టుబడిగా లక్ష రూపాయలు పెడితే నెలకు రూ. 6 వేలు వడ్డీగా చెల్లిస్తానని చెప్పి ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేసిన అద్వైక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్యను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. అతడితోపాటు భార్య సుజాత, మరో ఇద్దరు ఏజెంట్లు విజయవాడ లబ్బీపేటకు చెందిన గాదంశెట్టి బాలకృష్ణమూర్తి, ఆయన సతీమణి నాగలక్ష్మీదేవికి సంకెళ్లు వేశారు. వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు కేజీవీ సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, ఏసీపీలు లతాకుమారి, కె.దామోదరరావు, ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్, సుబ్రహ్మణ్యంతో కలిసి కమిషనర్ కార్యాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం వెల్లడించారు.



అద్వైక యజమానుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, వెండి వస్తువులను ప్రదర్శిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ వడ్డీ చెల్లిస్తామని ప్రజలకు ఆశలు పుట్టించి ఆదిత్య రూ.413.03 కోట్లను పెట్టుబడులుగా వసూలు చేశాడు. ఏజెంట్లు, ఖాతాదారులు వెరసి 1,417 మంది ఇందులో పెట్టుబడులు పెట్టారు. 2022లో ఆదిత్య, అతని భార్య సుజాత విజయవాడలో అద్వైక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేశారు. వారు తొలుత రూ.15 లక్షల పెట్టుబడితో దుబాయిలోని కబానా అకౌంట్ ద్వారా ఫారెక్స్ ట్రేడింగ్ ప్రారంభించారు. అద్వైక ప్రారంభించిన కొత్తలో లాభాలు పెద్దగా రాకపోవడంతో ఆదిత్య, సుజాత కలిసి పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రణాళిక రూపొందించారు. సుజాతకు ప్రైవేటు బ్యాంకులో రికవరీ మేనేజర్‌గా ఉద్యోగం చేసిన అనుభవం ఉండడంతో తమ సంస్థలో పెట్టుబడి పెట్టిన వారికి నెలకు ఆరు శాతం, ఏజెంట్లకు మూడు నుంచి మిగతా 6లో..

నిందితులకు రిమాండ్

అద్వైక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్యతోపాటు మరో ముగ్గురికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఆదిత్య, ఆయన భార్య సుజాత, ఏజెంట్లు గాదంశెట్టి బాలమురళీకృష్ణ, ఆయన సతీమణి నాగలక్ష్మీదేవిని పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రాత్రి విజయవాడ మొదటి అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు వచ్చే నెల పదో తేదీ వరకు రిమాండ్ విధించింది. అనంతరం నిందితులను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

సత్యదేవుడి సన్నిధిలో డీఎస్పీల జంట



సత్యదేవుని సన్నిధిలో అవనిగడ్డ, గురజాల డీఎస్పీలు విద్యశ్రీ, జగదీష్

అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డీఎస్పీలు ప్రేమించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక్కటైన జంట మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా అవనిగడ్డ డీఎస్పీగా పని చేస్తున్న విద్యశ్రీ, పల్నాడు జిల్లా గురజాల డీఎస్పీగా పని చేస్తున్న జగదీష్‌లు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరుపెద్దల అంగీకారంతో వారు ఒక్కటయ్యారు. వారికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయగా దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఒకే క్యాడర్ గల పోలీస్ అధికారుల ప్రేమవివాహం విశేషంగా మారింది.

పత్తి రైతు కుదేలు!

- దూదిలోనే గింజల నుంచి మొలకలు
- మొంథా తుఫాను ప్రభావంతో నష్టం 6

పునరావాస కేంద్రంలో ప్రజలకు ఆహారం అందజేస్తున్న మంత్రి సత్యకుమార్



కొండ ప్రాంత ప్రజల భద్రతపై దృష్టి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను నేపథ్యంలో విజయవాడ అర్బన్ పరిధిలో కొండ ప్రాంతాల ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, మున్సిపల్, వ్యవసాయ, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, ఆర్‌టీజీఎస్ సూచనల మేరకు జిల్లాలో విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇందుకు ప్రత్యేకంగా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. విజయవాడ అర్బన్ ప్రాంతంలో కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడేందుకు అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి, ముప్పు ఉన్న ఆవాసాల్లోని వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించినట్టు వివరించారు. అవసరమైన మందులతో పాటు 108, 104 ద్వారా సమర్థవంతంగా సేవలందించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి చిట్టినగర్ రాకేష్ ఈఎం హైస్కూల్‌లోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు.

కమ్యూనికేషన్స్ అలెర్ట్!

నాటి బుడమేరు పరిస్థితులను పునరావృతం కానీయొద్దు

- సమాచార వ్యవస్థ లేక ఆకలితో అలమటించిన బాధితులు
- గత అనుభవ పాఠాలతో పక్కా ప్రణాళిక అవసరం
- టెలికాం నెట్‌వర్క్, సెల్ టవర్స్, పవర్ బ్యాకప్‌పై దృష్టి సారించాలి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మొంథా తుఫాను నేపథ్యంలో కమ్యూనికేషన్ వ్యవస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటిని విఘాతం ఏర్పడితే విపత్తులో బాధితులకు సహాయక చర్యలు అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విషయం గత బుడమేరు వరదల సమయంలో తేటతెల్లమైంది. మళ్లీ అటువంటివి పునరావృతం కాకుండా ప్రస్తుత తుఫాను నేపథ్యంలో మన కమ్యూనికేషన్ వ్యవస్థలను కాపాడుకోవటం చాలా ముఖ్యం. జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ప్రైవేటు కంపెనీలు, ప్రజలు కూడా ఇలాంటి సమయాల్లో సీరియస్‌గా దృష్టి సారించాల్సి ఉంది. ప్రభుత్వ పరంగా చూస్తే టెలికాం టవర్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లపై నిరంతర పర్యవేక్షణ అవసరం. కీలకమైన టెలికాం టవర్లను ముందుగానే గుర్తించి అవి కూలకుండా ఉండటానికి, బలోపేతం చేయటానికి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. టెలికాం టవర్లలో బీఎస్ఎన్ఎల్ ఒక్కటే ప్రభుత్వ రంగానికి చెందింది. జీయో, ఎయిర్‌టెల్, వీఐ వంటి టెలికాం కంపెనీల టవర్లు ఉన్నాయి. ఈ కంపెనీల జిల్లా హెడ్స్‌తో అత్యవసరంగా సమావేశం నిర్వహించి వారి ద్వారా టవర్ల బలోపేతానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇదే సందర్భంలో పవర్ బ్యాకప్ సిస్టమ్‌పై కూడా దృష్టి అవసరం. సెల్ టవర్లు, కమ్యూనికేషన్ సెంటర్లలో పవర్ బ్యాకప్ సిస్టమ్ అనేది చాలా మిగతా 6లో..

అప్రమత్తత అవసరం

తుఫాన్ల సమయంలో ప్రజలు కూడా కమ్యూనికేషన్స్ వ్యవస్థల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పవర్ బ్యాకప్ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. ప్రధానంగా పవర్ బ్యాంకులు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు నూరు శాతం చార్జింగ్‌తో అంటిపెట్టుకోవాలి. అందుబాటులో ఉన్న బ్యాటరీలను, యూపీఎస్‌లను చార్జింగ్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవేళ విద్యుత్ లేకపోతే కారు, బైక్ చార్జర్ల ద్వారా కూడా చార్జింగ్ చేసుకునే అవకాశాలను ఉపయోగించుకోవచ్చు. ఏదైనా ప్రాంతం ప్రభావితం అవుతుందనుకుంటే.. ఆ ప్రాంత ప్రజలంతా వీలైనంత వరకు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి గ్రూపులను ఏర్పాటు చేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితులలో కమ్యూనికేషన్ కోసం ఇవి దోహద పడతాయి. అలాగే ఎక్స్, ఫేస్‌బుక్‌లను కూడా ఉపయోగించుకోవచ్చు.



దుర్గగుడి మూసివేత

ఇంద్రకీలాద్రి: మొంథా తుఫాను ప్రభావం.. దేవస్థానం అధికారులు, పాలకమండలి సభ్యుల సూచన మేరకు ఆలయ అర్చక, ఉద్యోగులు నిర్ణీత సమయానికంటే ముందే ఆలయాన్ని మంగళవారం రాత్రి 8 గంటలకు మూసివేశారు. తుఫాను ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా భక్తుల తాకిడి తక్కువగా ఉండటంతో పాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముందస్తుగా ఆలయాన్ని మూసివేసినట్టు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు అంతంత మాత్రంగా ఉండటంతో సాయంత్రం ఆలయ పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి. ఆలయాన్ని రాత్రి 8 గంటలకు మూసివేయాలన్న ఈవో వీకే శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆదేశాల మేరకు అర్చకులు, అధికారులు ఆలయాన్ని మూసివేశారు. బుధవారం ఉదయం యధావిధిగా అమ్మవారి దర్శనం ఉంటుందని అధికారులు తెలిపారు.



సీఎం కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్నకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

కనకదుర్గమ్మను దర్శించుకున్న ప్రద్యుమ్న

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న సతీసమేతంగా కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో వీకే శీనానాయక్, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

విమానాశ్రయం కస్టమ్స్ గదిలో మంటలు

» ఫైర్ సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

గన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయంలోని అంతర్జాతీయ టెర్మినల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అంతర్జాతీయ టెర్మినల్లోని కస్టమ్స్ అధికారుల గదిలో స్విచ్ బోర్డ్ వద్ద మంటలు వ్యాపించాయి. అక్కడ ఉన్న వస్త్రాలకు మంటలు అంటుకుని దట్టమైన పొగలు అలముకున్నాయి. భద్రతా సిబ్బంది సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న అగ్నిమాపక బృందం మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో ఎటువంటి ఆస్తినష్టం సంభవించలేదని, ఎవరికి గాయాలు కాలేదని డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత రెడ్డి తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తాడేపల్లి డైరెక్షన్‌లోనే.. జోగి ప్రమాణాల డ్రామా

» పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

వన్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లి డైరెక్షన్‌లోనే ప్రమాణాల పేరుతో కొత్త నాటకానికి జోగి రమేశ్ తెరతీశాడని, నిస్సిగ్గుగా అబద్ధాలు ఆడుతూ నీచ రాజకీయాల కోసం సొంత కుటుంబసభ్యులను కూడా రోడ్డుపైకి తీసుకొచ్చిన వ్యక్తిత్వం ఆయనకే చెల్లిందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక జోగి ప్రమాణాల పేరుతో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. చంద్రబాబు ఇంటిపై దాడిచేసి దొడ్డిదారిలో మంత్రి పదవి తెచ్చుకున్న జోగి వ్యక్తిత్వం గురించి చెప్పనక్కర్లేదన్నారు. నకిలీ మద్యం కేసులో సాక్ష్యాలతో సహా జోగి దొరికిపోయాడని.. ఎన్ని ప్రమాణాలు చేసినా నిందితులకు శిక్ష తప్పదన్నారు.

కొండవీటి వాగు ప్రాంతాలను

పరిశీలించిన ఏడీసీ బృందం

కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో ఎగువ నుంచి కొండవీటి వాగుకు వరద నీటి తాకిడి వున్నందున అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి మంగళవారం కొండవీటి వాగు పరివాహక ప్రాంతాలను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎగువ నుంచి కొండవీటి వాగులో నీటి ఉధృతి పెరిగే క్రమంలో ప్రవాహానికి ఎక్కడా అంతరాయం కలుగకుండా అప్రమత్తంగా వుండాలన్నారు. ముఖ్యంగా కొండవీటివాగు దాటుకొని వెళ్లే నీరుకొండ, కురగల్లు, ఎన్-6 పశ్చిమ బైపాస్, ఈ-10 రహదార్ల వద్ద వాగు వొంపులుగా వున్న ప్రదేశాలలో అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ప్రధానంగా అమృత విశ్వ విద్యాలయం వద్ద ప్రవాహం తీరు వేగంగా జరిగే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలవాగు కొండవీటి వాగులో కలిసే కృష్ణాయపాలెం వద్ద స్వీయపరిశీలన జరిపారు. కొండవీటి వాగు కృష్ణానదిలో కలుస్తున్న ఉండవల్లి ఇరిగేషన్ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. వరద నీటి ఎత్తిపోత పరిస్థితిని సమీక్షించారు. కొండవీటి వాగు పరివాహక ప్రాంతంలో ఇంజినీర్లు అనుక్షణం వరద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చంద్రబాబుకు విజయవాడ పుస్తక మహోత్సవ ఆహ్వానం



విజయవాడ సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : 2026 జనవరి రెండు నుంచి ఏడో తేదీ వరకు విజయవాడలో నిర్వహించే 36వ పుస్తక మహోత్సవ ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబును బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆహ్వానించింది. ఆహ్వాన పత్రాన్ని సీఎం క్యాంపు ఆఫీసులో సీఎం చంద్రబాబుకు సొసైటీ అధ్యక్షులు టి.మనోహర్‌నాయుడు, ఏపీ ప్రింటర్‌లు, పబ్లిషర్‌ల సంఘం అధ్యక్షులు కాట్రగడ్డ మోహన్ మంగళవారం అందజేశారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేలా పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్న సొసైటీ బృందాన్ని సీఎం అభినందించారు.



పునరావాస కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియా, మొగల్రాజపురం కొండప్రాంతాల్లో బాధితులకు భరోసా కల్పిస్తున్న ఆర్డీవో కావూరి చైతన్య, పునరావాస కేంద్రాల్లో సూచనలు చేస్తున్న ఆర్డీవో మాధురి

సర్వసన్నద్ధం

» మొంథా తుపానును ఎదుర్కొనేందుకు జిల్లా, నగర యంత్రాంగాలు

» ప్రాణ నష్టం నివారించటమే లక్ష్యంగా టీమ్ ఎన్టీఆర్ ఆపరేషన్

» అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో విధులు

» ముందస్తుగా అవరోధాలన్నీ తొలగింపు

» ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు

(ఆంధ్రజోతి, విజయవాడ) : మొంథా తుపానును ఎదుర్కొనేందుకు జిల్లా, నగర యంత్రాంగాలు సంసిద్ధమయ్యాయి. విపత్తులను ఎదుర్కొనేందుకు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తక్షణం రంగంలోకి దిగి పరిష్కరించేందుకు వీలుగా ఇప్పటికే ఏర్పాట్లు చేశాయి. రెండురోజులుగా జిల్లా యంత్రాంగం విశ్రాంతి లేకుండా పనిచేస్తోంది. ప్రత్యేక అధికారి శశిభూషణ్ కుమార్ మంగళవారం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ నగరంలోనే ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు ముందస్తుగా ప్రమాదకర భవనాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల వారిని, ప్రమాదకర ప్రాంతాలలో నివశించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎక్కడికక్కడ జిల్లా వైద్యారోగ్యశాఖ నేతృత్వంలో శిబిరాలను నిర్వహిస్తున్నారు. కాలువల డీసిల్టింగ్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. వర్షం కురిస్తే వరద నీరు పారటానికి మేజర్ డ్రెయిన్లు, ఔట్ ఫాల్ డ్రెయిన్స్ అన్నింటిలోనూ డీసిల్టింగ్ చేపట్టారు. మరో వైపు విద్యుత్ సిబ్బంది కూడా అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. విద్యుత్ అంతరాయాలు వాటిల్లితే వెంటనే పునరుద్ధరించగలుగుతున్నారు. దీనికోసం విద్యుత్ శాఖ మొబైల్ టీమ్స్‌ను సిద్ధం చేసింది. గ్రామ సచివాలయాల పరిధిలో జనరేటర్లను సిద్ధం చేశారు. నగరంలో చెట్ల కొమ్మలు విరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగా నరికివేయించారు. జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో అధికార యంత్రాంగం మోటార్లతో సిద్ధంగా ఉంది. అగ్నిమాపక శాఖ బృందాలు ఎక్కడికక్కడ వాహనాలతో సిద్ధంగా ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖఅధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రెండురోజులుగా అవగాహన కల్పిస్తున్నారు. తుపాను నష్టం జరిగితే వేగంగా అంచనా వేసేందుకు తగిన బృందాలను సిద్ధం చేశాయి.



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మాట్లాడుతున్న అధికారులు శశి భూషణ్ కుమార్, లక్ష్మీశ

కలెక్టరేట్ : తుపానును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా వుందని ఎన్టీఆర్ జిల్లా తుపాను ప్రత్యేక అధికారి శశిభూషణ్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లక్ష్మీశతో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించి జిల్లావ్యాప్తంగా చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకొన్నారు. విపత్తు ఎదుర్కోవడానికి అవసరమైన జేసీబీ, ట్రాక్టర్లు, యంత్రాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లాయంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, కీలక శాఖల సిబ్బంది తుపాను ప్రతిస్పందన చర్యలలో నిమగ్నమై వున్నారని చెప్పారు. అన్ని వసతులతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారని, క్షేత్రస్థాయి యంత్రాంగమంతా సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు. ఇప్పటి వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. ఇది తీవ్ర తుపాను అని, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా వుండాలని సూచించారు. ప్రజలు ఏర్పాట్లు, చర్యలపై తమకు ఫీడ్ బ్యాక్ ఇవ్వొచ్చని చెప్పారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, అవేర్ వెబ్‌సైట్ ద్వారా తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తుపాను ముప్పు పొంచి వున్న గ్రామాల, ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు. వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా కాలువల్లోని నీటిని నియంత్రిస్తున్నామని, బుడమేరుపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రైతులు పంట కోతలు కోయరాదని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం

- ప్రత్యేక అధికారి శశిభూషణ్ కుమార్

క్షేత్రస్థాయి పర్యటనలతో భరోసా

కలెక్టరేట్/విద్యాధరపురం : ఎన్టీఆర్ జిల్లాలో మొంథా తుపాను వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ఉండేందుకు అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించారు. ప్రజా భద్రత, క్షేమమే లక్ష్యంగా తుపాను ప్రతిస్పందన చర్యలు తీసుకున్నామని, విజయవాడ అర్బన్, గ్రామీణ ప్రాంతాలతో పాటు నందిగామ, తిరువూరు డివిజన్లలోనూ అన్ని సౌకర్యాలతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ అర్బన్ పరిధిలోని విద్యాధరపురం జీఎస్ఆర్ స్కూల్‌లోని పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముప్పు పొంచి వున్న ప్రాంతాలను, పునరావాస కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి సందర్శించి,



పునరావాస కేంద్రంలో ఆహారం అందజేస్తున్న కలెక్టర్

అధికారులకు సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. మండలస్థాయి విపత్తు స్పందన బృందాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని బృందాల సిబ్బందితో మాట్లాడి ఏమాత్రం అలసత్వానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. జేసీ ఇలక్కియా కంచికచర్ల మండలంలోని పరిటాల చెరువుతో పాటు స్థానికంగా ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని, వాటర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. నందిగామ మండలం ఐతవరం గ్రామంలో వరి పొలాలను, రైతు సేవా కేంద్రాన్ని, పునరావాస కేంద్రాన్ని, నందిగామలో వరద ముప్పు పొంచి వున్న డీవీఆర్ కాలనీని పరిశీలించారు. జగ్గయ్యపేట పురపాలక సంఘం కార్యాలయం, చిల్లకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో సిద్ధంగా వుంచిన యంత్ర సామగ్రిని, పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు.

తుఫాను సహాయక చర్యలపై సమీక్ష

విజయవాడ సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొంథా తుఫాను సహాయక చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ముఖ్య కార్యాదర్శి ఆర్.పి.సిసోడియా ఆరా తీశారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంలో కలెక్టర్ జి.లక్ష్మీశ, జేసీ ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ ధ్యాన్‌చంద్ర, డీఆర్వో లక్ష్మీనరసింహంతో మంగళవారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఏర్పాటు చేసిన సహాయక చర్యలను అధికారులతో చర్చించారు. తీరం దాటే సమయంలో వీస్తున్న బలమైన గాలులకు నేలకూలుతున్న వృక్షాలు, తెగిపడుతున్న విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గాలులకు దెబ్బతిన్న పంట పొలాలను క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలించాలని సూచించారు. అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

తుఫాను సహాయక చర్యలకు రైల్వే సివిల్ డిఫెన్స్ సన్నద్ధం

విజయవాడ సిటీ : మొంథా తుఫాను నేపథ్యంలో రైల్వే ఆస్తులు పరిరక్షించేందుకు, రైల్వే సిబ్బంది, ప్రయాణికులకు సహాయక చర్యలు అందించేందుకు విజయవాడ రైల్వే డివిజన్ సివిల్ డిఫెన్స్ సంస్థను సన్నద్ధం చేశామని డివిజనల్ ఎమెర్జెన్సీ ఆఫీసర్ పి.వి.రామిరెడ్డి, సివిల్ డిఫెన్స్ స్టాఫ్ ఆఫీసర్ దినేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితి తలెత్తితే 9063348063(రాజమండ్రి), 9502446021(సామర్లకోట), 7569306071 (కాకినాడ), 0866-2451669/ 2451663/2451701/2451659 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

డెంటల్ ఆసుపత్రిలో చెవిరెడ్డికి వైద్య పరీక్షలు

విజయవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి విజయవాడలోని ప్రభుత్వ దంత ఆసుపత్రిలో మంగళవారం చికిత్స చేశారు. కొద్దిరోజులు క్రితం ఆయనకు రూట్ కెనాల్ చేశారు. దీనిలో భాగంగా జైలు అధికారులు ఆయనను దంత వైద్యశాలకు తరలించారు. చికిత్స పూర్తయిన అనంతరం తిరిగి జైలుకు తీసుకెళ్లారు.

వణికించిన మొంథా

(5వ పేజీ తరువాయి)

ఎకరాల్లో వరి సాగు చేశారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో లిఫ్ట్ ఇరిగేషన్ కింద సాగవుతున్న వరి ఈదురు గాలుల కారణంగా దెబ్బతిన్నాయి. మైలవరం నియోజకవర్గంలోని జీ కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల్లో పూర్తిగానూ, విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి, పైడూరుపాడు, గొల్లపూడి, కొత్తూరు తాడేపల్లి, రాయనపాడు గ్రామాల్లోనూ పంట దెబ్బతింది. తిరువూరు మండలంలోని మునగాల, వావిలాల గ్రామాల్లోని 70 ఎకరాల్లో వరి కోత దశకు వచ్చింది. తుఫాను కారణంగా కోత ఆగింది. గాలులు వీయడంతో ఆ వరి కాస్తా ఒరిగిపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీని వల్ల ధాన్యం దిగుబడి తగ్గిపోతుందని, తాలు శాతం పెరుగుతుందని చెబుతున్నారు. నేలవాలిన పంట కోత కూడా కష్టంగా మారుతుందని, కోత ఖర్చులు ఎక్కువగా ఉంటాయని పేర్కొంటున్నారు. మరో పక్క పూత మీద ఉన్న మామిడికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముందస్తుగా వచ్చే మామిడి పూత నల్లబారిపోతుందని రైతులు అంటున్నారు. పత్తి పంట తుఫాను వల్ల పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 81,861 ఎకరాలలో పత్తి సాగు జరుగుతోంది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఇప్పటికే విచ్చుకున్న పత్తి కాయల గింజల నుంచి మొలకలు వచ్చాయి. తుఫాను ప్రభావంతో పత్తికి తీరని నష్టం ఏర్పడబోతోంది. ఉద్యాన పంటలపై కూడా తుఫాను ప్రభావం చూపనుంది. మొక్కజొన్న, జొన్న, కందులు, మినుము, పెసర, చెరుకు, వేరుశెనగ, ఆముదం పంటల సాగు జరుగుతోంది. ఇతర పంటలతో పోల్చితే వరి, పత్తి పంటలు ఈ తుఫానుకు తీవ్ర ప్రభావితం అయ్యే అవకాశం ఉంది.

విద్యుత్ సరఫరాకు ఆటంకం

గాలుల ప్రభావానికి నగరంలోని ఈట్ స్ట్రీట్‌లో చెట్టు కూలింది. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి గంట వ్యవధిలోనే కూలిన చెట్టును తొలగించారు. అదేవిధంగా 14వ డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో చెట్ల కొమ్మలు విరిగి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడ్డాయి. విద్యుత్ సరఫరా జరుగుతుండగానే తీగలు తెగిపడ్డాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. రాత్రి ఎనిమిది గంటల నుంచి గాలుల ప్రభావం తీవ్రం కావడంతో కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఇబ్రహీంపట్నం ఏరియాలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఫెర్రి ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు వచ్చాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మరమ్మతులు చేపట్టి వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. భారీ గాలులు తగ్గే వరకు కూడా జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో పలు చోట్ల ముందస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

225 బస్సులను రద్దు చేసిన ఆర్టీసీ

మొంథా తుపాను నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మొత్తం 225 బస్సులను రద్దు చేశారు. దూర ప్రాంతాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, కాకినాడ, రాజమండ్రిలకు ప్రతి రోజూ ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ అధికారులు 190 బస్సులు నడుపుతుంటారు. జిల్లా వ్యాప్తంగా.. సబర్బన్ పరిధిలో ప్రతి రోజూ 791 బస్సులను నడుపుతుండగా.. 640 బస్సులనే నడిపారు. 149 బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. బుధవారం కూడా ఇదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది.

చకచకా రేషన్

(5వ పేజీ తరువాయి)

నిత్యావసరాల సరఫరా జరిగింది. ఆయా డిపోల పరిధిలో ఉదయం నుంచి నిత్యావసరాల పంపిణీ చేపట్టారు. మధ్యాహ్నం నాటికి 41 శాతం మేర లబ్ధిదారులకు అందించారు. కృష్ణాజిల్లాలో మొత్తం 69,680 మంది వృద్ధులకు డోర్ డెలివరీ చేపట్టాల్సి ఉండగా.. మధ్యాహ్నం నాటికి 23,309 మందికి పూర్తిచేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఆయా మండలాల పరిధిలో తహసీల్దార్లు బియ్యం కోరితే ఇవ్వాల్సిందిగా రేషన్ డీలర్లకు ఎన్టీఆర్, కృష్ణాజిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు పాపారావు, మోహన్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. డీలర్లకు అవసరమైనంత తాము తిరిగి డెలివరీ చేస్తామని తెలిపారు.

- ఎల్పీజీ డీలర్లు తగిన సంఖ్యలో గ్యాస్ సిలిండర్లను సిద్ధం చేసుకోవాల్సిందిగా రెండు జిల్లాల సివిల్ సప్లయిస్ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు గ్యాస్ ఏజెన్సీలన్నింటికీ ఆదేశాలు జారీ చేశారు. గ్యాస్ ఏజెన్సీల దగ్గర ఎంతెంత నిల్వలు ఉన్నాయో తెలుసుకుని ఆ మేరకు రిజర్వులో ఉంచాలని సూచించారు.

- అత్యవసర సమయాల్లో ప్రభుత్వ అవసరాలకు వినియోగించేలా అదనంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉంచాల్సిందిగా రెండు జిల్లాల్లోని పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. బంకుల వారీగా ఆయిల్ నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ కంపెనీల నుంచి మరింతగా దిగుమతి చేసుకోవాలని సూచించారు. బంకుల్లో ఎంత మేర ఆయిల్ నిల్వలు ఉన్నాయో కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

అద్విక ఆదిత్య అరెస్టు

(5వ పేజీ తరువాయి)

నాలుగు శాతం వడ్డీ చెల్లిస్తామని ప్రకటించారు. ఈవిధంగా ప్రజల నుంచి పెట్టుబడులను స్వీకరించారు. ఇలా కొత్త ఖాతాదారులు ఇచ్చిన డబ్బులతో పాత ఖాతాదారులకు చెల్లింపులు చేశాడు. 2023లో సృష్టించుకున్న వార్షికోత్సవం పేరుతో ఒక ఈవెంట్‌ను నిర్వహించి మరిన్ని డిపాజిట్లు సేకరించారు. కొంతమంది లాభాలకు ఆశపడి అద్వికకు ఏజెంట్లుగా మారి ఆదిత్యకు సహకరించారు. కొంత డబ్బును ఆదిత్య మల్టీ బ్యాంక్ గ్రూపునకు బదిలీ చేశాడు. ఈ డబ్బులను తన వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకున్నాడు. ప్రజల నుంచి సేకరించిన పెట్టుబడులతో ఆదిత్య రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థిర, చరాస్తులను సమకూర్చుకున్నాడు. కొన్ని ఆస్తులను ఆదిత్య తన పేరున, మరికొన్ని ఆస్తులను భార్య సుజాత పేరున రిజిస్ట్రేషన్ చేయించాడు. 2022 నుంచి ఈ ఏడాది జూన్ వరకు ఆదిత్య 1,417 మంది నుంచి రూ.413.03 కోట్లను డిపాజిట్లుగా సేకరించాడు. అందులో కొంత భాగాన్ని దుబాయిలో ఉన్న కబానా ట్రేడింగ్, మల్టీ బ్యాంకింగ్ ఫారెక్స్ వంటి విదేశీ ట్రేడింగ్ కంపెనీలకు బదిలీ చేశాడు. అద్వికలో మొత్తం 1,139 మంది ఖాతాదారులు రూ.255 కోట్లు పెట్టుబడిగా పెట్టారు. అందులో నుంచి రూ.120 కోట్లు వెనక్కి తీసుకున్నారు. వారు ఇంకా రూ.135 కోట్లు నష్టపోయారు. 204 మంది డిపాజిటర్లు రూ.35 కోట్లను పెట్టుబడిగా పెట్టి రూ.56 కోట్లు వెనక్కి తీసుకున్నారు. పెట్టుబడి కంటే రూ.21 కోట్లను అదనంగా తీసుకున్నారు. దీన్ని లాభంగా పరిగణించారు. 12 మంది ఖాతాదారులు రూ.1.8 కోట్లు పెట్టుబడిగా పెట్టారు. ఈ మొత్తాన్ని వెనక్కి తీసుకున్నారు. వాళ్లంతా లాభపడలేదు. అలాగని నష్టపోలేదు. 30 మంది ఏజెంట్లు రూ.54 కోట్లును పెట్టుబడులుగా పెట్టించి రూ.45 కోట్లను అద్విక నుంచి వెనక్కి తీసుకున్నారు. వాళ్లంతా రూ.9 కోట్ల వరకు నష్టపోయారు. 32 మంది ఏజెంట్లు రూ.54 కోట్లను పెట్టుబడిగా పెట్టి రూ.105 కోట్లను వెనక్కి తీసుకున్నారు. రూ.49 కోట్లను లాభాలుగా పొందారు. దుబాయిలో ఉన్న కబానా, మల్టీ బ్యాంకింగ్ ఫారెక్స్‌లో రూ.13.5 కోట్లను పెట్టుబడి పెట్టి రూ.27.5 కోట్లను వెనక్కి తీసున్నాడు. తద్వారా రూ.14 కోట్లు లాభాలను పొందాడు. కార్యాలయ ఖర్చులకు రూ.8 కోట్లు, వ్యక్తిగత ఖర్చులుగా రూ.12.5 కోట్లు ఖర్చు చేశాడు. మరో రూ.39.5 కోట్లను ఆదిత్య తన వద్ద భద్రపరుచుకున్నాడు. 92 మంది ఖాతాదారులు రూ.9.47 కోట్లను పెట్టుబడి పెట్టారు. వారు అసలు గానీ, లాభాలు గానీ పొందలేదు. పెట్టుబడుల ద్వారా ఆదిత్య 52 ఆస్తులను కొనుగోలు చేశాడు. వాటి మార్కెట్ విలువ రూ.100 కోట్లు ఉంటుందని పోలీసు కమిషనర్ తెలిపారు. ఆదిత్య, అతని భార్య సుజాత నుంచి 580 గ్రాముల బంగారం, 8.03 కిలోల వెండిని, రూ.23 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అద్విక పేరుతో ఉన్న 17 బ్యాంకు ఖాతాల్లో రూ.32 లక్షలు, కబానా, మల్టీబ్యాంక్‌కు చెందిన 69 ఖాతాల్లో రూ.50 లక్షలు, మూడు ట్రేడింగ్ ఖాతాల్లో రూ.53 లక్షలు, 200 ఏజెంట్ల ఖాతాల్లో రూ.1.02 కోట్లు ఉన్నట్టు గుర్తించారు. వాటిని పోలీసులు స్తంభింపజేశారు. మరో రూ.39.50 కోట్లు లెక్కలు తేలాల్సి ఉంది. టాటా సఫారి కారు, ల్యాప్ టాప్‌లు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నారు.

పత్తి రైతు కుదేలు!

» చెట్లపైనే దూదిలో విత్తనాలకు మొలకలు

» నల్లబారి పూర్తిగా విచ్చుకోని కాయలు

» ఎడతెరిపిలేని వర్షాలకు సాగని పత్తి తీతలు

» వేధిస్తున్న కూలీల కొరత

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

మొంథా తుపాను ప్రభావంతో పత్తి రైతు మరింత చిత్తయ్యాడు. ముసురుకున్న వాతావరణం ఎడతెరిపిలేని వర్షంతో విచ్చుకున్న పత్తికాయల విత్తనాల నుంచి మొలకలు వచ్చాయి. వర్షాలకు పాడైన పత్తిచేలతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రోజుకు వెయ్యి రూపాయిలకు పైగా సంపాదించే మహిళా కూలీలు పనిలేక ఇళ్లకే పరిమితమయ్యారు. పత్తిపంటపై ఆధారపడి జీవించే అనేక మంది జీవనోపాధిని అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. ముమ్మరంగా పత్తి తీతలు సాగే సమయంలో ఏంచేయాలో తోచక తుఫాన్ హెచ్చరికలు గురించి చర్చించుకుంటూ ఖాళీగా ఉండాల్సిన దయనీయ పరిస్థితులు దాపురించాయి. కొందరు ధైర్యం చేసి చేలల్లోకి వెళుతుంటే మరికొందరు పాడైనచేలవైపే కన్నెత్తిచూడటం మానేశారు.



వర్షాలకు నాని చెట్లపైనే దూదిలో మొలకెత్తిన గింజలు

చెట్ల మీదే మొలకలు

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది పత్తి పంటను వర్షాలు నాశనం చేశాయి. పిక్కింగ్‌కు వచ్చిన పత్తి తీయకపోవడంతో వర్షాలకు నాని దూదిలో ఉన్న పత్తి గింజలు మొలకలు వస్తున్నాయి. ఇప్పటికే 20 శాతం పైగా చెట్లకు దూదిలో గింజలు మొలకలు వచ్చాయి. మరో రెండు మూడు రోజులు ఇలానే వర్షాలు పడుతూ ఉంటే సగానికి పైగా దూదిలోని గింజలు మొలకలు వస్తాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. లోతట్టు, పల్లపు ప్రాంతాల్లో ఉన్న పొలాలు ఇప్పటికే రంగు మారిపోయాయని, చెట్లు కూడా చచ్చిపోతున్నాయని, గుబురుగా ఉన్న చేలల్లో గాలిఆడక కాయలు పూర్తిగా నల్లబారిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. చెట్లకు ఉన్న దూదిలోని గింజలు మొలకలు రావడంతో బరువుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. క్వింటా పత్తిలో గింజలు 60 కిలోలు బరువు ఉంటే 40 కేజీలు దూది బరువు ఉంటుంది. ఇప్పుడు గింజలు మొలకలు రావడంతో బరువు పూర్తిగా తగ్గిపోతుందని కాటావేసినా బరువు రాదని రైతులు చెబుతున్నారు.

ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి పెట్టాం



- బజిల్లా (కౌలురైతు జి.కొండూరు)

ఎకరానికి రూ.50 వేలవరకు పెట్టుబడి పెట్టాం.కౌళ్ల ముందే కట్టాం. పంట బాగుంది అనుకునే సమయంలో వర్షాలు మొదలయ్యాయి. అక్టోబరులో కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. పెట్టుబడిలో సగం దక్కినా దక్కినట్లే అనుకున్నాం. ఇప్పుడు తుఫాన్‌తో సగం పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదు. వర్షాలు వదలడం లేదు. ఇప్పటికే చెట్ల మీద ఉన్న దూదిలోకి గింజలు మొకలు ఇచ్చేశాయి. ఉన్న కాయలు నిలువునా కుళ్లిపోతున్నాయి.

కమ్యూనికేషన్స్ అలర్ట్!

(5వ పేజీ తరువాయి)

ముఖ్యం. పవర్ బ్యాకప్ లేకపోతే అవి పనిచేయవు. సిగ్నల్స్‌ను వ్యాప్తి చేయలేవు. అప్పుడు ఫోన్లకు సిగ్నల్స్ ఆగిపోతాయి. పవర్ బ్యాకప్‌ను 72 - 96 గంటల వరకు ఉండేలా యూపీఎస్‌లను, డీజిల్ జనరేటర్లను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ఆయా టెలికాం కంపెనీ హెడ్‌లతో చర్చించాల్సిన అవసరం ఉంది. అతి భారీ వర్షాలు కురిస్తే ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో జలనిరోధక కేబుల్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసే అంశాలపైనా దృష్టి సారించడం అవసరం. ఒకవేళ ప్రధాన టెలికాం నెట్‌వర్క్ దెబ్బతింటే మొబైల్ నెట్‌వర్క్‌ను త్వరిత గతిన ఏర్పాటు చేసే చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇంటర్నెట్ చాలా అవసరం. ఇంటర్నెట్ సేవలకు విఘాతం వాటిల్లితే ప్రస్తుతం జరిగే నష్టం అంతా, ఇంతా కాదు. ఇలాంటపుడు ఇన్‌బిల్ట్ శాటిలైట్ ఇంటర్నెట్ బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. అధికార యంత్రాంగాలు అత్యవసర కమ్యూనికేషన్ కోసం వాకీటాకీలు, శాటిలైట్ ఫోన్స్ వంటివి తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచుకోవాలి.

తెగిపడిన విద్యుత్ తీగ: సరిచేసిన సిబ్బంది



రామలింగేశ్వరనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా మంగళవారం ఉదయం నుంచి ఈదురు గాలులు వీస్తుండటంతో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకడంతో పటమట అంబేడ్కర్ నగర్ రావిచెట్టు సెంటర్ సమీపంలో విద్యుత్ తీగ తెగి పడింది. స్థానికుడు ఒకరు అప్రమత్తమై ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకుండా విద్యుత్ తీగను కర్రతో పక్కకు నెట్టాడు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు సిబ్బందిని పంపించి విద్యుత్ తీగలకు అడ్డుగా వున్న చెట్లు కొమ్మను తొలగించి, తెగిన విద్యుత్ తీగను సరిచేశారు.

బీఎస్‌ఆర్‌కే పాఠశాల పునరావాస కేంద్రంలో ఏర్పాట్లు



బీఎస్‌ఆర్‌కే పాఠశాలలో విధుల్లో మెడికల్ సిబ్బంది, పక్కన కార్పొరేటర్ ఉషారాణి

మొగల్రాజపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా కొండ ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజల భద్రత నిమిత్తం పలు ప్రాంతాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. బోయపాటి శివరామకృష్ణయ్య (బీఎస్‌ఆర్‌కే)పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో అన్ని వసతులు కల్పించారు. ఈ కేంద్రంలో 50 పడకలను, వైద్య సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచారు. గత వారం రోజులుగా మొగల్రాజపుం ఏడో డివిజన్‌లో రెండు చోట్ల కొండచరియలు, ఒక చోట ఇంటి గోడ కూలిన ఘటనలు జరిగాయి. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ, నగర కమిషనర్ ధ్యానచంద్ర ఈ ప్రాంతంలో పర్యటించి పరిస్థితిని అంచనా వేసి ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలను గుర్తించి నివాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

సీపీఎం కార్యాలయాల్లో...

మొగల్రాజపురం సున్నబట్టీల సెంటర్, క్రీస్తురాజపురం తదితర ప్రాంతాలలో ఉన్న సీపీఎం కార్యాలయాలలో ఏర్పాటు చేసిన పునరావాస, సహాయ శిబిరాలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో కలిసి శుక్రవారం కొండ చరియలు పడ్డ ప్రాంతాన్ని , పలు చోట్ల మెట్లమార్గాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండ రాళ్లు కింద పడకుండా రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జమ్మిచెట్టు సెంటర్ బీఎస్‌ఆర్‌కే పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి అధికారులు చేసిన ఏర్పాట్లను అడిగారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తూర్పు నగర కార్యదర్శి పి. కృష్ణ, నగర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.క్రాంతికుమార్, రాష్ట్రకమిటీ సభ్యులు జి.రామన్న, నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాబూరావు







పునరావాస కేంద్రాల్లో అగ్నిమాపక చర్యలు తీసుకుంటున్న అధికారులు, సిబ్బంది, డ్రెయిన్లలో పూడికతీత పనులు , పునరావాస కేంద్రంలో సదుపాయాలు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

అమ్మో.. మొంథా

- తుఫాను ఎదుర్కొనేందుకు పటిష్ట చర్యలు
- పునరావాస కేంద్రాలకు 146 మంది తరలింపు
- కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24గంటలు సమాచారం :కమిషనర్

కార్పొరేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ముంచుకొస్తున్న మొంథా తుపానును ఎదుర్కొనేందుకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఈదరు గాలులతోపాటు భారీవర్షాలు పడే అవకాశం ఉందన్న హెచ్చరికలతో వీఎంసీలో కమాండ్ కంట్రోల్ 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా మూడు షిఫ్టుల్లో అధికారులను, సిబ్బందిని ఏర్పాటు చేసింది. మూడు సర్కిల్స్‌లో ఏర్పాటు చేసిన 41 పునరావాస కేంద్రాలకు సుమారు 146మంది తరలించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాట్లు చేశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సుమారు 129 మంది సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. వర్షం నీరు రోడ్లపై నిల్వకుండా మూడు సర్కిల్స్‌లో 25 డివిజన్‌లలో 39బృందాలు, మూడు షిఫ్టుల్లో 117 మంది మాన్‌సూన్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. సర్కిల్-1 పరిధిలోని మూడు డివిజన్లలో 5 పాయింట్లు, షిఫ్ట్‌కు 5గురు చొప్పున ఏర్పాటు చేశారు. సర్కిల్-2లోని 13డివిజన్లలో 19బృందాలను ఏర్పాటు చేశారు. షిఫ్ట్‌కు 19 మంది చొప్పున 57 మందిని, సర్కిల్-3లో 9డివిజన్‌లు 15 బృందాలు, 45 మంది సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన డ్రెయిన్లతోపాటు అనుసంధానంగా డ్రెయిన్లలో మురుగుతోపాటు వర్షంనీరు పారుదలకు ఆటంకం కలగకుండా పర్యవేక్షిస్తున్నారు. మూడు షిఫ్టుల్లో186 మంది శానిటరీ సిబ్బంది ఏర్పాటు చేశారు. మూడు సర్కిల్స్‌లో 31 డివిజన్‌లలో సుమారు 41 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

లోతట్టు, కొండప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు

లోతట్టు, కొండ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారిని ఆటోల ద్వారా సురక్షితమైన ప్రదేశాలకు తరలించేందుకు అవగాహన కల్పిస్తున్నారు. నగర పరిధిలో ప్రమాదకరంగా ఉన్న 60 వృక్షాలను, హోర్డింగ్లను తొలగించారు. పాత భవనాల్లో నివసిస్తున్న 102 కుటుంబాలకు సురక్షితమైన ప్రదేశాలకు తరలించారు.

పారిశుధ్య నిర్వహణ

నగర పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సోమవారం రాత్రి కంపాక్టర్ బిన్లు అన్నింటిని శుభ్రం చేశారు. పాయింట్లలో వ్యర్థాలను తొలగించేందుకు అదనంగా వంద మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాల వద్ద ఫాగింగ్ చర్యలు తీసుకుంటున్నారు.

పూడికతీత పనులు

డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు. 20ఎక్స్‌కవేటర్లు, 9 లాంగ్ ఆర్మ్‌తో పూడికతీత పనులు చేపట్టారు. నీటి నిల్వలు ఉన్నచోట 13పంపు సెట్లు, 78ఆయిల్ ఇంజిన్ మోటార్లు, 28 గుల్పేర్‌లు, 29 ట్రాక్టర్ల సహాయంతో పూడికతీత పనులు చేపట్టి సిల్ట్ తొలగిస్తున్నారు. నగరంలోని 41 ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాలను మార్చారు. పునరావాస కేంద్రాల్లో తీసుకోవాల్సిన సురక్షితమైన అగ్నిమాపక చర్యలను, వీఎంసీ ఫైర్ వింగ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

మొగల్రాజపురంలో తాగునీటి కొరత

పైపులైన్ల లీక్‌లు...పట్టించుకోని అధికారులు

మొగల్రాజపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏడో డివిజన్‌లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. డివిజన్ లో తాగునీటి పైపులైన్ల లీకేజీలు ఉన్నాయి. బోయపాటి మాధవరావు రోడ్డులో తాగునీటి పైపుల లీకేజీలపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని సానికులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 10న సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఒక వేళ తాగునీరు వదిలినా తెల్లవారు జామున 5 గంటలకు, రాత్రి 11.30 సమయంలో వదులుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం బోయపాటి మాధవరావు రోడ్డులో లీకేజీ ఏరియాలో పదిరోజులుగా మంచినీరు రావడం లేదు.



బోయపాటి మాధవరావు రోడ్డులో లీక్ అయిన తాగునీటి పైపు

అసలే వర్షాకాలం.. లీకేజీలతో ప్రమాదం

గత ఏడాది ఈ ప్రాంతంలో డయేరియా ప్రబలి నలుగురు మరణించారు. మళ్లీ ఇదే ప్రమాదం ఈ ప్రాంతంలో పొంచి ఉంది. అధికారులు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి తాగు నీరు ఇప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

కొండ ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండండి : గద్దె క్రాంతి

మాచవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం తీవ్రమవుతున్న నేపథ్యంలో నగరంలోని 5, 6 డివిజన్లలోని కొండ ప్రాంతవాసులను టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ అప్రమత్తం చేశారు. అమ్మ కల్యాణ మండపం, బీఆర్ నగర్ ప్రాంతాల్లో క్రాంతికుమార్ మంగళవారం పర్యటించారు. కొండ రాళ్లు జారిపడే అవకాశం ఉందని, ఇళ్లను తాత్కాలికంగా ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. అత్యవసరం అయితేనే ఇంటి నుంచి బయటకు వెళ్లాలని తెలిపారు. స్థానికుల కోరిక మేరకు అధికారులతో మాట్లాడి అమ్మ కల్యాణ మండపం దగ్గరలో పునరావాలస కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయించారు. ఈ పర్యటనలో టీడీపీ నాయకులు పడాల గంగాధర్, మొకర గురునాధం, బచ్చులగురి అజయ్, షేక్ షరీఫ్, వడ్డీ సుబ్బారావు, పి.నాగు, ఆర్ బ్రహ్మేశ్వరరావు, కట్టేవరపు కిషోర్, పి.రంగా పాల్గొన్నారు.



5,6 డివిజన్లలోని కొండ ప్రాంత వాసులతో మాట్లాడుతున్న గద్దె క్రాంతికుమార్



కరెన్సీనగర్‌లో మూసిన దుకాణాలు

తుఫాను ముందస్తు చర్యలు

భారతీనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉండడంతో మంగళవారం తూర్పులోని లోతట్టు ప్రాంతాలైన కరెన్సీనగర్, ఏపీఐఐసీ కాలనీ,ఎన్ఏసీ కల్యాణ మండపం సమీపంలో హైటెన్షన్ రోడ్డు, పంటకాలువ రోడ్డులోని పీఅండ్‌టీ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లో వాననీరు మళ్లించడానికి నీటిని తోడే ఇంజన్లు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పాలు, మందులు, వంటి అత్యవసర దుకాణాలు తప్ప మిగిలిన దుకాణాలను అధికారులు మూయించారు. ప్రజల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

డ్రెయినేజీల్లో పూడికతీత పనులు

ఆటోనగర్: మొంథా తుపాను నేపథ్యంలో జవహర ఆటోనగర్‌లో డ్రెయిన్లలో పూడికతీతకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఐలా ఆధ్వర్యంలో ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులో యంత్రం సహాయంతో డ్రెయినేజీలో పూడిక తీస్తున్నారు. మెయిన్ డ్రెయిన్‌లో పూడిక తీస్తే మురుగునీటితోపాటు అంతర్గత రోడ్లలోని వర్షపునీరు కూడా వెలుపలకు వెళుతుందని అధికారులు తెలిపారు.

రామలింగేశ్వరనగర్: మొంథా తుపాను కారణంగా డ్రెయిన్లు పొంగి మునిగే అవకాశం ఉందని, ప్రజలకు ఎటువంటి ప్రమాదం ఇబ్బంది కలగకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా 14వ డివిజన్ పటమట పూజితా అపార్టుమెంటు సర్కిల్ సమీపంలో ఓపెన్ డ్రెయిన్లు, మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేశారు. ఓపెన్ డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు. మ్యాన్‌హోల్స్‌లో మురుగు నీటిని విద్యుత్ మోటార్ల సాయంతో తోడి సైడ్ కాల్వలోకి వదిలారు.

పిన్నమనేని రోడ్డులో

మొగల్రాజపురం: తుపాను దెబ్బకు పిన్నమనేని రోడ్డులో పిటింగేల్ పేట పరిసరాలలో సైడు కాల్వల్లో సిల్టును వీఎంసీ అధికారులు జేసీబీలతో తీయించి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. మంగళవారం రాత్రి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో పిన్నమనేని రోడ్డు, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, జమ్మిచెట్టు ఏరియా వర్షం దెబ్బకు ముంపునకు గురవకుండా అధికారులు సైడు కాల్వలలో పూడిక తీత పనులు చేపట్టారు.



ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులో, పటమట పూజిత అపార్టుమెంటు సర్కిల్ సమీపంలో పూడిక తీత పనులు, ఎన్ఏసీ కళ్యాణ మండపం రోడ్డులో వాననీటిని బయటకు తోడుతున్న సిబ్బంది



తారకరామనగర్ కట్టపై మైక్ ప్రచారం చేస్తున్న వేముల దుర్గారావు తదితరులు

పునరావాస కేంద్రాలకు వెళ్లాలని మైక్ ప్రచారం

కృష్ణలంక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని, భీకర గాలులు వీస్తాయని అధికారులు చెబుతుండటంతో మంగళవారం 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు, ఇతర నాయకులు తారకరామనగర్ లోతట్టు ప్రాంతాల్లో మైక్ ప్రచారం చేశారు. పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సిందిగా ప్రచారం నిర్వహించారు. 17,18 డివిజన్ల ఇన్‌చార్జి తలపాటి ప్రసాద్, పగడాల వెంకటేశ్వరరెడ్డి, మర్రి వెంకట సుబ్బయ్య, 18వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులు కొట్టి చంపిన కొండచిలువలు

శ్మశానం గేటు వద్ద కొండ చిలువలు

కొట్టి చంపేసిన స్థానికులు

రామలింగేశ్వరనగర్ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక 14వ డివిజన్ పటమట అంబేడ్కర్‌నగర్ కాలువగట్టు ప్రాంతం శ్మశానవాటిక గేటు సమీపంలో ఐదు, ఆరు అడుగుల పొడవున్న రెండు కొండచిలువలు మంగళవారం రాత్రి స్థానికుల కంటపడ్డాయి. వారు వాటిని కొట్టి చంపడంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పటమట అంబేద్కర్ నగర్, సత్యనారాయణ నగర్, పటమట లంక నుంచి చిన్నవంతెన సెంటర్ కు వెళ్లే ప్రయాణికులు కొండ చిలువలను చూసి ఉలిక్కి పడ్డారు. గత రెండు రోజుల క్రితం సమాధులులో ఏపుగా పెరిగిన చెట్లు నరికి శుభ్రపరచడం వలన అవి బయటకు వచ్చి సంచరిస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు.

ఇంద్రకీలాద్రిపైకి రాకపోకలు నిలిపివేత



ఇంద్రకీలాద్రి: మొంథా తుపాను నేపథ్యంలో ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత నిమిత్తం ముందస్తుగా వాహనాల రాకపోకలు నిలిపివేస్తూ మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి దుర్గగుడి ఘాట్ రోడ్డు మూసివేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. కొండ దిగువన ఉన్న కనకదుర్గానగర్, చైనా వాల్ దిగువన, వీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కింగ్‌లో వాహనాలు నిలుపుదల చేయాలని అధికారులు తెలిపారు. తఫాను ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై దేవస్థానం పూర్తిగా అప్రమత్తంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

దుర్గగుడిలో సహస్ర లింగార్చన



ఇంద్రకీలాద్రి: దుర్గగుడిలో కార్తీకమాసం సందర్భంగా మంగళవారం రాత్రి సహస్ర లింగార్చన సేవ, సహస్ర దీపార్చన, ఊంజల్ సేవలు జరిగాయి. అర్చకులు నమక, చమక పారాయణలతో బిల్వ పత్రాలు, వివిధ రకాల పుష్పాలను సమర్పించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులతో ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు శ్రీమల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణం వద్ద దీపోత్సవం (ఆర్జిత సేవ) నిర్వహిస్తున్నారు.



వంశీమోహన్ గాత్ర కచేరీ

మాధుర్యంగా సంగీత సమ్మేళనం

విజయవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వరఝరి సంస్థ ఆధ్వర్యంలో మోదుమూడి సుధాకర్ శిష్యబృందం నిర్వహిస్తున్న 'గురు-శిష్య సంగీత ఆత్మీయ సమ్మేళనం' రెండో రోజు మంగళవారం వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో మాధుర్యంగా సాగింది. ఎనిమిది మంది గాయకులు శాస్త్రీయ కీర్తనలను శ్రావ్యంగా, భక్తినిండిన హృదయంతో గానం చేశారు. శివలెంక విశ్వనాథ్ 'దొరకునా ఇటువంటి సేవ' (బిలహరి, త్యాగరాజు) పాడగా, ఆర్.రాజేశ్వరి-వరలక్ష్మి గాత్ర యుగళం 'కౌమరీ గౌరీ వేళావళి' (గౌరీ వేళావళి, దీక్షితార్)లో సాగి అలరించింది. వలివేటి నీరజ 'కనక శైల విహారిణి' (పున్నా గవరాళి, శ్యామశాస్త్రి) పాడి వినిపించారు. ఏఎస్‌పీ రమాదేవి 'అనురాగములేని' (సరస్వతి, త్యాగరాజు) గానం చేయగా బీవీఎస్ శ్రీకృష్ణ 'ఒకమాట ఒక బాణము' (హరికాంభోజి, త్యాగరాజు) పాడారు. లంక తేజస్వీ 'విధులకు మ్రొక్కెద' (మాయామాళవగౌళ, త్యాగరాజు) సమ్మోహనం చేశారు. యూవీ మోహనవంశీ 'కరుణింపవేనను' (రాగమాలిక) కృతి రాగయుక్తంగా పాడారు. సీవీవీ శాస్త్రి తన కీర్తనతో కచేరీని ముగించారు. శ్రోతలు మధుర గానాలను చక్కగా ఆస్వాదించారు. కార్యక్రమం సంగీత పారంపర్యాన్ని సరళంగా ప్రదర్శించి, గురు-శిష్య సంబంధాన్ని గౌరవించింది.

మరో 37 రైలు సర్వీసులు రద్దు

విజయవాడ సిటీ/అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను నేపథ్యంలో బుధవారం నడిచే 37 రైలు సర్వీసులను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 24 రైలు సర్వీసులను ఆపినట్లు అధికారులు తెలిపారు. విశాఖపట్నం-హైదరాబాద్ (12727), విశాఖపట్నం-సికింద్రాబాద్(22203), విశాఖపట్నం-నాందేడ్ (20811), విశాఖపట్నం-సికింద్రాబాద్(12739), విశాఖపట్నం-న్యూఢిల్లీ (20805), విశాఖపట్నం-మచిలీపట్నం (17220), విశాఖపట్నం-ఎల్‌టీటీ ముంబై(18519), ముంబై ఎల్‌టీటీ-విశాఖపట్నం(18520), విశాఖపట్నం-మహబూబ్‌నగర్(12861), ముంబై సీఎంఎస్‌టీ-భువనేశ్వర్‌న్యూ (11019), రాయగడ-గుంటూరు(17244), భువనేశ్వర్ న్యూ-సీఎస్ఎంటీ ముంబై (11020), లింగంపల్లి-కాకినాడపోర్ట్ (12738), కాకినాడ టౌన్-ఎస్ఎంబీటీ బెంగుళూరు(17210), అనకాపల్లి-సికింద్రాబాద్(07060), నర్సాపూర్-ధర్మవరం(17247), నర్సాపూర్-లింగంపల్లి(17255), కాకినాడటౌన్-లింగంపల్లి(12737), కాకినాడ టౌన్-లింగంపల్లి(12755), ధర్మవరం-నర్సాపూర్ (17248), లింగంపల్లి- నర్సాపూర్(17256), లింగంపల్లి-కాకినాడటౌన్(12776), మచిలీపట్నం-ధర్మవరం(17215), ధర్మవరం-మచిలీపట్నం(17216) రద్దయ్యాయి.

దారి మళ్లించిన సర్వీసులు

హౌరా-సికింద్రాబాద్(ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ 12703)ను విజయనగరం, టిట్లఘర్, రాయ్‌హపూర్, బెల్లంపల్లి, కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు దారి మళ్లించారు. అదేవిధంగా హౌరా-ఎస్ఎంవీటీ బెంగళూరు రైలును విజయనగరం, లఖోలి, రాయ్‌పూర్, నాగ్‌పూర్, బల్లార్షా, విజయవాడ మీదుగా దారి మళ్లించారు. షాలిమార్-చర్లపల్లి(18045), షాలిమార్-చెన్నై ఎగ్మోర్ (22825), హౌరా-ఎస్ఎంవీటీ బెంగళూరు(22887), హౌరా-చెన్నై సెంట్రల్ (12841), సంత్రగంచి-చెన్నై సెంట్రల్ (22807), షాలిమార్-విశాఖపట్నం (22853) రైళ్లు 12 గంటలు ఆసల్యంగా నడుస్తాయని, బిలాస్‌పూర్-తిరుపతి(17841), ధన్‌బాద్-అలప్పూజ (13351) ఏడు గంటలు ఆలస్యంగా నడుస్తాయన్నారు.

14 ఏవో, 28 మంది డిప్యూటీ ఎంపీడీవోలకు పదోన్నతులు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. 14 మంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, 28 మంది డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, డిప్యూటీ ఎంపీడీఓలకు పదోన్నతులు దక్కాయి. రాయలసీమ ప్రాంతంలో ఖాళీలు లేకపోవడంతో పలువురిని కృష్ణా, ఏలూరు, గోదావరి జిల్లాల్లో పదోన్నతులపై బదిలీ చేశారు. తదుపరి డిప్యూటీ ఎంపీడీవో, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల ఖాళీలను పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1 ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి భర్తీ చేస్తారు.

ఎంఎస్ఈలకు రూ.10 కోట్ల అదనపు నిధులు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ (సీజీఎస్-ఎంఎస్ఈ) పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి కార్పస్ ఫండ్ చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు అదనపు నిధులు మంజూరు చేసింది. పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు.



చల్లపల్లి - బందరు రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న ఎస్సై సుబ్రహ్మణ్యం, సిబ్బంది, కృత్తివెన్ను మండలం కొమాళ్లపూడిలో తీగలపై పడిన చెట్టు, మాట్లంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్, పోడు గ్రామంలో రహదారిపై నీరు

భీతిల్లిన తీర ప్రజలు

●కూలిన చెట్లు, విద్యుత్‌స్తంభాలు ● అంధకారంలో గ్రామాలు ● మునిగిన రహదారులు● అవిశ్రాంతంగా శ్రమిస్తున్న విద్యుత్, రెవెన్యూ సిబ్బంది

కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నానికి 70 కిలో మీటర్ల దూరంలో మంగళవారం సాయంత్రం కేంద్రీకృతమైన తుఫాన్ ప్రభావంతో బలమైన గాలులు వీయడంతో తీరప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గాలులకు దివిసీమలోని గ్రామాల్లోనూ, చల్లపల్లి, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో చెట్లు కూలి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దివిసీమ పూర్తిగా అంధకారంలో ఉంది. విద్యుత్ ఉన్నతాధికారులు, సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు నిరంతరం శ్రమిస్తున్నారు.

కృత్తివెన్ను, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో తీరప్రాంతం గజగజలాడింది. తేలికపాటి వర్షాలు కురుస్తున్నప్పటికీ భీకరమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. పెద్ద చెట్లు, విద్యుత్ స్థంబాలతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగి పడిపోయాయి. విద్యుత్ తీగలపై చెట్లు పడటంతో తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ లక్ష్మీరాజేష్ తన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు, మరమ్మతులకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మండలంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు, తీరప్రాంత గ్రామాల్లో రహదారులన్నీ జలమయమయ్యాయి. లక్ష్మీపురం - పోడు ప్రధాన రహదారి లక్ష్మీపురం గ్రామం వద్ద, పోడు గ్రామ సమీపంలో పూర్తిగా నీటమునిగింది. ఈ రహదారిపై పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. పోడు హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఇంతేరు - పార్వతీపురం రహదారి పూర్తిగా కోతకు గురికావటంతో పోలీసు అధికారులు రహదారికి అత్యవసర మరమ్మతులు చేయించారు. పీతలావ గ్రామంలో చెట్టు రోడ్డుపై విరిగి పడింది. ఎక్స్‌కవేటర్‌తో పోలీసులు చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. మండలంలో విద్యుత్ సరఫరాతో పాటు, మొబైల్ సిగ్నల్స్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లైన్లకు తక్షణం మరమ్మతులు చేస్తూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు విద్యుత్ అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. వాలంక గ్రామంలో కొబ్బరి చెట్టు విరిగిపడటంతో కృత్తివెన్ను గ్రామానికి చెందిన కోయి సుబ్బారావు కాలుకు తీవ్ర గాయమైంది. వైద్యం నిమిత్తం మచిలీపట్నం తరలించారు. పెదగొల్లపాలెం బీచ్‌లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం 200 మీటర్ల మేర ముందుకు చొచ్చుకువచ్చింది.

దివిలో ఆరు మండలాలు అతలాకుతలం

అవనిగడ్డ : మొంథా తుపాను ప్రభావంలో అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాగాయలంక, అవనిగడ్డ ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటంతో మంగళవారం ఉదయం కొద్దిసేపు విద్యుత్ సరఫరాను ఆపి ట్రాన్స్‌పార్మర్‌లపై పడిన చెట్లను తొలగించారు. విద్యుత్ సరఫరా లేకపోవటంతో ఆరు మండలాల్లో అంధకారం అలుముకుంది. సాయంత్రం వరకూ ప్రశాంతంగా ఉన్న వాతావరణంగా, ఒక్కసారిగా మారి గాలుల తీవ్రత పెరిగింది. వర్షం తోడుకావటం, విద్యుత్ సరఫరా లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కోడూరు : మండలంలో గాలులకు చెట్లు విరిగి పడ్డాయి. కోడూరు - రామకృష్ణాపురం రహదారిపై, కోడూరు శివారు స్వతంత్రపురం గ్రామంలో విద్యుత్ వైర్లపై చెట్లు విరిగి పడ్డాయి. దీంతో మండలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వెంటనే రోడ్లపై పడిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. నాగాయలంక : నాగాయలంక బస్టాండ్‌లో చెట్టు గాలికి విరిగి విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌పై పడగా, ట్రాన్స్‌పార్మర్ ధ్వంసం అయింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈ జి.వెంకటరాజు తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. చల్లపల్లి : చల్లపల్లి - మచిలీపట్నం ప్రధాన రహదారిపై పలు చోట్ల ఐదు భారీ వృక్షాలు పడిపోయాయి. కోమలా నగర్‌లో ప్రధాన రహదారిపై మరో చెట్టు రోడ్డుకు అడ్డుగా పడింది. సమాచారం అందుకున్న చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం తక్షణం స్పందించి పంచాయతీ, విద్యుత్ సిబ్బంది సహకారంతో, ప్రజలతో కలిసి చెట్ల తొలగింపు పనులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

ప్రాణనష్టం జరగకుండా చూడాలి : ఎస్పీ

కోడూరు : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ నష్టం జరుగకుండా జాగ్రత్త వహించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. తుపాను నేపథ్యంలో స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. 200 కేంద్రాలు ఏర్పాటు చేసి, అన్ని చోట్లా బందోబస్తు ఉంచామని తెలిపారు. బాధితుల ఇళ్ల వద్ద దొంగతనాలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.



ఎమ్మెల్యే కాగిత పునరావాస కేంద్రాల సందర్శన

బంటుమిల్లి : బలమైన గాలుల వల్ల అర్తమూరులో చింతచెట్టు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మేము అండగా ఉంటాం..ప్రజలు ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ భరోసా ఇచ్చారు. మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కృష్ణప్రసాద్ మంగళవారం పరిశీలించారు. సౌకర్యాలు, సహాయ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశిబిరాలను పరిశీలించారు. అత్యవసర వైద్య సదుపాయాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.



సుందరయ్యనగర్‌లో పర్యటిస్తున్న మంత్రి రవీంద్ర

నష్టం జరగనీయం : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : మొంథా తుపాను వల్ల ప్రాణ నష్టం, పశునష్టం జరగకుండా అన్ని విధాల ముందస్తు చర్యలు తీసుకున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలతో కలిసి మంత్రి రవీంద్ర మంగళవారం మచిలీపట్నం నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ముంపునకు గురైన సుందరయ్య నగర్, సుల్తానగరం, నారాయణపురం ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు వీధుల్లో మోటార్ల సాయంతో నీటిని తొలగించే పనులు చేపట్టడంతో అధికారులను అభినందించారు. నారాయణపురంలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కరగ్రహారం, క్యాంపుబెల్‌పేటలోని పునరావాస కేంద్రాలను మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సందర్శించారు. క్యాంపుబెల్‌పేటలోని పునరావాస కేంద్రంలో ఆహారం వండి అందించాలని ఆర్డీవో కె. స్వాతి, తహసీల్దార్ నాగభూషణంలకు మంత్రి సూచించారు. కలెక్టర్ బాలాజీ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. శివగంగ డ్రెయిన్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మంత్రి వెంట మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, తహసీల్దార్లు మధుసూదనరావు, నాగభూషణం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, నగర జనసేన అధ్యక్షుడు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ఆరుగురు కన్సల్టెంట్లు

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ అర్బన్-2.0 అమలుకు రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ సర్వీసెస్ ఇన్‌క్లూజివ్(ఎన్ఐసీఎస్ఐ) ఎంప్యానెల్ చేసిన ఏజెన్సీ ద్వారా ఆరుగురు కన్సల్టెంట్లను నియమించుకునేందుకు మున్సిపల్ శాఖ అనుమతించింది. వీరిని 12 నెలల పాటు నియమించుకోవడానికి అనుమతిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ ఆ మేరకు చర్యలు తీసుకోవాలని, వారికి వేతనాలు ఎన్ఐసీఎస్ఐ ఆమోదించిన రేట్ల ప్రకారం ఉండేలా చూడాలని సూచించింది. వారి వేతనాల కోసం చేసే వ్యయం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధుల నుంచి భరిస్తారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్




విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడ సాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. అమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి

దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పని చేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటి నిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.





చట్టమా? విశ్వాసమా?

యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ 'తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

స్పోర్ట్స్

విజయవాడ ● బుధవారం 29 అక్టోబరు 2025


లారా వొల్వార్ట్
బ్రంట్
మ. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఫైనల్ బెర్త్ ఎవరిదో?

- దక్షిణాఫ్రికాకు స్పిన్ గండం
- ఫేవరెట్ ఇంగ్లండ్
- నేడు తొలి సెమీస్
- మహిళల వన్డే వరల్డ్‌కప్

గువాహటి: వరుసగా రెండోఫైనల్‌పై ఇంగ్లండ్ గురిపెట్టగా.. దక్షిణాఫ్రికా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ తుది పోరుకు చేరి చరిత్ర సృష్టించాలనుకొంటోంది. ఈ క్రమంలో బుధవారం జరిగే తొలి సెమీఫైనల్లో నాలుగుసార్లు చాంపియన్ ఇంగ్లండ్‌తో దక్షిణాఫ్రికా తలపడనుంది. లీగ్ దశలో సఫారీలను చిత్తుగా ఓడించిన ఇంగ్లండ్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా కనిపిస్తోంది. అయితే, మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శనతో బదులు తీర్చుకోవాలని దక్షిణాఫ్రికా వ్యూహాలు రచిస్తోంది. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఘోరంగా తడబడుతున్న లారా వొల్వార్ట్ సేన ఆ బలహీనతకు చెక్ చెప్పాలనుకొంటోంది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. కానీ, ఆ తర్వాత ఒత్తిడిని అధిగమిస్తూనే ఐదు మ్యాచ్‌లు గెలిచి నాకౌట్ బెర్త్‌ను సొంతం చేసుకొంది. కానీ, ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో మరోసారి ఘోరంగా ఓడడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేదే. కెప్టెన్ లారా వొల్వార్ట్, తన్జిమ్ బ్రిట్స్, మరిజానె కాప్, డి క్లెర్క్ జట్టు బ్యాటింగ్‌కు ప్రధాన బలం. బౌలింగ్‌లో ట్లో ట్రయాన్, ఎమ్‌లాబా, క్లాస్, కాప్‌పై జట్టు ఆధారపడింది. మరోవైపు ఇంగ్లండ్ ఫుల్ జోష్‌లో ఉంది. అమీ జోన్స్, బ్యూమాంట్, హీథర్ నైట్ బ్యాట్‌తో అదరగొడుతున్నారు. సారథి సివర్ బ్రంట్ ఆల్‌రౌండ్ ప్రదర్శన జట్టుకు ప్లస్‌గా మారింది. వికెట్ స్పిన్‌కు సహకరించే అవకాశాలుండడంతో సోఫీ ఎకెల్‌స్టోన్, లిండ్సే స్మిత్, చార్లీ డీన్ నుంచి దక్షిణాఫ్రికా సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, గాయంతో బాధపడుతున్న ఎకెల్‌స్టోన్ ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రాలేదు. మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలు లేవు.

కోలుకుంటున్న శ్రేయాస్



సిడ్నీ: ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో తీవ్రంగా గాయపడిన శ్రేయాస్ అయ్యర్ వేగంగా కోలుకుంటున్నాడు. ప్రస్తుతం సిడ్నీలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న అతడికి చిన్నపాటి శస్త్రచికిత్స చేసినట్టు సమాచారం. మూడో వన్డేలో అలెక్స్ క్యారీ క్యాచ్ పట్టే క్రమంలో కిందపడిన అయ్యర్ పక్కటెముకలకు గాయమైంది. స్కానింగ్‌లో ప్లీహం రక్తస్రావానికి గురైందని తేలడంతో రెండురోజులు ఐసీయూలోనే ఉంచి, ఆ తర్వాత స్పెషల్ వార్డుకు మార్చారు. మంగళవారం తీసిన స్కానింగ్‌లో రక్తస్రావం ఆగినట్టు తేలిందని, అతను వేగంగా కోలుకుంటున్నట్టు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. డాక్టర్లు ఊహించినదాని కంటే అత్యంత వేగంగా అయ్యర్ కోలుకుంటున్నాడన్నారు. టీమ్ డాక్టర్ రిజ్వాన్ ఖాన్ శ్రేయాస్ వెంటే ఉండి పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. అటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ సైతం శ్రేయాస్ ఆరోగ్య పరిస్థితి ఆశాజనకంగా ఉందని, ఇప్పటికే పలుమార్లు అతడితో ఫోన్‌లో మాట్లాడానని చెప్పాడు. మరో వారంరోజుల విశ్రాంతి తర్వాత శ్రేయాస్‌ను డిశ్చార్జి చేసే అవకాశముందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

'పొట్టి' సిరీస్ లక్ష్యంగా..

- బరిలోకి టీమిండియా
- కెప్టెన్ సూర్య ఫామ్‌పై ఆందోళన
- పేసర్ బుమ్రా రాక
- ఆస్ట్రేలియాతో తొలి టీ20

మ.1.45 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో


ప్రాక్టీస్‌లో కోచ్ గంభీర్‌తో కెప్టెన్ సూర్య

కాన్‌బెర్రా: మూడు వన్డేల సిరీస్‌ను 1-2తో కోల్పోయిన టీమిండియా ఇక ధనాధన్ పోరుపై దృష్టి పెట్టింది. తాజా టీ20 జట్టులోకి యువ ఆటగాళ్ల చేరికతో పాటు ఆల్‌రౌండర్ల అండతో సూర్యకుమార్ సేనలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. దీనికి తోడు ఇటీవలే ఆసియాకప్ గెలిచిన జోష్‌లో ఉన్న వరల్డ్ నెంబర్‌వన్ టీమిండియా.. బుధవారం నుంచి ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టీ20ల సిరీస్‌ను శుభారంభం చేయాలనుకుంటోంది. అటు ఇరు జట్లు కూడా తమ ప్రత్యర్థులపై ఆడిన చివరి 10 టీ20ల్లో ఎనిమిది గెలిచి, ఒక ఓటమితో సమవుజ్జీగా ఉన్నాయి. వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు భారత్ 15 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అందుకే ఈ సిరీస్‌ను చక్కటి సన్నాహకంగా ఉపయోగించుకోవాలనుకుంటోంది. మరోవైపు ఇప్పటికే వన్డే సిరీస్‌ను గెలిచిన ఆసీస్ ఈ ధనాధన్ పోరులోనూ తమదే పైచేయి కావాలనుకుంటోంది.

సూర్య పుంజుకునేనా?: భారత జట్టులోని ఇతర బ్యాటర్లతో పోలిస్తే కెప్టెన్ సూర్య పేలవ ఫామ్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ ఆందోళనగా ఉంది. తన కెప్టెన్సీలో ఆడిన 29 మ్యాచ్‌ల్లో భారత్ 23 గెలిచినప్పటికీ బ్యాటర్‌గా మాత్రం అతడు విఫలమవుతున్నాడు. ఈ ఏడాది ఆడిన 10 ఇన్నింగ్స్‌లో సూర్య కేవలం 100 రన్స్ మాత్రమే చేయగలిగాడు. గిల్‌తో కెప్టెన్సీ విషయంలో పోటీ ఉండడంతో ఈ సిరీస్ ద్వారా బ్యాట్ ఝుళిపించి విమర్శకులకు సమాధానమివ్వాల్సిన అవసరం ఉంది. ఆసియాకప్‌లో అదరగొట్టిన ఓపెనర్ అభిషేక్ శర్మ ఎప్పటిలాగే మెరుపు ఇన్నింగ్స్‌తో శుభారంభం అందించాలనుకుంటున్నాడు. మరో ఓపెనర్ గిల్ వన్డే సిరీస్‌లో విఫలమై ఒత్తిడిలో ఉన్నాడు. సూర్య, తిలక్, శాంసన్‌లతో మిడిలార్డర్ బలంగా కనిపిస్తోంది. గాయం నుంచి కోలుకుంటున్న నితీశ్‌కుమార్ ఈ మ్యాచ్‌లో ఆడేది సందేహమే. అలాగే బుమ్రా రాకతో బౌలింగ్ విభాగం పటిష్ఠంగా మారింది. పేస్‌లో అర్ష్‌దీప్ అతడికి జత కానున్నాడు. ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే ఆలోచన ఉంటే కుల్దీప్, వరుణ్ చక్రవర్తి, అక్షర్‌పటేల్ ఆడేది ఖాయమే.

పటిష్ఠంగా ఆసీస్: గతేడాది టీ20 వరల్డ్‌కప్ ఓటమి తర్వాత ఆసీస్ టీ20 జట్టు అత్యంత పటిష్ఠంగా రూపొందింది. మిచెల్ మార్ష్ నేతృత్వంలో ఆడిన చివరి 20 మ్యాచ్‌ల్లో రెండు మాత్రమే ఓడడం వీరి దూకుడైన ఆటతీరుకు నిదర్శనం. ఓపెనర్లు హెడ్, మార్ష్ ఆరంభం నుంచే బౌలర్లపై విరుచుకుపడుతూ ఒత్తిడి తేగలరు. ఇక తాజాగా జట్టులోకి ఇన్‌గ్లిస్, స్టొయినిస్, డేవిడ్, మ్యాక్స్‌వెల్ లాంటి హిట్టర్లు చేరడం భారత్‌కు సవాల్‌గా మారనుంది. తొలి రెండుమ్యాచ్‌లు మాత్రమే ఆడే పేసర్ హాజెల్‌వుడ్ ఈసారి కూడా భారత్‌ను ఇబ్బందిపెట్టాలనుకుంటున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, శాంసన్, రింకూ సింగ్, అక్షర్, దూబే/హర్షిత్, కుల్దీప్/వరుణ్, అర్ష్‌దీప్, బుమ్రా.

ఆస్ట్రేలియా: మిచెల్ మార్ష్ (కెప్టెన్), హెడ్, ఇన్‌గ్లిస్, డేవిడ్, ఫిలిప్, ఓవెన్, స్టొయినిస్, ఎబాట్/బార్ట్‌లెట్, ఎలిస్, కునేమన్, హాజెల్‌వుడ్.

పిచ్, వాతావరణం

ఇక్కడి మనూకా ఓవల్ మైదానంలో బౌండరీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో స్వల్ప స్కోర్లే నమోదవుతుంటాయి. వికెట్ స్పిన్‌కు అనుకూలంగా ఉండనుంది. ఇక చల్లటి వాతావరణం ఉండి రోజులో చిరు జల్లులకు ఆస్కారం ఉన్నప్పటికీ మ్యాచ్‌కు ఎలాంటి ఆటంకం ఉండదు.


మిచెల్ మార్ష్

ప్రపంచ బాక్సింగ్ కప్ బరిలో నిఖత్

న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్ కప్‌లో పాల్గొనే భారత బృందాన్ని జాతీయ బాక్సింగ్ సమాఖ్య వెల్లడించింది. మహిళల 51 కిలోల విభాగంలో ప్రపంచ మాజీ చాంపియన్ నిఖత్ జరీన్ బరిలోకి దిగుతోంది. ఈ పోటీల గురించి నిఖత్ మాట్లాడుతూ వచ్చే ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో బరిలోకి దిగడానికి కావాల్సిన ర్యాంకింగ్ పాయింట్లకు ఈ ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ పోటీలు ముఖ్యమైనవని, ఇందులో ఎక్కువ పాయింట్లు సాధించి సీడింగ్‌ను మెరుగు పర్చుకోవాల్సి ఉందని తెలిపింది. నిఖత్‌తో పాటు మొత్తం ఇరవై మంది భారత బాక్సర్లు వివిధ విభాగాల్లో తలపడనున్నారు. ఈ పోటీలు వచ్చే నెల 14 నుంచి 21 వరకు గ్రేటర్ నోయిడాలో జరగనున్నాయి. మొత్తం 18 దేశాల నుంచి 140 మందికి పైగా బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

'ఆసియా అథ్లెటిక్స్' ఈవెంట్లకు భారత్ బిడ్‌లు!

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ లాంటి మెగా క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనుకొంటున్న భారత్ అందుకు సన్నాహకంగా పలు ఈవెంట్ల నిర్వహణకు ఆసక్తిని ప్రదర్శిస్తోంది. తాజాగా 2028 ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్, 2026 ఆసియా రిలే ఆతిథ్య హక్కుల కోసం భారత్ బిడ్‌లు దాఖలు చేసింది. ఇండోర్ అథ్లెటిక్స్ ఈవెంట్‌ను భువనేశ్వర్‌లో నిర్వహించాలనుకొంటున్నట్టు భారత అథ్లెటిక్స్ సమాఖ్య తెలిపింది. అయితే, ఆసియా రిలే విషయంలో మాత్రం చర్చలు జరుగుతున్నట్టు పేర్కొంది.



అదరగొట్టిన భరత్

ఎలిమినేటర్-3లో పట్నాపై తెలుగు టైటాన్స్ గెలుపు

న్యూఢిల్లీ: తెలుగు టైటాన్స్ స్టార్ ఆల్‌రౌండర్ భరత్ హుడా 23 పాయింట్లతో చెలరేగడంతో ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో ఆ జట్టు ట్రోఫీని ముద్దాడేందుకు రెండు విజయాల దూరంలో నిలిచింది. మంగళవారం జరిగిన ఎలిమినేటర్-3లో టైటాన్స్ 46-39తో బలమైన పట్నా పైరేట్స్‌ను ఓడించి క్వాలిఫయర్-2 పోరుకు అర్హత సాధించింది. టైటాన్స్ స్టార్ ఆటగాడు భరత్ విజృంభణతో పట్నా ఆత్మరక్షణలో పడిపోయింది. భరత్‌తో పాటు టైటాన్స్ కెప్టెన్ మాలిక్ (5 పాయింట్లు), డిఫెండర్లు అజిత్, శుభమ్ రాణించారు. ఇక, బుధవారం జరిగే క్వాలిఫయర్-2లో పుణెరి పల్టన్‌తో టైటాన్స్ తాడోపేడో తేల్చుకోనుంది. ఇందులో నెగ్గిన జట్టు శుక్రవారం జరిగే ఫైనల్లో దబాంగ్ ఢిల్లీతో ట్రోఫీ కోసం పోటీ పడనుంది.

హైదరాబాద్‌కు 3 పాయింట్లు

- పుదుచ్చేరితో రంజీ డ్రా
- ఆంధ్ర మ్యాచ్‌కు తుఫాన్ దెబ్బ

పుదుచ్చేరి: ఊహించినట్టే హైదరాబాద్, ఆంధ్ర రంజీ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. అయితే, హైదరాబాద్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించగా.. తుఫాన్ కారణంగా ఆంధ్ర మ్యాచ్‌లో మంగళవారం ఆట కూడా ఒక్క బంతి కూడా పడకుండానే తుడిచి పెట్టుకుపోయింది. ఆటకు నాలుగో, ఆఖరి రోజు మొదటి ఇన్నింగ్స్‌లో 126 పరుగులకే ఆలౌటైన పుదుచ్చేరి ఫాలో ఆన్‌లో పడింది. 309 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పుదుచ్చేరి మంగళవారం ఆట ఆఖరుకు 97/5 స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 435 పరుగులు చేసింది. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా హైదరాబాద్‌కు మూడు పాయింట్లు.. పుదుచ్చేరికి ఒక్క పాయింట్ లభించాయి. కాగా, విజయనగరంలో బరోడాతో ఆంధ్ర మ్యాచ్ కూడా డ్రాగా ముగిసింది. వర్షం కారణంగా ఆఖరి రోజు ఆట కూడా రద్దయి...తొలి ఇన్నింగ్స్ కూడా పూర్తికాకపోవడంతో ఇరు జట్లకూ చెరో పాయింట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో బరోడా 363 పరుగులు చేయగా.. ఆంధ్ర 43/2 స్కోరు సాధించింది.

ఐసీసీని ఆడిస్తున్న భారత్?

ఇంగ్లండ్ మాజీ రెఫరీ బ్రాడ్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఐసీసీని భారత క్రికెట్ బోర్డు తన చెప్పుచేతల్లో పెట్టుకొందని ఇంగ్లండ్‌కు చెందిన మాజీ మ్యాచ్ రెఫరీ క్రిస్ బ్రాడ్ సంచలన ఆరోపణలు చేశాడు. భారత్ ఆడే మ్యాచ్‌ల్లో ఆ జట్టుకు కొంత అనుకూలంగా వ్యవహరించాలనే ఒత్తిడి తీవ్రంగా ఉండేదని ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. 'ఒక మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో బౌల్ చేయాల్సిన ఓవర్ల కన్నా టీమిండియా 3-4 ఓవర్లు తక్కువగా వేసింది. నిబంధనల ప్రకారం జరిమానా విధించాలి. అయితే, సరిగ్గా ఆ సమయంలోనే ఫోన్ వచ్చింది. ఆడేది భారత్ కాబట్టి చూసీచూడనట్టు వెళ్లాలని సూచించారు. సమయాన్ని ఏదో విధంగా సరిచేయాలని చెప్పడంతో.. తప్పలేదని చెప్పాడు. కానీ, ఆ తర్వాతి మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ గురించి కెప్టెన్ సౌరవ్ గంగూలీని హెచ్చరించినట్టు తెలిపాడు. అయినా.. అతడు పట్టించుకోక పోవడంతో నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి వచ్చిందని బ్రాడ్ చెప్పాడు.

బిజినెస్

యాపిల్.. 4 లక్షల కోట్ల డాలర్లు

ఐఫోన్ తయారీ దిగ్గజం యాపిల్ మార్కెట్ విలువ తొలిసారిగా 4 ట్రిలియన్ డాలర్ల (నాలుగు లక్షల కోట్ల డాలర్లు)కు చేరింది. ఈ ఏడాది సెప్టెంబరులో విడుదల చేసిన ఐఫోన్ 17 మోడళ్లు ప్రపంచవ్యాప్తంగా జోరుగా అమ్ముడవుతుడంటంతో కంపెనీ షేరు గడిచిన 3 నెలల్లో 25 శాతం మేర పుంజుకుంది. పైగా ఈ గురువారం కంపెనీ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించనుంది. కంపెనీ పనితీరుపై ఆశాజనక అంచనాలతో మంగళవారం షేరు ధర మరింత పెరిగి 269.87 డాలర్ల వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. యాపిల్‌తోపాటు మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం 4 లక్షల కోట్ల డాలర్లు దాటింది. అయితే, ఈ జూలైలోనూ మైక్రోసాఫ్ట్ ఈ మార్క్‌ను తాకింది. కాగా, ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా 4.6 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్‌తో ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా కొనసాగుతోంది.

నోకియాలో ఎన్‌విడియా 100 కోట్ల డాలర్ల పెట్టుబడి
టెలికాం నెట్‌వర్క్, పరికరాల తయారీ దిగ్గజం నోకియాలో ఎన్‌విడియా 100 కోట్ల డాలర్ల (రూ.8,829 కోట్లు) పెట్టుబడులు పెడుతోంది. ఇందుకు గాను ఎన్‌విడియాకు నోకియా 16.6 కోట్ల కొత్త షేర్లను జారీ చేయనుంది. ఈ డీల్ నేపథ్యంలో నోకియా షేరు ఏకంగా 18% పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	575
చిత్తూరు	593	విశాఖపట్నం	565
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	123
వరంగల్	117	గుంటూరు	126
కరీంనగర్	117	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	114
కర్నూలు	117	నెల్లూరు	119
విశాఖపట్నం	119	అనంతపురం	119
గోదావరి	123		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,460 ▼	1,12,500 ▼	1,65,000 ▼
విజయవాడ	1,25,000 ▼	1,18,000 ▼	1,45,000 ▼
విశాఖపట్నం	1,21,860 ▼	1,14,100 ▼	1,65,000 ▼
రాజమండ్రి	1,20,820 ▼	1,10,750 ▼	1,47,000 ▼
ప్రొద్దుటూరు	1,20,000 ▼	1,10,400 ▼	1,47,000 ▼
ముంబై	1,18,043 ▼	1,08,127 ▼	1,41,896 ▼

జోరుగా డేటా సెంటర్లు

2030 నాటికి దేశంలో ఐదింతలు పెరుగుతాయ్

- 4,500 కోట్ల డాలర్ల పెట్టుబడులు
- మక్వేరీ ఈక్విటీ రీసెర్చ్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో డేటా కేంద్రాల (డీసీ) ఏర్పాటు జోరందుకుంది. ఇప్పటికే భారత్‌లో 1,400 మెగావాట్ల సామర్థ్యం ఉన్న డీసీలు ఏర్పాటయ్యాయి. వీటి సామర్థ్యం 2027 నాటికి రెట్టింపై, 2030 నాటికి ఐదు రెట్లు పెరుగుతుందని మక్వేరీ ఈక్విటీ రీసెర్చ్.. 'రాక్స్ టు రిచెస్: ఇండియా డేటా సెంటర్స్' పేరుతో రూపొందించిన నివేదికలో తెలిపింది. దేశంలో ఇప్పటికే 1,400 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు కార్యకలాపాలు సాగిస్తుండగా మరో 1,400 మెగావాట్ల సెంటర్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటితో పాటు దాదాపు 5,000 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు ప్రణాళికలు రచిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. సర్వర్ల ఖర్చులు పక్కన పెట్టినా ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న డేటా కేంద్రం ఏర్పాటుకు 40 లక్షల నుంచి 70 లక్షల డాలర్లు ఖర్చవుతుంది. దీంతో 2030 నాటికి డేటా సెంటర్ల ద్వారానే మన దేశం 3,000 కోట్ల డాలర్ల నుంచి 4,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.4 లక్షల కోట్లు) పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని ఆ నివేదిక పేర్కొంది. ఇందులో గూగుల్ కంపెనీ ఒక్కటే అదానీ గ్రూప్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వద్ద 1,500 కోట్ల డాలర్ల పెట్టుబడితో 1,000 మెగావాట్ల డేటా కేంద్రం, ఏఐ ఆధారిత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనుంది. దేశంలో డేటా కేంద్రాల ఏర్పాటుకు దోహదం చేసే అంశాలేమిటంటే..

- డేటా లోకలైజేషన్ చట్టాలు
- కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సానుకూల విధానాలు, రాయితీలు
- కంపెనీలు వేగంగా క్లౌడ్ కంప్యూటింగ్‌కు మారడం
- ఓటీటీ కంటెంట్, మొబైల్ డేటాకు పెరుగుతున్న డిమాండ్
- పెరుగుతున్న డిజిటల్ నేటివ్ వ్యాపారాలు

ఆర్‌సీపీఎల్‌తో సాంప్రే న్యూట్రిషన్స్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణకు చెందిన సాంప్రే న్యూట్రిషన్స్.. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్)తో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా ఆర్‌సీపీఎల్ కోసం పోషకాహార ఉత్పత్తుల తయారీ, సరఫరాను సాంప్రే చేపట్టనుంది. ఈ ఒప్పంద కాలపరిమితి మూడేళ్లు. ఆర్‌సీపీఎల్ భాగస్వామ్యంతో ఏటా రూ.12 కోట్ల నుంచి రూ.15 కోట్ల వ్యాపారం లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు సాంప్రే వెల్లడించింది. కాగా సాంప్రే ఇటీవల వివిధ కంపెనీలతో రూ.45 కోట్ల విలువైన తయారీ, సరఫరా ఒప్పందాలను కుదుర్చుకుంది. ఫారిన్ కరెన్సీ కన్వర్టబల్ బాండ్ల జారీ ద్వారా రూ.355 కోట్లు సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

కేఫిన్ టెక్ లాభం రూ.93 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కేఫిన్ టెక్నాలజీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.309.20 కోట్ల ఆదాయంపై రూ.93.31 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 10.3 శాతం పెరగగా లాభం 4.5 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కొత్తగా 597 కార్పొరేట్ క్లయింట్లను చేర్చుకున్నట్లు కంపెనీ పేర్కొంది. కాగా భారత్ కోకింగ్ కోల్, యశోద హాస్పిటల్స్, జునిపర్ గ్రీన్ ఎనర్జీ సహా మరి కొన్ని పబ్లిక్ ఇష్యూలను దక్కించుకున్నట్లు తెలిపింది.

భారీగా తగ్గిన బంగారం

- ఢిల్లీ మార్కెట్లో రూ.4,100 తగ్గుదల
- రూ.1,21,800కు దిగివచ్చిన 10 గ్రాముల ధర
- ఆల్‌టైం రికార్డుతో పోలిస్తే రూ.13,000 డౌన్
- రూ.1.45 లక్షలకు పడిపోయిన కిలో వెండి
- అంతర్జాతీయంగా 4,000 డాలర్ల దిగువకు..

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై రూ.4,100 తగ్గి రూ.1,21,800కు దిగివచ్చింది. ఈ నెల 17న నమోదైన ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,34,800తో పోలిస్తే.. గడిచిన 11 రోజుల్లో మేలిమి బంగారం రేటు రూ.13,000 తగ్గింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా రూ.4,100 తగ్గుదలతో రూ.1,21,200కు పరిమితమైంది. కిలో వెండి ఏకంగా రూ.6,250 తగ్గి రూ.1,45,000 స్థాయికి పడిపోయింది. అమెరికా-చైనా మధ్య నెలకొన్న వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనాలుగా పేరున్న ఈ విలువైన లోహలకూ డిమాండ్ తగ్గిందని విశ్లేషకులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు మళ్లీ 4,000 డాలర్లకు దిగువకు పడిపోయింది. ఒక దశలో 94 డాలర్లకు పైగా తగ్గి 3,887 డాలర్లకు దిగివచ్చింది. వెండి సైతం 2.85 శాతం తగ్గుదలతో 45.56 డాలర్లకు జారుకుంది.

5-10 శాతం తగ్గొచ్చు..

బంగారం, వెండి ధరల్లో దిద్దుబాటు మున్ముందూ కొనసాగవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌కు చెందిన సౌమిల్ గాంధీ అన్నారు. వీటి ధరలు 5-10 శాతం మేర తగ్గే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేశారు. ఈ ఏడాదిలో బంగారం, వెండి ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. అలాంటి సందర్భాల్లో బడా ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడుతుంటారని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

వెండిపై తగ్గిన దిగుమతి సుంకం

15% నుంచి 6 శాతానికి తగ్గింపు

వెండి నగల దిగుమతులకు మాత్రం చెక్

వెండి లేదా వెండితో చేసిన నగలు, నాణేలు కొనాలనుకునే వారికి శుభవార్త. ఇప్పటి వరకు వెండిపై 15 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం 6 శాతానికి కుదించింది. దీంతో దేశంలో వెండి ధర మరింత దిగి రానుంది. అయితే వెండి నగలు, వెండి నగల్లో వాడే భాగాలపై విధించే దిగుమతి సుంకాన్ని మాత్రం 25 శాతం నుంచి 20 శాతానికి మాత్రమే తగ్గించింది. దేశీయ వెండి నగల తయారీ పరిశ్రమ రక్షణ కోసమే ప్రభుత్వం ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు.

10 కిలోల వరకు తెచ్చుకోవచ్చు

విదేశాల నుంచి వచ్చే భారతీయులు లేదా ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) 10 కిలోల వరకు వెండిని తెచ్చుకునేందుకు కూడా ప్రభుత్వం అనుమతించింది. అయితే దీనిపైనా డీజీఎఫ్‌టీ ఎప్పటికప్పుడు జారీ చేసే టారిఫ్ రేటు ప్రకారం దిగుమతి సుంకం చెల్లించాలని స్పష్టం చేసింది. పూర్తి ఎగుమతుల కోసం మాత్రం కంపెనీలు ఎన్ని వెండి నగలనైనా పైసా డ్యూటీ లేకుండా అనుమతించే విధానం కొనసాగుతుందని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఎగుమతిదారులు లేదా ఎగుమతి సంస్థలు ఈ నగలను దేశీయ మార్కెట్లో విక్రయించేందుకు మాత్రం అనుమతించరు.

2030 నాటికి రూ.35.32 లక్షల కోట్లు

భారత ఐటీ రంగంపై బెస్సెమెర్ అంచనా



న్యూఢిల్లీ: భారత ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ) సేవల మార్కెట్ 2030 నాటికి 400 బిలియన్ డాలర్లకు (40,000 కోట్ల డాలర్లు= రూ.35.32 లక్షల కోట్లు) చేరుకోవచ్చని బెస్సెమెర్ వెంచర్ పార్ట్‌నర్స్ నివేదిక అంచనా వేసింది. వ్యాపారాల వృద్ధికి ఏఐ సేవల వినియోగం విరివిగా పెరుగుతుండటంతో పాటు అంతర్జాతీయంగా ఐటీ సేవల ఔట్‌సోర్సింగ్ భారీగా పెరగనుండటం ఇందుకు దోహదపడనుందని నివేదిక పేర్కొంది. భారత ఐటీ పరిశ్రమ 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఏటేటా 8.1 శాతం చొప్పున వృద్ధి చెందుతూ 26,400 కోట్ల డాలర్లకు చేరుకుందని బెస్సెమెర్ నివేదికలో ప్రస్తావించింది. 2025-30 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో ఏటేటా 8.7 శాతం చొప్పున వృద్ధి చెంది 40,000 కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఐటీ రంగం నిర్మాణాత్మక మార్పులకు లోనవుతున్న తరుణంలో ఈ నివేదిక అత్యంత ఆశావహ అంచనాలను విడుదల చేయడం గమనార్హం. ఏఐ, డిజిటల్ టెక్నాలజీలతో ఐటీ రంగంలో క్లయింట్ల ప్రాధాన్యాలు, వ్యయాల తీరులో గణనీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఏఐతో ఐటీ కంపెనీలు క్లయింట్ల నుంచి వసూలు చేసే చార్జీలపై ఒత్తిడి పెంచనున్నప్పటికీ, మరిన్ని కొత్త మార్కెట్లు అందుబాటులోకి రానుండటం వాటి ఆదాయ పెరుగుదలకు దోహదపడనుందని బెస్సెమెర్ వెంచర్ పార్ట్‌నర్స్ సీఓఓ నితిన్ కైమల్ అన్నారు.

టాటా ట్రస్ట్స్ నుంచి మెహ్లి మిస్త్రీ ఔట్

అడ్డుకున్న నోయెల్ టాటా!

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ దాతృత్వ సంస్థ టాటా ట్రస్ట్స్‌లో ఇంటి పోరు మరింత ముదిరింది. మెహ్లి మిస్త్రీని తిరిగి ట్రస్టీగా నియమించే తీర్మానానికి ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా, అతనికి సన్నిహితులైన మరో ఇద్దరు ట్రస్టీలు టీవీఎస్ గ్రూప్ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్, రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి విజయ్ సింగ్ వ్యతిరేకించడంతో తీర్మానం వీగిపోయినట్టు సమాచారం. దీంతో రతన్ టాటాకు వీర విధేయుడైన మిస్త్రీని మరోసారి టాటా ట్రస్ట్స్ జీవిత కాల ట్రస్టీగా పునర్నియమించే ప్రయత్నాలు బెడిసికొట్టాయి. కాగా మెహ్లి మిస్త్రీ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది.

మార్కెట్లో లాభాల స్వీకరణ

ముంబై: ఆసియా మార్కెట్ల బలహీన ట్రెండ్ నేపథ్యంలో ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ రంగ షేర్లలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం నష్టపోయాయి. ఒక దశలో 560 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 150.68 పాయింట్ల నష్టంతో 84,628.16 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 29.85 పాయింట్లు కోల్పోయి 25,936.20 వద్దకు జారుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 నష్టపోయాయి.

ఎంసీఎక్స్‌లో సాంకేతిక సమస్య: మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సాంకేతిక సమస్య కారణంగా మంగళవారం ట్రేడింగ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎక్స్ఛేంజ్‌లో ట్రేడింగ్ 4 గంటలకు పైగా ఆలస్యంగా (మధ్యాహ్నం 1.25 గంటలకు) ప్రారంభమైంది. ట్రేడింగ్ కార్యకలాపాలను డిజాస్టర్ రికవరీ సైట్‌కు బదిలీ చేయాల్సి వచ్చింది. దాంతో గోల్డ్, సిల్వర్, ముడి చమురుతో పాటు కాపర్, జింక్, అల్యూమినియం సహా ఇతర కమోడిటీ కాంట్రాక్టుల ట్రేడింగ్‌పై ప్రభావం పడింది.

ఉన్న ఊరును కన్నతల్లిగా భావించారు. గ్రామ శ్రేయస్సే ధ్యేయంగా... ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల 'సర్పంచ్ సంవాద్' పోటీల్లో జాతీయస్థాయిలో ప్రథమ బహుమతిని అందుకున్నారు. జనంతో మమేకమై, వారి సంక్షేమానికి పాటుపడుతున్న ఏలూరు జిల్లా చేబ్రోలు సర్పంచ్ **రాంధే లక్ష్మీ సునీత** ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...



గ్రామాభ్యున్నతే ఆశయంగా..

"మాది ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామం. మా నాన్న వెంకట్రావు టైలర్, అమ్మ చెల్లమ్మ గృహిణి. ఇంటర్ చదువుతుండగానే నాకు వివాహం అయ్యింది. చదువుపై మక్కువతో... పెళ్లయిన 15 ఏళ్ల తర్వాత ఏఎన్‌యూలో దూరవిద్య ద్వారా బీఏ పూర్తి చేశాను. 2021 ఎన్నికల్లో బీసీ మహిళకు మాగ్రామ సర్పంచ్ పదవి రిజర్వ్ అయ్యింది. ఎన్నికల్లో 900 ఓట్ల మెజార్టీతో మాజీ సర్పంచ్ భార్యను ఓడించాను. నా భర్త రాజారావు గతంలో రెండుసార్లు సర్పంచ్‌గా, ఒకసారి ఎంపీటీసీగా పనిచేశారు. ఎప్పుడూ ఆయన పాలన వ్యవహారాల గురించి నేను పట్టించుకోలేదు. సర్పంచ్ అయ్యాక... కన్నతల్లిలాంటి మా ఊరును ఉన్నతంగా తీర్చిదిద్దాలనుకున్నాను. సమస్యల పరిష్కారంపై దృష్టి నిలిపాను. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, డంపింగ్‌యార్డు నిర్వహణ, పారిశుధ్య పనులు... ఇలా ప్రతిదాన్ని నేనే స్వయంగా పర్యవేక్షిస్తున్నాను.

ప్లాస్టిక్‌పై సమరం...

పదవిని స్వీకరించిన తొలి ఏడాది ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రచారం చేశాను. సామర్లకోటలో ఈ అంశంపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమాలకు హాజరై, సంబంధిత అంశాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళాను. అది గ్రామస్తుల్లో మరింత చైతన్యం నింపింది. దాంతో మా ఊరిని జిల్లా స్థాయి శిక్షణ కేంద్రంగా ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా చేపట్టే అవగాహన కార్యక్రమాలకు ఇప్పటికీ ఇక్కడినుంచే శ్రీకారం చుడుతున్నారు. ప్రతి రోజూ ఐదు టన్నుల చెత్తను డంప్‌యార్డుకు తరలించి, అక్కడికక్కడే జీరో వేస్టేజ్‌గా మారుస్తున్నాం. ప్రధానంగా బయోడిగ్రేడబుల్ (సీసాలు, ఇనుము) వస్తువులను పాత సామాన్ల వారికి విక్రయిస్తున్నాం. తడి చెత్తను సేంద్రియ ఎరువుకు, పొడి చెత్తను కంపోస్టుకు వినియోగిస్తున్నాం. గ్రామంలోని పూలమొక్కలు, పంట అవసరాలకు ఆ వ్యర్థాల్లో చాలావరకూ వినియోగించేలా చర్యలు చేపట్టాను.

ప్రత్యేకంగా మహిళా దినోత్సవాలు...

గ్రామంలోని మహిళలను ప్రోత్సహించడం కోసం ప్రతి మహిళా దినోత్సవాన్ని ఒక్కో థీమ్‌తో నిర్వహించడం ప్రారంభించాను. 2021లో వర్కింగ్ ఉమెన్స్, టీచర్లు, ఇతర మహిళల సాధక బాధలను తెలుసుకునేందుకు భారీ సమావేశం ఏర్పాటు చేశాను. అక్కడ బృంద చర్చలద్వారా వారిలో చైతన్యం కలగడానికి దోహదం చేశాను. 2022లో కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణ, నేప్‌కిన్స్ వాడకం తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించాను. 2023లో... భర్త మరణించిన తర్వాత కుటుంబాలను నడుపుతున్న ఒంటరి మహిళలను సత్కరించాను. అలాగే 2024లో డ్వాక్రా రుణాలను, బ్యాంకు లింకేజి రుణాలను సకాలంలో కట్టిన వారిని సన్మానించి, అందరూ ఆ దిశగా సాగేలా ప్రేరణ కలిగించాను. ఈ ఏడాది 'ఇల్లాలి ఆరోగ్యం- ఇంటి రక్షణ' అనే థీమ్‌తో... వైద్యుల ద్వారా వివిధ సమస్యలపై అవగాహన కల్పించడంతోపాటు చికిత్సలు కూడా చేయించాను. ఆ తరువాతే ప్రభుత్వం 'స్వశక్తి- నారీ సశక్తి అభియాన్'ను చేపట్టింది.



తొలి ప్రయత్నంలోనే పురస్కారం..

'భారత నాణ్యతా మండలి' (క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా), 'జల్ జీవన్' మంత్రిత్వశాఖ ఆరు నెలల క్రితం 'సర్పంచ్ సంవాద్' పేరిట ఒక యాప్‌ను రూపొందించి, దేశవ్యాప్తంగా ఉన్న లక్షమంది సర్పంచులను అందులో చేర్చాయి. ప్రతినెలా ఒక థీమ్‌తో, ఆన్‌లైన్ విధానంలో సర్పంచ్‌లకు పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నాయి. ఈ ఏడాది జూలై నెలలో పోటీలకు ఎంట్రీలను ఆహ్వానించారు. గ్రామంలో చేపట్టిన మెరుగైన పాలన, గ్రామాభివృద్ధి, సమన్వయం, సాంకేతికత, సమాచార మార్పిడి... అందులో ప్రధానాంశాలు. దీనికోసం నేను 80 సెకన్ల వీడియోను పంపాను. ఆ తరువాత నన్ను ఢిల్లీకి ఆహ్వానించారు. సెప్టెంబర్ 15న నిర్వహించిన జాతీయ సదస్సులో 15 మంది సర్పంచ్‌లకు డిబేట్ నిర్వహించారు. నేను నా వీడియో క్లిప్పింగ్స్‌ను ప్రదర్శిస్తూ, తెలుగులోనే వివరించాను. అందులో మహిళా సాధికారిత, డంప్‌యార్డులోనే సేకరించిన చెత్తను జీరో చేయడం, బాల్య వివాహాలను అరికట్టడం తదితర అంశాలపై ప్రస్తావించాను. నేను చెప్పిన అంశాలను ఒక ట్రాన్స్‌లేటర్ హిందీలోకి అనువదించారు. నా క్లిపింగ్స్ మొదటి బహుమతి సాధించాయి. నగదు పురస్కారంగా రూ. 35 వేలు లభించింది. అనంతపురం జిల్లా పి నారాయణపురం సర్పంచ్ కె హనుమంతరావు, గుజరాత్‌లోని ఉమ్రా సర్పంచ్ హెచ్. ధర్మేంద్రభాయ్‌లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కాగా... ఈ ఏడాది ఆగస్టు 15న ఉత్తమ సర్పంచ్‌గా పురస్కారం పొందాను. ఇటీవల 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో ఉత్తమ పంచాయతీగా మా గ్రామానికి కలెక్టర్ వెట్రిసెల్వి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇవన్నీ పంచాయతీ ఈవోలు, పారిశుధ్య సిబ్బంది సహకారం వల్లనే సాధ్యమయింది."

చేయాల్సింది ఎంతో ఉంది...

'సర్పంచ్ సంవాద్ పురస్కారంతో నేను తృప్తి చెందను. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. మా గ్రామానికి రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. వివిధ ప్రాంతాల్లో మరిన్ని సీసీ డ్రెయిన్ల ఏర్పాటు, ఇతర పనులు చేయాల్సి ఉంది. ఉత్తమ పంచాయతీగా ఎంపికైన మా గ్రామాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి దత్తత తీసుకున్నారు. ఉర్దూ స్కూల్ కాంపౌండ్ వాల్‌కు రూ.4 లక్షలు కేటాయించారు. పిల్లలకు ప్రత్యేకంగా ఒక పార్కు, మరి కొన్ని రోడ్ల నిర్మాణం నా పదవీకాలంలోగా పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తాను.

• ఈశ్వర్ నెట్టెం

అందాన్ని పెంచే ఫేస్‌ప్యాక్‌లు

ముఖం అందంగా కనిపించాలని అమ్మాయిలు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఖరీదైన క్రీమ్‌లు, సీరమ్‌లు ఉపయోగిస్తూ ఉంటారు. అలాకాకుండా అందుబాటులో ఉండే పండ్లతో ఫేస్‌ప్యాక్‌లు తయారుచేసుకుని వాడితే ముఖం మరింత అందంగా మారుతుంది. ఆ వివరాలు...

- ఒక గిన్నెలో నాలుగు చెంచాల ద్రాక్షరసం, అరచెంచా బాదం పొడి, రెండు చెంచాల పాలు, అరచెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంటసేపు ఆరనివ్వాలి. ఆపైన గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే ముఖం మృదువుగా మెరుస్తుంది.
- ఒక యాపిల్‌ను తీసుకుని ముక్కలుగా కోసి మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో అరచెంచా తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావు గంట తరువాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే చర్మం మీద పేరుకున్న మృతకణాలు తొలగిపోతాయి. చర్మరంధ్రాలు శుభ్రమవుతాయి. ముఖం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. యాపిల్‌కు బదులు అరటిపండు లేదా అవకాడోను కూడా వాడుకోవచ్చు.
- గుప్పెడు దానిమ్మ గింజలను మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో రెండు చెంచాల పెరుగువేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావుగంట తరువాత మంచినీళ్లతో కడిగేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఒక గిన్నెలో పావు కప్పు నారింజ రసం, ఒక చెంచా పసుపు, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకి పట్టించి ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే చర్మం తేమతో నిండి ముఖం నిగారిస్తుంది.
- చిన్న గిన్నెలో అరకప్పు బొప్పాయి గుజ్జు, కోడిగుడ్డు తెల్లసొన వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే ముఖం మీద నల్లమచ్చలు, మొటిమలు తగ్గిపోతాయి. చర్మం బిగుతుగా మారుతుంది.





కేంద్రంతో ఒప్పందం చేసుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

రాష్ట్రంలో జల రవాణా మార్గాల అభివృద్ధి

- రూ.150 కోట్లతో కార్యక్రమాలు: మంత్రి జనార్దన్‌రెడ్డి

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంతర్గత జల రవాణా అభివృద్ధిపై రాష్ట్రప్రభుత్వం జాతీయ అంతర్గత జల రవాణా అభివృద్ధి సంస్థతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ముంబైలో నెస్కో ఎగ్జిబిషన్ సెంటర్‌లో కేంద్ర ఓడరేవులు షిప్పింగ్, జల మార్గాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న 'ఇండియా మారిటైమ్ వారోత్సవం-2025'లో రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ.. జాతీయ అంతర్గత జల రవాణా అభివృద్ధి సంస్థతో ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వంతో కలసి జాతీయ అథారిటీ రూ.150 కోట్లతో జల రవాణా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని మంత్రి అన్నారు.

రామాయపట్నం రిఫైనరీపై మరో ముందడుగు!

(మొదటి పేజీ తరువాయి)

అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో జరుగుతున్న 28వ ఎనర్జీ టెక్నాలజీ మీట్-2025లో మంగళవారం ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఎంవోయూ పత్రాలను కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ సమక్షంలో బీపీసీఎల్ డైరెక్టర్/ఇన్‌చార్జి సీఎండీ సంజయ్ ఖన్నా, ఓఐఎల్ చైర్మన్ రంజిత్ రథ్ మార్చుకున్నారు. రూ.లక్ష కోట్ల ప్రాథమిక అంచనా వ్యయంతో.. ఏటా 9-12 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీపీఏ) సామర్థ్యంతో రామాయపట్నం సమీపాన గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ/పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను నిర్మించనున్న సంగతి తెలిసిందే. రిఫైనరీ ఏర్పాటుకు అవసరమైన కీలక అనుమతులన్నీ వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీనికి భూములు కూడా ఇచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టు ముందస్తు పనులు సాగుతున్నాయి. సంజయ్ ఖన్నా మాట్లాడుతూ.. బీపీసీఎల్-ఓఐఎల్ సహకారం దక్షిణ భారతంలో ప్రపంచ స్థాయి రిఫైనరీ-పెట్రోకెమికల్ ప్లాంటు నిర్మించే దిశగా కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఓఐఎల్‌తో చేతులు కలపడం ద్వారా వ్యూహాత్మక, సుస్థిర ప్రాజెక్టు స్థాపనకు తమ బలాలను ఏకం చేస్తున్నామని.. రామాయపట్నం రిఫైనరీ బీపీసీఎల్ ఆర్థిక స్వరూపాన్ని మార్చడమే గాక.. ఆత్మనిర్భర భారత్ విజన్‌తో ఇంధనం, పెట్రోకెమికల్స్ రంగాల్లో భారత స్వావలంబనకు చేయూతనిస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రప్రభుత్వ సహకారంతో 2030 నాటికి ఈ ప్రాజెక్టులో వాణిజ్య కార్యక్రమాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. మంగళవారం బీపీసీఎల్ కుదుర్చుకున్న మూడు ఎంవోయూల్లో ఇదే అతిపెద్దది. అలాగే రూ.3,500 కోట్లతో నుమాలీగఢ్ రిఫైనరీ లిమిటెడ్ విస్తరణకు సంబంధించి కూడా బీపీసీఎల్, ఓఐఎల్ త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా అసోంలోని సిలిగురి నుంచి యూపీలోని ముగల్‌సరాయ్ వరకు 700 కిలోమీటర్ల మేర క్రాస్‌కంట్రీ ప్రొడక్ట్ పైపులైన్ నిర్మిస్తారు. మోటార్ స్పిరిట్ (ఎంఎస్), హైస్పీడ్ డీజిల్ (హెచ్‌ఎస్‌డీ), ఏవియేషన్ టర్బయిన్ ఫ్యుయల్ (ఏటీఎఫ్)ను ఈ పైపులైన్ గుండా రవాణా చేస్తారు. ఎన్‌ఆర్‌ఎల్ సామర్థ్యాన్ని ఇప్పుడున్న 3 ఎంఎంటీపీఏను 9 ఎంఎంటీపీఏకు పెంచుతారు. ఇంకోవైపు.. కేరళలోని కోచి రిఫైనరీ సమీపాన బ్రహ్మపురంలో మున్సిపల్ వ్యర్థాల ఆధారంగా నెలకొల్పిన తమ కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటులో ఫెర్మెంటెడ్ సేంద్రియ ఎరువులు, లిక్విడ్ ఫెర్మెంటెడ్ సేంద్రియ ఎరువుల ఉత్పత్తికి ఫెర్టిలైజర్స్-కెమికల్స్ ట్రావెన్కోర్ లిమిటెడ్ (ఫ్యాక్ట్)తో బీపీసీఎల్ మూడో ఎంవోయూ కుదుర్చుకుంది.

బస్సు ప్రమాదంలో మరో ట్విస్ట్!

మంటగలిసిన మానవత్వం!

- 'బైకు ప్రమాదాన్ని' చూసీచూడనట్లు వెళ్లిపోయారు
- ఇబ్బందులు తలెత్తుతాయన్న భయమే కారణం
- ఒక్కరైనా స్పందించి ఉంటే 19 ప్రాణాలు మిగిలేవి
- 'వి.కావేరి' కంటే ముందే 'ఆ బైకు'ను ఢీకొన్న వేరే బస్సు
- దీంతో రోడ్డు మధ్యలోకి వచ్చిన ద్విచక్రవాహనం
- పోలీసు విచారణలో కీలక మలుపు
- 35 మందికి పైగా డ్రైవర్ల విచారణ
- వి.కావేరి బస్సు డ్రైవర్ లక్ష్మయ్య అరెస్టు



కర్నూలు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన వి.కావేరి ట్రావెల్ బస్సు ప్రమాద ఘటనలో మరో కీలకాంశం వెలుగులోకి వచ్చింది. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను వి.కావేరి ట్రావెల్ బస్సు తోసుకుంటూ వెళ్లడానికి ముందే.. డివైడర్ పక్కన పడి ఉన్న ఆ బైక్‌ను మరో ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని వెళ్లడం వల్లే బైక్ రోడ్డు మధ్యలో పడిపోయిందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆ బస్సు ఎవరిది? అన్న ఆచూకీ కోసం సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. వివరాలివీ.. కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద రహదారిపై ఈ నెల 24 అర్ధరాత్రి దాటాక వి.కావేరి ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురై 19 మంది ప్రయాణికులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని అంతా భావించారు. కానీ, బైకర్ శివశంకర్ డివైడర్‌ను ఢీకొట్టిన తరువాత ఆ బైక్ డివైడర్ పక్కనే పడిపోయిందని తెలుస్తోంది. శివశంకర్ మృతి చెందగా, ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డాడు. డివైడర్ పక్కన పడిపోయిన బైక్‌ను ఓ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో బైకు నడిరోడ్డుపైకి వచ్చిందని, ఆ తరువాత వి.కావేరి ట్రావెల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బైక్‌పై పోనివ్వడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తాజాగా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి ముందు బైక్‌ను ఢీకొట్టిన ఆ బస్సు ఏ ట్రావెల్ సంస్థకు చెందినది? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఘటనా స్థలానికి వెల్దుర్తి సమీపంలోని కృష్ణగిరి మండలం అముకతాడు టోల్‌ప్లాజా మధ్య దూరం 18-19 కిలోమీటర్లు ఉంటుంది. 15-20 నిమిషాల్లో చేరుకునే అవకాశం ఉంది. ప్రమాదం జరిగిన రోజు తెల్లవారుజామున 2.45 గంటల నుంచి 3.30 గంటల మధ్యలో టోల్‌ప్లాజా దాటి ఎన్ని వాహనాలు వెళ్లాయి? అనే వివరాలు సేకరిస్తున్నారు. డివైడర్ పక్కన పడిపోయిన బైకును మొదట ఓ ప్రముఖ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిందనే అనుమానంతో సంబంధిత డ్రైవర్‌ను విచారించారు. అయితే, ఆ బస్సుకు బైకును ఢీకొన్నట్లు ఎలాంటి ఆనవాళ్లు, గీతలు లేకపోవడం, తమ బస్సు ఢీకొట్టలేదని డ్రైవర్ పోలీస్ విచారణలో వెల్లడించడంతో, అతడిని విడిచిపెట్టారు.

35 మందికిపైగా విచారణ

సీసీ ఫుటేజీల ఆధారంగా 35 వాహనాల డ్రైవర్లను పోలీసులు విచారించారు. బైక్ రోడ్డుపై పడిపోయిందని, రోడ్డుపై నిర్జీవంగా పడిపోయిన ఓ వ్యక్తిని మరో వ్యక్తి పక్కకు లాగుతున్నట్లు చూశామని కొందరు డ్రైవర్లు పోలీసులకు తెలిపారు. ఆ సమయంలో వాహనం ఆపితే ఏదైనా సమస్య వస్తుందని, దీంతో పాటు యజమానులు తిడతారన్న భయంతో ముందుకు వెళ్లిపోయామని వివరించినట్లు తెలిసింది. ఒక్కరైనా స్పందించి ఆ బైక్‌ను పక్కకు నెట్టేసి వెళ్లి ఉంటే ఘోర ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు.. 19 మంది ప్రయాణికుల ప్రాణాలు పోయేవి కాదు. బస్సు డ్రైవర్ లక్ష్మయ్య అరెస్టును పోలీసులు మంగళవారం చూపించారు. వైద్య చికిత్సల అనంతరం, కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు.



అమెరికాలో ప్రవాసాంధ్రులతో మన్నవ మోహనకృష్ణ

ఏపీలో పెట్టుబడులు పెట్టండి

- ప్రవాసాంధ్రులతో ఏపీటీఎస్ చైర్మన్ మోహనకృష్ణ

(న్యూజెర్సీ నుంచి కిలారు గోకుల్‌కృష్ణ)

గూగుల్ ఏఐ, క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులు ఏపీని ప్రపంచ సాంకేతిక కేంద్రంగా నిలబెడతాయని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఈ అవకాశాన్ని ఒడిసిపట్టుకోవడానికి, రాష్ట్రాభివృద్ధికి ప్రవాసాంధ్రులు విరివిగా పెట్టుబడులు పెట్టాలని కోరారు. అమెరికాలోని న్యూజెర్సీలో 'మీట్ విత్ మోహనకృష్ణ' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల సమన్వయం రాష్ట్రానికి కొత్త దిశను చూపిస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఇన్నోవేషన్ కేంద్రంగా రాష్ట్రం దూసుకెళ్తోందని పేర్కొన్నారు. కూటమి గెలుపునకు కృషి చేసిన ప్రవాసాంధ్రులు, రాష్ట్రాభివృద్ధిలో కూడా కీలకమని, పెట్టుబడులు పెట్టి రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యాపారవేత్తలు, ఎన్నారై టీడీపీ శ్రేణులు, స్థానిక తెలుగు సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టెట్‌పై సుప్రీంలో రివ్యూ పిటిషన్!

- రాష్ట్ర ప్రభుత్వం తరపున దాఖలు చేయాలని నిర్ణయం
- ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు కోసం ప్రయత్నం
- మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్సీలు.. 'రివ్యూ'పై హామీ

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టెట్ లేకుండా టీచర్ ఉద్యోగాలు పొందినవారు.. ఇప్పుడు టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు సెప్టెంబరు 1న తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీనివల్ల 2011కు ముందు ఉద్యోగాలు పొందిన వారంతా ఇప్పుడు టెట్ రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పుపై త్వరలోనే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే రివ్యూ పిటిషన్లు వేశాయి. అనేక ఉపాధ్యాయ సంఘాలు తీర్పును సమీక్షించాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. రాష్ట్రానికి చెందిన కొన్ని ఉపాధ్యాయ సంఘాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తరపున పిటిషన్ వేస్తే వాదనలు బలంగా వినిపించే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రివ్యూ పిటిషన్ వేస్తాం: లోకేశ్

టెట్ విషయంలో రివ్యూ పిటిషన్ వేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ తెలిపినట్లు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిశారు. రివ్యూ పిటిషన్ వేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. 2010 అక్టోబరు 23కు ముందు డీఎస్సీల ద్వారా ఎంపికైన టీచర్లు ఆందోళన చెందుతున్నారని వివరించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రివ్యూ పిటిషన్ వేస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

నాయుడుపేటలో 765 కోట్లతో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ

- కేంద్రం అనుమతి.. కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్

న్యూఢిల్లీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ రంగంలో రాష్ట్రానికి మరో ప్రఖ్యాత పరిశ్రమ రాబోతోంది. ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంపోనెంట్ స్కీం(ఈసీఎంఎస్) కింద రూ. 765 కోట్ల పెట్టుబడితో మల్టీ లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పీసీబీ) తయారీ యూనిట్ ఏర్పాటు కానుంది. తిరుపతి జిల్లా నాయుడుపేటలో సైర్మా స్ట్రాటెజిక్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ అనుమతి తెలిపింది. ఈ సంస్థ ద్వారా 955 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఈసీఎంఎస్ కింద దేశంలోని మూడు రాష్ట్రాల్లో రూ. 5,500 కోట్ల పెట్టుబడితో ఏడు ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఆమోదముద్ర వేసింది. ఈసీఎంఎస్ కింద సైర్మాకు మూలధన మద్దతును అందించాలని నిర్ణయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు ప్రమాదంపై వైసీపీ శవ రాజకీయాలు

- రాబందును పార్టీ సింబల్‌గా పెట్టుకోండి..: ఎంపీ శబరి

న్యూఢిల్లీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదంపై వైసీపీ శవ రాజకీయాలు చేస్తోందని టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి మండిపడ్డారు. మంగళవారం ఏపీ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'బస్సు ప్రమాదంపై కూటమి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ వైసీపీ తన అనుకూల మీడియాలో తప్పుడు కథనాలను ప్రచారం చేస్తోంది. విపత్తులు రావాలని వైసీపీ నేతలు కోరుకుంటున్నారు. ఇప్పటికే వైసీపీ ఫ్యాన్ తుప్పు పట్టింది. ఇకనైనా రాబందుల బొమ్మను పార్టీ సింబల్‌గా పెట్టుకుంటే మంచిది' అని ఎంపీ శబరి ఎద్దేవా చేశారు.

10 నుంచి 30 వరకూ జనగణన తొలి దశ

- రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల సేకరణ(2027)లో మొదటి దశ నవంబరు 10న ప్రారంభమవుతోంది. 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇళ్ల జాబితా ఖరారుచేసి ఇళ్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు కేంద్ర రిజిస్ట్రార్ జనరల్-సెన్సస్ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది.

'వైద్యం బంద్' వాయిదా

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ మెడికల్ అండ్ డెంటల్ కాలేజీల అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం నుంచి కాలేజీ అనుబంధ ఆస్పత్రుల్లో వైద్యసేవలు నిలిపివేయాలన్న నిర్ణయాన్ని వాయిదా వేసింది. తుఫాన్ నేపథ్యంలో అన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో వైద్య సేవలు కొనసాగిస్తామని అసోసియేషన్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటన జారీ చేసింది.

హరీశ్‌రావు తండ్రి మృతికి సీఎం సంతాపం

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ మంత్రి హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మృతికి ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం ప్రకటించారు.


ఎన్టీఆర్ జిల్లాలో తుఫాను గాలుల బీభత్సానికి ఊగిసలాడుతున్న కొబ్బరి చెట్లు

మొంథా బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ప్రధానంగా ఏడు జిల్లాల్లో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వృక్షాలు కూకటివేళ్లతో సహా కూలిపోయాయి. తీవ్ర గాలుల తీవ్రతకు కరెంటు స్తంభాలు పడిపోవడంతో కృష్ణా జిల్లా తీర ప్రాంతమంతా అంధకారం అలుముకుంది. తుఫాన్ ప్రభావంతో కోస్తాలోని అనేక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. ఇవి బుధవారం తెల్లవారుజాము వరకూ కొనసాగుతాయి. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం, పశ్చిమ గోదావరి నుంచి నెల్లూరు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తాయని హెచ్చరిక జారీచేశారు. కోస్తా జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ మెసేజ్ జారీచేసింది.

కడలి కల్లోలం...

మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కమ్ముకొచ్చిన మేఘాలతో చీకట్లు అలుముకున్నాయి. వానకు గాలులు కూడా తోడయ్యాయి. తుఫాన్ ప్రభావంతో సముద్ర తీర ప్రాంతాల్లో 50 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో వీసిన గాలులతో తీరప్రాంతవాసులు భయాందోళనకు గురయ్యారు. గాలులకు చాలాప్రాంతాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉండటంతో శ్రీకాకుళం జిల్లాపై తుపాను తీవ్ర ప్రభావం చూపింది. మంగళవారం జిల్లా అంతటా వర్షం కురుస్తూనే ఉంది. ఒడిశా నుంచి వస్తున్న వరదతో మహేంద్రతనయ, బహుదా, వంశధార, నాగావళి నదులు ఉధృతంగా ప్రవహించాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. విజయనగరం జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి.

దక్షిణ కోస్తాలో..

ఒకవైపు ఈదురు గాలులు, మరోవైపు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలతో ప్రకాశం జిల్లా ఒంగోలుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 6వేల క్యూసెక్కులు వరద వస్తుండగా 4గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. బాపట్ల జిల్లాలో నిజాంపట్నం దగ్గర సముద్రం 150 మీటర్లు ముందుకొచ్చింది. నె


విశాఖ తీరంలో 'అల'జడి

తీరం దాటిన చోట గందరగోళం

మొంథా తుఫాను నిర్దిష్టంగా ఎక్కడ తీరాన్ని తాకింది.. ఎక్కడ దాటిందనే అంశంపై పలురకాల అంచనాలు వెలువడ్డాయి. అది కాకినాడకు దక్షిణాన మచిలీపట్నం-కళింగపట్నం మధ్య యానాం వద్ద తీరాన్ని తాకినట్లు విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం స్పష్టం చేసింది. యానాం- నర్సాపురం మధ్య అంతర్వేది సమీపంలో తీరం దాటిందని కొందరు చెబుతుండగా... మచిలీపట్నం - హంసలదీవి మధ్య తీవ్ర తుఫాన్ తీరం దాటిందని మరొకరు చెప్పారు. మొత్తానికి... మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు తుఫాను తీరాన్ని తాకింది. ఆ తర్వాత కొన్ని గంటల పాటు తీరాన్ని దాటే ప్రక్రియ కొనసాగింది.

నేడూ భారీ వర్షాలు...

మొంథా తుఫాన్ తీరం దాటిందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కాకినాడకు 90 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 90 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 220 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తీవ్ర తుఫాన్ క్రమంగా బలహీన పడుతుందని తెలిపింది. దీని ప్రభావంతో బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు; ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించింది.

22 జిల్లాలు..403 మండలాలు

తుఫాన్ ప్రభావంపై ప్రభుత్వ అంచనా

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లోని 403 మండలాలపై మొంథా తుఫాన్ ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దానికి తగినట్టే చర్యలు తీసుకుంటున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, కర్నూలు జిల్లాలను మినహాయిస్తే తక్కిన రాష్ట్రమంతా ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,204 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 75,802 మందిని ఈ కేంద్రాలకు తరలించారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 38వేల హెక్టార్లలో పంట నీట మునిగిందని ప్రాథమికంగా అంచనా. 1.38లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలు కూడా ప్రభావితం అయినట్లు ప్రభుత్వం అంచనా వేసింది.

తిరుమలలో ఎడతెరిపిలేని వర్షం

తిరుమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తిరుమలలో మంగళవారం ఒక వైపు ఎడతెరిపిలేని వర్షం, మరోవైపు చలిగాలులతో భక్తులు అవస్థలు పడ్డారు. వేకువజాము నుంచి అర్ధ రాత్రి వరకు ఈదురుగాలులతో వాన కురిసింది. వానల వల్ల భక్తుల రద్దీ కూడా తగ్గింది. దర్శనం కోసం 18 కంపార్టుమెంట్లలోనే భక్తులు వేచిఉన్నారు. వీరికి టీటీడీ వేడివేడి అన్నప్రసాదాలు, పాలు అందిస్తోంది. తిరుమలలో స్థానికులు నివాసముండే బాలాజీనగర్ మూడోలైన్‌లో గాలులకు ఓ భారీ వృక్షం పక్కనే ఉన్న ఇళ్లపై వాలిపోయింది. రెండు ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈస్ట్‌బాలాజీనగర్‌లో ఓ చెట్టు కారుపై కూలింది.

సింహగిరి మెట్ల మార్గం మూసివేత

సింహాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా సింహగిరి మెట్ల మార్గంలో భక్తుల రాకపోకలను నిలిపివేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం కొండదిగువన తొలిపావంచా వద్ద, సింహగిరిపై మెట్ల ప్రారంభంలో బారికేడ్లు ఏర్పాటుచేశారు. మెట్లమార్గంలో భారీగా వర్షం నీరు ప్రవహిస్తుండడంతో భక్తులు ప్రమాదాల బారినపడకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. వర్షాలతో సింహగిరి జలకళ సంతరించుకుంది.


విశాఖలోని సీతమ్మధార ప్రాంతంలో కారుపై పడిన భారీ వృక్షం


తూర్పుగోదావరి జిల్లా మార్కొండపాడులో నేలకూలిన టేకు చెట్లు, స్తంభం


కాకినాడ జిల్లా ఉప్పాడ పునరావాస శిబిరంలో ఆహార పంపిణీ


కొవ్వూరు పునరావాస కేంద్రంలో బాధితులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


కాకినాడ జిల్లా తాళ్లరేవు పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న ఎంపీ సానా సతీష్, కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందుమాధవ్

'అన్న క్యాంటీన్'నెట్‌వర్క్‌తో ఆహారం పంపిణీ

మంగళగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 'అన్న క్యాంటీన్' నెట్‌వర్క్‌ను వినియోగించుకుని తుపాను ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు ఆహారం పంపిణీ చేసేందుకు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ చర్యలు చేపట్టింది. ఈమేరకు ఫౌండేషన్ ఏపీ సెంట్రల్ రీజియన్ ఉపాధ్యక్షుడు విలాస దాస మంగళవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని అక్షయపాత్ర కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. పునరావాస కేంద్రాలకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందించే చర్యలు చేపట్టామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, కోనసీమ జిల్లాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర వివరాలకు రఘునందన్ దాస, సెల్: 7386713300 నంబరులో సంప్రదించాలని సూచించారు.

చెన్నైలో 12 విమానాలు రద్దు

చెన్నై, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాజధాని చెన్నైతోపాటు తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు తదితర జిల్లాల్లో మంగళవారం విస్తారంగా వర్షం కురిసింది. చెన్నై నుంచి రాకపోకలు సాగించాల్సిన 12 విమానాలు, కొన్ని రైళ్లు రద్దయ్యాయి. చెన్నై నుంచి విశాఖపట్నానికి వెళ్లే 3 విమాన సర్వీసులు, విశాఖపట్నం నుంచి చెన్నైకి వచ్చే 3 విమాన సర్వీసులు, రాజమండ్రికి ఉదయం 10 గంటలకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి రావాల్సిన సర్వీసులు, విజయవాడ వెళ్లి చెన్నైకి తిరిగొచ్చే నాలుగు విమాన సర్వీసులను కూడా రద్దు చేశారు. చెన్నై నుంచి కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా మెయిల్, విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, తిరుచ్చి నుంచి హౌరా ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయి.

కేకేలైన్‌లో పట్టాలపైకి రాళ్లు, మట్టి

అనంతగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కొత్తవలస-కిరండూల్ (కేకే లైన్) రైలు మార్గంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం చీమిడిపల్లి-బొర్రా స్టేషన్ మధ్య గల టన్నెల్ సమీపాన పట్టాలపైకి రాళ్లు, మట్టి పెళ్లలు భారీగా కొట్టుకు వచ్చాయి. దీంతో ఆ లైన్‌లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.

రైల్వే వార్ రూమ్‌ల ఏర్పాటు

- తుఫాన్ సన్నద్ధతపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమీక్ష

న్యూఢిల్లీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో సత్వర నిర్ణయాలు తీసుకొనేందుకు రైల్వే శాఖ డివిజనల్ వార్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. అవసరమైన యంత్రాలు, సామగ్రిని అందుబాటులో ఉంచింది. ప్రయాణికుల భద్రత, రైళ్ల నియంత్రణ, పునరుద్ధరణ ప్రణాళికలతో పాటు స్థానిక పరిపాలన, విపత్తు నిర్వహణ సంస్థలతో సమన్వయం కోసం తీసుకొంటున్న చర్యలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో ఈస్ట్ కోస్ట్, దక్షిణ మధ్య రైల్వే జీఎంలతో పాటు గుంటూరు, విజయవాడ, వాల్తేరు డీఆర్ఎం పాల్గొన్నారు. సత్వర స్పందన కోసం ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో డివిజనల్ వార్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఏపీ, తెలంగాణ ఒడిశాల్లో తీరం వెంబడి తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలో ముఖ్యమైన వస్తువులు, యంత్రాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు.

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

- అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని ఆ శాఖ డీజీ వెంకటరమణ తెలిపారు. విజయవాడలోని అగ్నిమాపక కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటల పాటు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రభావిత ప్రాంతాల నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకొంటూ సహాయక చర్యలు వేగవంతంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విరిగిపడుతున్న చెట్లు, విద్యుత్ స్తంభాలను మంగళవారం మధ్యాహ్నం నుంచే తొలగిస్తున్నామన్నారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలను అప్రమత్తం చేస్తున్నామని, 5-15 నిమిషాల్లో రోడ్డు, వాతావరణ పరిస్థితిని బట్టి చేరుకొంటున్నాయని వివరించారు. అవసరమైన సహాయక పరికరాలతో పాటు 355 మంది సిబ్బందిని మోహరించినట్లు ఆయన వెల్లడించారు. అవసరాన్ని బట్టి ఇతర ప్రాంతాల నుంచి సిబ్బందిని రప్పించి సిద్ధంగా ఉంచామని చెప్పారు.

అరచేతిలో తుఫాన్ దశ, దిశ..!

- తుఫాను ఎక్కడుందో చెప్పే వెదర్ యాప్స్
- ఎండైనా, వానైనా... వాయుగుండమైనా..
- వాతావరణాన్ని కచ్చితంగా చూపిస్తున్న యాప్స్
- స్మార్ట్ ఫోన్లలో అందుబాటులోకి రకరకాల యాప్స్
- క్షణక్షణం ప్రత్యక్ష సమాచారంతో ప్రజలు అప్రమత్తం
- పంట, ఆస్తి, ప్రాణ నష్టం నివారణకు అవకాశం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీ)

'బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం... వాయుగుండంగా మారి తుఫానుగా బలపడి తీరంవైపు దూసుకొస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.' ఇలాంటి తుఫాను హెచ్చరికలు ఒకప్పుడు రేడియోలో వినేవాళ్లం..! టీవీలు వచ్చిన తర్వాత వాతావరణ బులిటెన్లు చూసి తెలుసుకుంటున్నాం. కానీ... ఇప్పుడు మన అరచేతిలోనే వాతావరణాన్ని అన్ని రకాలుగా విశ్లేషించుకోగలిగే వెదర్ యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. వాయుగుండం ఎలా కదులుతుందో.. తుఫాన్ ఏ దిశగా దూసుకొస్తుందో.. లైవ్‌లో చూసేయొచ్చు. గాలుల వేగం ఎలా ఉంటుందో, వర్షపాతం ఎంత కురుస్తుందో ఇలా ముందస్తు సమాచారాన్ని మనకు చిటికెలో అందిస్తున్నాయి. అధునాతన సాంకేతికతతో రూపుదిద్దుకున్న ఎన్నో ఫోర్ కాస్ట్ (వాతావరణ) యాప్స్ మన ముందు సిద్ధంగా ఉన్నాయి. స్మార్ట్ ఫోన్‌ల్లోకి డౌన్‌లోడ్ చేసేందుకు వీలుగా ప్లేస్టోర్, యాప్ స్టోర్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం మొంథా తుఫాను కదలికలను ఎంతోమంది ఈ యాప్స్ ద్వారానే తెలుసుకుంటున్నారు. ఏ క్షణంలో ఎక్కడెక్కడ వాన పడుతుంది..? ఎంత మేర పడుతుంది..? తుఫాను దిశ ఎలా ఉంది..? ఏ దిక్కులో కదులుతుంది..? ఎన్ని కిలోమీటర్ల వేగంతో కదులుతుంది..? దాని ప్రభావం ఎంత వరకు విస్తరించి ఉంది..? ఎప్పుడు తీరాన్ని తాకుతుంది..? తీరాన్ని తాకిన తర్వాత దాని ప్రభావం ఎన్ని రోజులు ఉంటుంది..? ఇలాంటి అనేక ప్రశ్నలకు ఈ యాప్స్ చక్కని సమాధానాలుగా నిలుస్తున్నాయి. వాతావరణ స్థిరత్వంతో పాటు మార్పులతో కూడిన క్షేత్ర స్థాయి సమాచారాన్ని ఈ యాప్‌లు మనకు అందిస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా మచిలీపట్నం సముద్ర తీరానికి మొంథా తుఫాను ఉన్న దూరాన్ని, అది కదులుతున్న తీరును, దాని ప్రభావం విస్తరించిన ప్రాంతాన్ని ఈ యాప్స్ స్పష్టంగా తెలియజేస్తున్నాయి.



నష్ట నివారణకు అవకాశం

రెండు దశాబ్దాలుగా సాంకేతికత బాగా అభివృద్ధి చెందింది. స్మార్ట్‌ఫోన్ల రాకతో అనేక రకాల వెదర్ యాప్స్ రూపంలో వాతావరణ సమాచారం అరచేతిలోకి వచ్చింది. ఈ సమాచారంతో అన్నదాతలు అప్రమత్తమవుతున్నారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు, నదీ పరివాహకంలోని గ్రామాల ప్రజలకు ఈ సమాచారం మేలు చేస్తోంది. ప్రళయాలను సమయస్ఫూర్తితో ఎదుర్కొనే అవకాశం కలుగుతోంది. ఈ యాప్‌లు ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారిస్తున్నాయి.

ప్రముఖ వెదర్ యాప్స్ ఇవే..

వెదర్ ఫోర్ కాస్ట్, లైవ్‌వెదర్, వెదర్ అండ్ రాడార్, ద వెదర్ చానెల్, విండీ, యాక్యూ వెదర్, వెదర్ రాడార్, యాహూవెదర్, లోకల్ వెదర్, డైలీ ఫోర్‌కాస్ట్, వెదర్ ఫోర్‌కాస్ట్, వెదర్24, వెదర్ అండర్ గ్రౌండ్, జూమ్ ఎర్త్, వెదర్ లైవ్, టుడే వెదర్, ద వెదర్ నెట్‌వర్క్, రెయిన్‌బో వెదర్, రెయిన్ వ్యూవర్, హాలో వెదర్, రెయిన్ అలారం, వెదర్ ప్రో, విండ్ హబ్, ఓపెన్ వెదర్, ఓవర్ డ్రాప్..

నిలిచిన ప్రజా రవాణా

- ఆగిన ఆర్టీసీ, రైళ్ల సర్వీసులు
- ప్రయాణాలు ఆపుకొన్న ప్రజలు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావిత తీర ప్రాంత జిల్లాల కు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఎక్కువ శాతం రద్దయ్యాయి. మంగళవారం అరకొరగా నడిచినా అవీ ఖాళీగా కనిపించాయి. నిత్యం కిటకిటలాడే విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ జనం లేక బోసిపోయింది. రిజర్వేషన్ చేసుకున్న వారు సైతం ప్రయాణాలను రద్దు చేసుకొన్నారు. హైదరాబాద్, కర్నూలు, తిరుపతి వైపు వెళ్లే బస్సుల్లో తక్కువగానే ప్రయాణికులు కనిపించారు. రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాలకు బస్సు సర్వీసులను రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కృష్ణా జిల్లాలో మాత్రం వాతావరణం అనుకూలంగా ఉన్న ప్రాంతాలకు బస్సులు నడిపారు. ప్రతి రోజూ 400కుపైగా బస్సులు తిరిగే విజయవాడ బస్టాండ్ నుంచి మంగళవారం 230 బస్సులు మాత్రమే తిరిగాయి. తుఫాను తీవ్రత నేపథ్యంలో ప్రయాణికుల భద్రతతో పాటు సంస్థకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్టీసీ మొంథా ప్రభావిత ప్రాంతాల బస్సులు రద్దు చేసి ప్రయాణీకులకు ముందస్తు సందేశాలు పంపించింది.

నేటి పలు రైలు సర్వీసులు రద్దు

తుఫాన్ నేపథ్యంలో బుధవారం నడిచే 37 సర్వీసులను రైల్వే శాఖ రద్దు చేసింది. కాకినాడ, తెనాలి, రేపల్లె, మచిలీపట్నం, నర్సాపూర్, నిడదవోలు, ఒంగోలు, భీమవరం, మాచెర్ల తదితర ప్రాంతాల నుంచి నడిచే ప్యాసింజర్ రైళ్లు ఆపేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వివరించారు. గుంటూరు, విశాఖపట్నం మధ్యలో నడిచే రైళ్లు ఎక్కువగా రద్దయ్యాయని, దూర ప్రాంతాలకు వెళ్లే ఆరు రైళ్లను దారి మళ్లించినట్లు చెప్పారు. మరో పద్దెనిమిది రైళ్ల సమయ వేళల్ని మార్పు చేశామని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు రద్దు చేసుకోవాలని సూచించారు. టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించినట్లు తెలిపారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో మరో 24 రైళ్లను రద్దు చేశారు. వాల్తేరు డివిజన్ అధికారులు మంగళవారం 23 రైళ్లను రద్దు చేశారు. మరో 15 రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. ఎన్‌టీఈఎస్ యాప్ ద్వారా రైళ్ల రాకపోకల వివరాలు తెలియజేస్తోన్న రైల్వే శాఖ.. విజయవాడ కంట్రోల్ రూమ్‌లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసింది. విజయవాడ-0866 2575167, గూడూరు- 08624-250795, గుడివాడ-78159 09462, నెల్లూరు-90633 47961, ఒంగోలు- 78159 09489, బాపట్ల-78159 09329, తెనాలి-78159 09463, ఏలూరు-75693 05268, రాజమండ్రి-83319 87657, సామర్లకోట-7382383188, తుని-78159 09479, అనకాపల్లి-75693 05669, భీమవరం-78159 09402 నంబర్లకు ఆయా ప్రాంతాల ప్రజలు అత్యవసరమైతే సంప్రదించవచ్చు.


కోనసీమ జిల్లా ఓడలరేవు పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావు


నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం నేలంపాడులో పొలాల్లో ప్రవహిస్తున్న వాన నీరు


ఏలూరు జిల్లా కలపర్రు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు నిలిపివేసిన వాహనాలు


కోనసీమ జిల్లా జొన్నాడ హైవేపై కూలిన వృక్షాలను తొలగిస్తున్న దృశ్యం


నీటమునిగిన ఒంగోలులోని కర్నూలు రోడ్డు



మంగళవారం తుఫాను ధాటికి కృష్ణా జిల్లాలో నేలకొరిగిన వరిపైరు

రైతు కంట కన్నీరు

పంటలను ముంచిన తుఫాను

తుఫాను ప్రభావంతో అనేక జిల్లాల్లో పంట నీటిపాలైంది. పశ్చిమగోదావరి జిల్లాలో 3600 ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. ఏలూరు జిల్లాలో 1506.71 హెక్టార్లలో వరి, మినుము పంట చేలు నేలకొరగటంతోపాటు ముంపునకు గురయ్యాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలంలో సుమారు 200 ఎకరాల్లో వరి పంట నీటి మునిగినట్లు అంచనా వేశారు. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో బొప్పాయి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. గుంటూరు జిల్లాలోని తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, చుండూరు, అమృతలూరు మండలాల్లో అక్కడక్కడ వరి చాపలా నేలపై పరుచుకుపోయింది. అరటి, తమలపాకు, బొప్పాయి తోటలు నేలవాలాయి. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 350 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందని.. ఇంకా మరింత పెరిగే అవకాశముందని ప్రాథమిక సమాచారం అందింది. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి, మామిడి, జీడిమామిడి, అరటి మొక్కలు నేలకొరిగిపోయాయి.



శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం జగన్నాథపురంలో నీటమునిగిన వరిపంట

అలసత్వం వద్దు

» విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు వేగంగా చర్యలు తీసుకోండి: సీఎస్

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాను అనంతరం విద్యుత్తు సరఫరా పునరుద్ధరణలో ఎలాంటి అలసత్వం చూపవద్దని, వీలైనంత వేగంగా సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. మొంథా తుఫాను సన్నద్ధతపై మంగళవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. రాత్రంతా సచివాలయంలోనే ఉన్న సీఎస్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ మార్గాల్లో విద్యుత్తు సరఫరాకు సిద్ధంగా ఉండాలన్నారు. తగినంత సామగ్రిని, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్సులో.. జెన్కో ఎండీ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మూడు డిస్కంల ఎండీలు పాల్గొన్నారు.

విజయవాడకు నేవీ ఉన్నతాధికారులు

» సహాయక చర్యలకు సిద్ధంగా చేతక్, కార్గో హెలికాప్టర్లు

విశాఖపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సహాయక చర్యల కోసం తూర్పు నౌకాదళంలోని ఉన్నతాధికారుల బృందం మంగళవారం విజయవాడకు తరలి వెళ్లింది. తుఫాన్ కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం ఉన్నందున, విజయవాడలో ఉండి ముఖ్యమంత్రి కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. దీనికోసం తుఫాను బాధితులను గుర్తించి రక్షించేందుకు చేతక్ హెలికాప్టర్లను సిద్ధం చేశారు. అలాగే వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలకు ఆహార పదార్థాలు, ఇతర సామగ్రి అందించేందుకు కార్గో హెలికాప్టర్లల్లో సరకులు నింపి ఉంచారు.

క్షణాల్లో వాయిస్ అలెర్ట్ మెసేజ్‌లు

అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను సమాచారాన్ని ప్రజలకు వివిధ రూపాల్లో అందించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కోస్తా జిల్లాల్లోని 26 తీర ప్రాంత గ్రామాల్లో ప్రయోగాత్మకంగా తుఫాను హెచ్చరికలను రియల్ టైమ్ వాయిస్ అలెర్ట్ రూపంలో క్షణాల్లో అందిస్తున్నారు. విద్యుత్ అంతరాయం జరిగినా 360 డిగ్రీల హార్న్ స్పీకర్ వ్యవస్థ కిలోమీటర్ పరిధిలో కూడా స్పష్టమైన హెచ్చరికలు అందిస్తుంది. ఈ వ్యవస్థని మరిన్ని గ్రామాలకు విస్తరించనున్నారు.

ఏడు జిల్లాల్లో రహదారులపై వాహనాలు బంద్

మొంథా ప్రభావం ఉన్న ఏడు జిల్లాల పరిధిలోని జాతీయ రహదారులపై వాహనాలను మంగళవారం రాత్రి 8.30 గంటల నుంచి ప్రభుత్వం నిలిపివేసింది. కాకినాడ, కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు, రంపచోడవరం డివిజన్లలో మంగళవారం రాత్రి 8.30 నుంచి బుధవారం ఉదయం 6గంటల వరకు వాహనాలను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ప్రభుత్వం ఆదేశించింది. అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే వారికి మినహాయింపు ఇవ్వాలని సూచించింది.

చెట్లు కూలి ఇద్దరు మహిళల మృతి

రాష్ట్రవ్యాప్తంగా చెట్లు కూలి ఇద్దరు మహిళలు మరణించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మాకనపాలెం గ్రామానికి చెందిన మహిళ గూడపల్లి వీరవేణు(49) మంగళవారం అదే గ్రామంలో అనారోగ్యం పాలైన ఆడపడుచు కుమారుడిని పలకరించడానికి వారి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈదురుగాలులకు తాడిచెట్టు విరిగి ఆమెపై పడడంతో అక్కడికక్కడే మరణించారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం పీఎంలంక గ్రామానికి చెందిన సంకరపు పార్వతి(80) బహిర్భూమికి వెళ్లగా చెట్టు కొమ్మ విరిగి ఆమె తలపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు.

తుఫానులో అంత్యక్రియలకు ఇబ్బందులు

శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట మండలం మిరియాపల్లిలో సోమవారం రాత్రి ఓ వృద్ధురాలు మృతి చెందారు. వంశధార నదిలో నీటిమట్టం పెరగడంతో గ్రామ సమీప తోటలోనే అంత్యక్రియలకు ఉపక్రమించారు. పంట పొలాల్లోనూ వర్షం నీరు చేరడంతో ఆ నీటిలోనూ ఇబ్బందులు పడుతూ మృతదేహాన్ని తీసుకెళ్లి దహన సంస్కారాలు పూర్తిచేశారు.

గర్భిణికి కష్టాలు

విజయనగరం జిల్లా మెంటాడ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన గర్భిణి మీసాల కృష్ణవేణికి పురిటి నొప్పులు రావడంతో అతికష్టం మీద ఆస్పత్రికి తరలించారు. ఈ గ్రామం చంపావతి నది ఆవల ఉండడం.. వర్షాలకు నదిపై పైపు కల్వర్టు కొట్టుకుపోవడంతో ఆమెను ఆటోలో ఆండ్ర గ్రామం వరకు తీసుకెళ్లారు. దారిలో అనేకచోట్ల ఆటో దిగబడిపోవడంతో నెట్టుకొంటూ ఆండ్ర వరకు తీసుకొచ్చారు. అక్కడ 108 వాహనంలో మెంటాడ పీహెచ్‌సీ వైద్యులు కల్పన, లోకప్రియ ప్రాథమిక చికిత్స అందించి గజపతినగరం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.

వృద్ధురాలు గల్లంతు

మనుబోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా మనుబోలు మండలం గొట్లపాళెం గ్రామానికి చెందిన కిష్టమ్మనేని జయమ్మ (65) మంగళవారం ఉదయం పశువులను మేపేందుకు తోలుకెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తూ పొట్టేళ్ళవాగు ఉధృతికి కొట్టుకుపోయారు. పోలీసులు గాలింపు చేపట్టారు.

ఊరు పేరు	వర్షపాతం (సెం.మీ.లలో...)
కావలి	22
ఉలవపాడు	17
దగదర్తి	15
సింగరాయకొండ	12
ఒంగోలు	10
నెల్లూరు	10
శృంగవరపుకోట	8.6
ప్రకాశం-సీఎస్ పురం	7.7
చీరాల	5.8

తుఫాన్ తర్వాత కూడా

అప్రమత్తంగా ఉండాలి

» సమస్య ఉన్న చోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉండాలి: సీఎం

» కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్

» అర్ధరాత్రి వరకు సచివాలయంలోనే మకాం

» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా హాజరు

» మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం

అమరావతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సమస్య ఉందనుకున్న ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉండాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులు ఉంటే.. ప్రజలకు భరోసా ఇచ్చినట్లవుతుందని చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి వరకు ఆయన అమరావతి సచివాలయంలోనే ఉండి విరామం లేకుండా వరుస సమీక్షలు జరిపారు. ఆర్‌టీజీఎస్ నుంచి మూడు సార్లు సమీక్షలు చేసిన ఆయన.. రెండు సార్లు కలెక్టర్లు, అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లు జరిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. తుఫాన్ కారణంగా ప్రాణ నష్టం లేకుండా, ఆస్తి నష్టం ఎక్కువ జరగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సీఎం చెప్పారు. ఆర్‌టీజీఎస్‌కు వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి, రియల్ టైమ్‌లో సమస్యల పరిష్కారానికి.. అంటే గాలికి పడిపోయిన చెట్ల తొలగింపు, సబ్‌స్టేషన్లలో సమస్యలను తక్షణం పరిష్కరించేలా ఆయన చర్యలు చేపట్టారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో సహాయ చర్యలపై మంత్రులు, అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలకు వెళ్లిన మంత్రులు, ప్రత్యేక అధికారులతో నిరంతరం చర్చిస్తూ వచ్చారు. 'తుఫాన్ ప్రభావం వల్ల కరెంట్ కట్ చేయాల్సి రావచ్చు. ముందుగానే ప్రజలకు క్యాండిళ్లను సరఫరా జరిగేలా చూడాలి. పునరావాస శిబిరాల్లో ఉండే వారికి లోటు లేకుండా చూసుకోవాలి. తుఫాన్ ప్రభావం ఉండే ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసుకుని, జాతీయ రహదారులపై రాకపోకలను నిలిపివేయాలి. ఆ పరిస్థితి వస్తే ముందుగానే సమాచారాన్ని అందించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి' అని ఆదేశించారు.



ఆర్టీజీఎస్ కేంద్రంలో తుఫాను పరిస్థితిపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రంలో మంత్రులు, అధికారులు

గత తుఫాన్ల నష్టాన్ని బేరీజు వేసుకుని చర్యలు

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు మంత్రులు, అధికారులకు స్పష్టంచేశారు. వర్ష ప్రభావంతో ఆకస్మికంగా వాగులు పొంగి ప్రవహించే అవకాశమున్న చోట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు మరిన్ని సహాయ బృందాలను, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశించారు. గాలులు, వర్ష తీవ్రతను అంచనా వేస్తూ, అందుకు తగట్టుగా యంత్ర సామగ్రిని, సమాచార పరికరాలను, అత్యవసర యంత్రాలను, బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత గ్రామ/వార్డు సచివాలయాల నుంచి క్షేత్ర స్థాయి సమాచారం తెప్పించుకుని విశ్లేషించుకోవాలన్నారు. గతంలో హుద్‌హుద్ తుఫాన్ సృష్టించిన విధ్వంసం నుంచి ప్రజలను నాలుగు రోజుల్లోనే తిరిగి బయటకు తెచ్చామని సీఎం గుర్తు చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదైనందున ఆ ప్రాంతంలోని ఎర్ర కాలువకు ఎగువ నుంచి అకస్మాత్తుగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయడంతో పాటు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని సూచించారు. గతంలో వచ్చిన తుఫాన్లతో జరిగిన నష్టాన్ని బేరీజు వేసుకుని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని, చెట్లు, టవర్లు, హోర్డింగ్‌లు పడిపోయిన ప్రాంతాలను గుర్తించి, తక్షణం పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో కమ్యూనికేషన్ కోసం పోలీసు విభాగం 81 టవర్లతో వైర్‌లెస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసిందని, 2,703 జనరేటర్లను కూడా ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. వర్షప్రభావంతో కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇప్పటి వరకు 43 వేల హెక్టార్ల పంట నీట మునిగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. తుఫాను కారణంగా వేటకు వెళ్లలేకపోయిన మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు.

సీఎంకు అశ్వినీ వైష్ణవ్ ఫోన్.. తుఫాన్ పరిస్థితిపై చంద్రబాబుకు కేంద్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్, రైల్వే శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఫోన్ చేశారు. సహాయ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనకు సీఎం 'ఎక్స్'లో ధన్యవాదాలు తెలిపారు.

అధికారులు గ్రామాల్లో ఉంటే ప్రజలకు నమ్మకం: సీఎం

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు ఐదారుగురు అధికారులతో ఓ బృందాన్ని పంపాలని సీఎం ఆదేశించారు. వారు గ్రామాల్లో ఉంటే ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. కాలువలు, చెరువులు, రోడ్లకు ఎక్కడైనా కోతలు, గండ్లు పడ్డాయా అనే అంశంపై రాత్రిపూట కూడా పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తుఫాన్ తీరం దాటిన తర్వాత శాఖలవారీగా నష్టం అంచనా నివేదికలను సిద్ధం చేసుకోవాలని, ప్రాథమిక అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి వీలైనంత త్వరగా పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ ప్రభావం తగ్గగానే యుద్ధ ప్రాతిపదికన విద్యుత్‌ను పునరుద్ధరించాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఏలేశ్వరం రిజర్వాయరు, బుడమేరు తదితర వాగుల్లో ప్రవాహాలపై సీఎం ఆరా తీశారు. వరద నిర్వహణకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సీఎం సూచించారు.

మీరే ప్రభుత్వ ప్రతినిధులు..

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో గ్రామ/, వార్డు సచివాలయాల సిబ్బందితోనూ ఆర్‌టీజీఎస్ నుంచి సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వ ప్రతినిధులు గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందే. బాధితులకు తక్షణ సాయం అందేలా చూడాలి. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన చోట వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు.



తుఫానుపై సమీక్షించి మంగళవారం అర్ధరాత్రి సచివాలయం నుంచి తిరిగి బయలు దేరుతున్న సీఎం

రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి: పవన్

తుఫాన్ కారణంగా రోడ్ల ధ్వంసం జరిగితే, రోడ్లపై చెట్లు, విద్యుత్ స్తంభాలు పడితే వెంటనే తొలగించి.. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్ర స్థాయి యంత్రాంగంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారని, అందరూ ఫీల్డ్‌లో ఉన్నారని లోకేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. సమీక్షల్లో సీఎస్ విజయానంద్, మంత్రులు నారాయణ, అనిత, సత్యప్రసాద్, డీజీపీ గుప్తా పాల్గొన్నారు.

7 జిల్లాలపై పంజా!

» పెనుగాలులు, భారీ వర్షాలతో అల్లకల్లోలం

» విద్యుత్తు సరఫరా లేక అంధకారంలో గ్రామాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలోని ఏడు తీర ప్రాంత జిల్లాలపై మొంథా తుఫాన్ పంజావిసిరింది. ప్రచండ వేగంతో వీచిన పెనుగాలులు, భారీవర్షాలతో బీభత్సం సృష్టించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అప్పటికప్పుడు కుంభవృష్టి పడటం, ఆ తర్వాత పెనుగాలులు విరుచుకుపడడం, మళ్లీ కాసేపటికి ఒక్కసారిగా తీవ్రంగా ఎండ కాయడం.. ఇలా గంటకో రకంగా వాతావరణం మారిపోతూ జనాన్ని హడలెత్తించింది. గతంలో ఏ తుఫాన్ సమయంలోనూ లేనంతగా ఉప్పాడ వద్ద సముద్రం విలయ తాండవం చేసింది. భారీ శబ్దాలతో 10 మీటర్లకు పైగా ఎత్తులో కెరటాలు ఎగసిపడటంతో కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో 10 కిలోమీటర్ల మేర పరిస్థితి భయానకంగా మారింది. కోనసీమ జిల్లాలో గంటకు 80 కిలోమీటర్లకు మించిన వేగంతో గాలులు విరుచుకుపడ్డాయి. భారీ వృక్షాలు, వేలాది కొబ్బరి చెట్లు కూలిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో మధ్యాహ్నం నుంచి జిల్లావ్యాప్తంగా కరెంటు సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం నుంచి రహదారులపై రాకపోకలను నిలిపివేసినట్టు అధికారులు ప్రకటించారు. తుఫాన్ తీవ్రత అధికంగా ఉండడంతో కాకినాడ పోర్టులో పదో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో వేలాది చెట్లు నేలకొరగడంతో రాత్రి 7గంటల వరకు సాధ్యమైనన్ని తొలగించి వైద్యుత్ లైన్లు సరిచేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి.

విశాఖలో... మొంథా తుఫాన్ విశాఖపట్నం జిల్లాపై తీవ్ర ప్రభావం చూపించింది. ఎక్కడికక్కడ చెట్లు మొదళ్లతో సహా నేలకు ఒరిగిపోయాయి. కొన్నిచోట్ల చెట్లు పడి కార్లు ధ్వంసమయ్యాయి. బీచ్ రోడ్డులో సీతకొండపైనుంచి బండరాళ్లు జారి పడ్డాయి. వర్షాలకు కొండలపై నుంచి నీటితోపాటు కొండచిలువ కూడా కొట్టుకురావడంతో ఆరిలోవలో కలకలం రేగింది.

కృష్ణాలో పెనుగాలులతో భారీ వర్షం

కృష్ణాజిల్లాలో మొంథా బీభత్సం సృష్టించింది. తీరప్రాంతంలో పెనుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. బలమైన గాలులధాటికి రహదారులపై వృక్షాలు విరిగి పడి రాకపోకలు నిలిచిపోయాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. 2 నుంచి 3 మీటర్ల మేర అలలు ఎగసిపడ్డాయి. మంగినపూడి బీచ్ వద్ద సముద్రం 300 మీటర్లు ముందుకొచ్చింది. 165 పునరావాస శిబిరాల్లో 6,618 మందికి ఆశ్రయం కల్పించారు. మంగళవారం రాత్రి కృష్ణాజిల్లాలోని తీర ప్రాంతంలో చాలావరకూ విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో చీకట్లు అలముకున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో పెద్దగా తుఫాన్ ప్రభావం కనిపించలేదు.

వణికిన 'పశ్చిమ'

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపై మొంథా తుఫాన్ విరుచుకుపడింది. పెనుగాలులతో తీరప్రాంతాన్ని వణికించింది. నర్సాపురం, మొగల్తూరు, యలమంచిలి, కాళ్ల మండలాల్లో భారీ వృక్షాలు కూకటివేళ్లతో సహా నేలకొరిగాయి. పశ్చిమలో మంగళవారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురిసింది. సాయంత్రానికి గాలుల తీవ్రత మరింత పెరిగింది. రాత్రి 7.30 గంటల నుంచి పరిస్థితి భయానకంగా మారింది. సముద్రం అల్లకల్లోలంగా మారి 100 మీటర్లు ముందుకు చొచ్చుకొచ్చింది. అలలు ఎగసిపడుతుండటంతో పీఎం లంక వద్ద గట్టు కోతకు గురైంది. అలల హోరుకు తీర ప్రాంత ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. గాలులకు పలుచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక ఏలూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కైకలూరు మండలంలో కొల్లేరు వరద ఉధృతి పెరిగింది. ఈ జిల్లాలో ఏర్పాటు చేసిన 82 పునరావాస కేంద్రాలకు ముంపు ప్రాంతాల ప్రజలను తరలించారు.

మన్యంలో పరిస్థితి ఏమిటి?

మంత్రి సంధ్యారాణికి సీఎం చంద్రబాబు ఫోన్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సీఎం చంద్రబాబు మంత్రి సంధ్యారాణికి ఫోన్ చేసి పార్వతీపురం మన్యం జిల్లాలో పరిస్థితిపై ఆరా తీశారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని మంత్రి వివరించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోనసీమ ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు సూచనలిచ్చారు. కృష్ణాజిల్లాలో మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర సమీక్ష జరిపారు. కేంద్ర మంత్రి శ్రీనివాస్‌వర్మ, మంత్రి గొట్టిపాటి, డిప్యూటీ స్పీకర్ రఘురామ పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించారు. ఏలూరు జిల్లాలో మంత్రి పార్థసారథి పర్యవేక్షిస్తున్నారు. మంత్రి కొండపల్లి మత్స్యకారులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో మంత్రి స్వామి సింగరాయకొండ మండలంలో పర్యటించారు.

ప్రాణనష్టం లేకుండా చూడడమే లక్ష్యం!

ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల్లోనే ఉండాలి: లోకేశ్



అమరావతి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని, ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం లేకుండా చూడాలన్న లక్ష్యంతో పని చేస్తోందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో హోంమంత్రి అనితతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 లక్షల మందిపై ప్రభావం ఉండే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. '1,238 గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాం. 1,906 తాత్కాలిక సహాయ శిబిరాలు ఏర్పాటు చేశాం. సహాయ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం' అని వివరించారు. తాగునీటి సరఫరాపైనా దృష్టి సారించామన్నారు. హోంమంత్రి అనిత, తాను తుఫాను ప్రాంతాల ప్రజాప్రతినిధులతో మాట్లాడి వారిని అప్రమత్తం చేశామని తెలిపారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ఉండాలని ఆదేశిస్తున్నామన్నారు. ప్రజలు ఇబ్బందులు ఉన్న చోట ఫొటోలు తీసి పంపితే స్పందిస్తామని చెప్పారు.



తంబళ్లకుంట వాగు ముంపులో ఉన్న వారిని ఎక్స్‌కవేటర్ ఎక్కించి సంతనూతలపాడు పునరావాస కేంద్రానికి తరలిస్తున్న అధికారులు





1 అనంతగిరి మండలం చిమిడిపల్లి-బొర్రా రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలపైకి కొట్టుకువచ్చిన రాళ్లు, మట్టి

2 సముద్ర కెరటాల ధాటికి ధ్వంసమైన ఉప్పాడ బీచ్ రోడ్డు

సింహాచలం మెట్లమార్గంలో పారుతున్న వర్షపు నీరు



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.